అనుదినం... జనస్వరం
www.navatelangana.com
# నవతెలంగాణ
శనివారం 08-06-2024
సమగ్ర తెలుగు దినపత్రిక
సంపుటి : 10 | సంచిక : 109 | Published from Khammam, Rangareddy, Hyderabad, Karimnagar | 12 పేజీలు | వెల : 6.50

# రైతులు అధైర్య పడొద్దు

## వర్షాకాలం పంటలకు నీరందిస్తాం : భారీ నీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి

నవతెలంగాణ- భూపాలపల్లి/మంథని

రైతులు అధైర్య పడొద్దు.. ఈ వానాకాలం సీజన్‌కు సాగునీళ్లిస్తామని భారీ నీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి అన్నారు. గత ప్రభుత్వం నాసిరకంగా నిర్మించడం వల్లే మేడిగడ్డ కుంగిందన్నారు. ప్రాజెక్టు రిపేర్లను గత ప్రభుత్వం పట్టించుకోలేదని, అందుకుని యుద్ధ ప్రాతిపదికన మరమ్మతులు చేస్తున్నట్టు తెలిపారు. కాళేశ్వరం ప్రాజెక్టులో భాగమైన మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల వద్ద మరమ్మతు పనులు చేపట్టినట్టు చెప్పారు. శుక్రవారం జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని అన్నారం, మేడిగడ్డ లక్ష్మీబ్యారేజ్, పెద్దపల్లి జిల్లాలోని సుందిళ్ల(పార్వతి) బ్యారేజీని మంత్రి సందర్శించారు. మరమ్మతు పనులను పరిశీలించి.. ఇంజినీర్లను వివరాలు అడిగి తెలుసుకున్నారు. మేడిగడ్డలోని ఎల్‌ఎంటీ క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో మంత్రి మాట్లాడారు.

ప్రాజెక్టు మరమ్మతులను గత ప్రభుత్వం పట్టించుకోలేదని, తాము అధికారంలోకి రాగానే నేషనల్ డ్యామ్ సేఫ్టీ అధికారులతో ప్రాజెక్టును సందర్శించి ప్రాజెక్టు రక్షణ కోసం 3 ఏజెన్సీలకు పనులు అప్పగించినట్టు తెలిపారు. ప్రాజెక్టు నిర్మాణంలో జరిగిన తప్పిదాలను తెలుసుకునేందుకు జస్టిస్ ఘోష్ కమిషన్ బ్యారేజీ సందర్శనకు వస్తుందన్నారు. తమ మ్యానిఫెస్టోలో చెప్పిన విధంగా తమ్మిడిహెట్టి ప్రాజెక్టు తప్పనిసరిగా నిర్మిస్తామన్నారు. వర్షాకాలం లోపు మరమ్మతులు వేగవంతం చేసి రైతులకు సాగునీరు అందించేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. అన్నారం ప్రాజెక్ట్‌లో 60శాతం, మేడిగడ్డ లక్ష్మీ బ్యారేజ్‌లో 80 శాతం పనులు పూర్తి కావొచ్చాయన్నారు. సుందిళ్లలో మాత్రం పనులు నత్తనడకన సాగుతుండటంతో అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు.

కాళేశ్వరం ప్రాజెక్ట్ కట్టడానికి గత ప్రభుత్వం రూ.94 వేల కోట్లు ఖర్చు చేస్తే లక్ష ఎకరాల ఆయకట్టు మాత్రమే తయారైందని, అది కూడా ఇప్పుడు కుంగుబాటుకు గురైందని అన్నారు. కాళేశ్వరం ప్రాజెక్ట్‌లోని మూడు బ్యారేజీలకు నష్టం వాటిల్లిందని తెలిపారు. గత ప్రభుత్వం చేసిన 94 వేల కోట్ల రూపాయలకు వడ్డీ కడుతున్నామన్నారు. మేడిగడ్డ బ్యారేజ్‌ను ఎల్అండ్‌టి, అన్నారం ఆఫ్రాన్ కన్‌స్ట్రక్షన్స్, సుందిళ్ల బ్యారేజీని నవయుగ కంపెనీలతో తాత్కాలిక మరమ్మతులు చేపిస్తున్నామన్నారు. కాళేశ్వరం ప్రాజెక్ట్‌పై జ్యుడీషియల్ విచారణ నడుస్తోందని తెలిపారు. ప్రజాధనాన్ని దుర్వినియోగం చేసిన దోషులకు శిక్ష తప్పదని అన్నారు. గత ప్రభుత్వం పాలమూరు-రంగారెడ్డికి రూ.23,500 కోట్లు ఖర్చు పెట్టి ఎకరం ఆయకట్టు ఇవ్వలేదన్నారు. సీతారామ ప్రాజెక్టుకు రూ.7000కోట్లు ఖర్చుపెట్టినా ఎకరం ఆయకట్టు ఇవ్వలేదన్నారు. గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడే తుమ్మిడిహట్టి దగ్గర రూ.38వేల కోట్లతో 16లక్షల ఎకరాలకు సాగునీరు అందించేందుకు డిపిఆర్ సిద్ధం చేసినట్టు తెలిపారు. గత ప్రభుత్వం ఆ ప్రాజెక్టు పక్కన పెట్టి కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణం చేస్తే దీని కరెంట్ బిల్లే రూ.10 వేల కోట్లు వస్తోందని ఎద్దేవా చేశారు. తక్కువ ఖర్చుతో ఎక్కువ ఎకరాలు సాగులోకి తీసుకురావడానికి ప్రయత్నాలు చేస్తున్నామని తెలిపారు.

### సుందిళ్ల మరమ్మతులపై అసంతృప్తి

సుందిళ్ల బ్యారేజ్ పునరుద్ధరణ పనుల్లో ఆలస్యంపై మంత్రి ఉత్తమ్ అసంతృప్తి వ్యక్తం చేశారు. యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని సంబంధిత ఇంజినీరింగ్ అధికారులను, గుత్తేదారు ఏజెన్సీలను ఆదేశించారు. జాతీయ డ్యామ్ సేఫ్టీ అథారిటీ అందించిన సూచనల ప్రకారం మరమ్మతులు, పునరుద్ధరణ పనులు వేగవంతంగా పూర్తి కావాలన్నారు.



క్షేత్రస్థాయిలో పనుల పురోగతిలో ఆశించిన మేర ఫలితం కనపడటం లేదని, అదనపు బృందాలను ఏర్పాటు చేసి పనులు వేగవంతం చేయాలని అధికారులను, గుత్తేదారులను ఆదేశించారు. ఏ పని ఎప్పటి వరకు పూర్తవుతుందో కాగితంపై షెడ్యూల్ రూపొందించి అందించాలన్నారు. బ్యారేజ్ సమీపంలో గల పంప్‌హౌస్ సంరక్షణ కోసం నిర్మిస్తున్న కట్ట వల్ల స్థానికులకు కలిగే నష్టాన్ని స్థానిక మంత్రితో కలిసి అంచనా వేసి పరిష్కార మార్గాలను సూచిస్తూ ప్రతిపాదనలు సమర్పించాలని సంబంధిత ఇంజినీరింగ్ అధికారిని ఆదేశించారు. మంత్రి వెంట ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి, భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు, భూపాలపల్లి జిల్లా కలెక్టర్ భవేష్ మిశ్రా, ఎస్పీ కిరణ్ ఖరే, నీటిపారుదల శాఖ ఈఎస్‌సీ జనరల్ జి.అనిల్ కుమార్, ఇంజినీర్లు, ఎల్అండ్‌టీ, అస్కాన్, నవయుగ సంస్థల ప్రతినిధులు తదితరులు ఉన్నారు.

### జాతీయ హోదా ఇవ్వలేదు..

కాళేశ్వరం ప్రాజెక్టుకు కేంద్రం జాతీయ హోదా ఇవ్వలేదని గత ప్రభుత్వ నాయకులు తెలిపారని, తాము అధికారంలోకొచ్చిన తర్వాత కేంద్ర జల వనరులశాఖ మంత్రిని కలిస్తే అసలు జాతీయ హోదా కోసం వారు దరఖాస్తు చేసుకోలేదని తెలిపారన్నారు. పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టుకు జాతీయ హోదా కల్పించాలని కోరితే 60శాతం నిధులు కేంద్రం నుంచి కల్పిస్తామని హామీ ఇచ్చారన్నారు. తుమ్మిడిహట్టి నుంచి ఎల్లంపల్లి వరకు గతంలోనే డిజైన్ చేసిన డీపీఆర్ ప్రకారం పనులు పూర్తి చేస్తామని తాము మ్యానిఫెస్టోలో కూడా ప్రకటించినట్టు గుర్తు చేశారు.

ఎల్అండ్‌టి ఇంజినీరింగ్ చీఫ్ మాట్లాడుతూ.. ఎన్‌డీఎస్‌ఏ కమిటీ సూచనల మేరకు జీఆర్‌పీ టెస్ట్, ఈఆర్‌పి టెస్ట్, స్కైండ్ ఫైల్స్, ఇంటిగ్రిటిసిటీ చేయమన్నారని, గేట్లు ఎత్తి ఉంచాలని తెలిపారన్నారు. వరదలు వస్తే 5మీటర్ల ఎత్తులో జియో ట్యూబ్‌లు ఏర్పాటు చేస్తే నీటిని ఎత్తిపోయొచ్చన్నారు. అన్నారంలో 11మీటర్లు నీటిని ఆపితే ఎత్తిపోయొచ్చని, సుందిళ్లలో 9 మీటర్లు ఆపితే ఎత్తిపోయొచ్చని అన్నారు.

## పార్లమెంట్‌లో ప్రజల గొంతుకనై నిలుస్తా..

- పేదలకు ఇండ్లు, స్థలాల పట్టాలకు కృషి : వరంగల్ ఎంపీ కడియం కావ్య
- సీపీఐ కార్యాలయం సందర్శన.. నేతలకు కృతజ్ఞతలు



నవతెలంగాణ -హనుమకొండ చౌరస్తా

పార్లమెంటులో వరంగల్ ప్రజల గొంతుకనై నిలుస్తానని ఎంపీ కడియం కావ్య అన్నారు. ఎంపీగా గెలిచిన కడియం కావ్య స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరితో కలిసి శుక్రవారం హనుమకొండ జిల్లా బాలసముద్రంలోని సీపీఐ జిల్లా కార్యాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా సీపీఐ రాష్ట్ర, జిల్లా నాయకులను కలిసి ఎన్నికలలో సహకరించినందుకు ధన్యవాదాలు తెలిపారు. అనంతరం విలేకర్ల సమావేశంలో కడియం కావ్య మాట్లాడారు. వరంగల్ పార్లమెంట్ ఎన్నికల్లో తనను సొంత పార్టీ అభ్యర్థిగా భావించి సీపీఐ కార్యకర్తలు కష్టపడి పనిచేసి గెలిపించినందుకు ధన్యవాదాలు తెలిపారు. పార్లమెంట్‌లో ఈ ప్రాంత ప్రజల సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని చెప్పారు.

జిల్లాలో పేదలు, గుడిసె వాసులకు ఇండ్లు, ఇండ్ల స్థలాలకు పట్టాలు అందించేందుకు ప్రయత్నం చేస్తానని అన్నారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు తక్కళ్లపల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ...పార్లమెంటు ఎన్నికలలో బీజేపీని మట్టికరిపించేందుకు సీపీఐ కార్యకర్తలు కృషి చేశారన్నారు. కాంగ్రెస్ గెలుపులో సీపీఐ కీలకపాత్ర పోషించిందన్నారు. పార్లమెంటులో ఈ ప్రాంత సమస్యలపై గళం వినిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బి.విజయసారథి, నేదునూరి జ్యోతి, జిల్లా కార్యదర్శి కర్రె బిక్షపతి, రాష్ట్ర నాయకులు టి.వెంకట్రాములు, పంజాల రమేష్, ఆదరి శ్రీనివాస్, మండ సదాలక్ష్మి, పి.సుగుణమ్మ, జిల్లా మాజీ కార్యదర్శి సిరబోయిన కర్ణాకర్, జిల్లా సహాయ కార్యదర్శులు ఎస్‌కే భాషామియా, మద్దెల ఎల్లేష్ పాల్గొన్నారు.

## కవిత పాత్రపై సీబీఐ మరో చార్జిషీట్

(మొదటిపేజి తరువాయి)

వేలకు పైగా పేజీలతో కవిత రోల్ ను సీబీఐ పేర్కొన్నట్టు తెలిసింది. శుక్రవారం కవితపై దాఖలు చేసిన సప్లిమెంటరీ చార్జిషీట్ అంశాన్ని సీబీఐ తరఫు న్యాయవాదులు రౌస్ ఎవెన్యూ కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. చట్ట ప్రకారం నిర్ణీత సమయంలో కవితపై ఈ చార్జిషీట్ ను దాఖలు చేశామని, దీనిని పరిగణనలోకి తీసుకోవాలని కోర్టును కోరారు. అయితే ఈ అంశాన్ని పరిగణనలోకి తీసుకునే అంశంపై జులై 6 విచారణ చేపడతామని కోర్టు వెల్లడించింది. కాగా, ఢిల్లీ లిక్కర్ స్కాంలో ఈ ఏడాది మార్చి 15 ఈడీ, ఏప్రిల్ 11న కవితను దర్యాప్తు సంస్థలు ఈడీ, సీబీఐలు అరెస్ట్ చేశాయి. ఇప్పటికే ఈ కేసులో కవిత పాత్రపై ఈడీ సప్లిమెంటరీ చార్జిషీట్ దాఖలు చేయగా, 3న ఈ అంశాన్ని పరిగణనలోకి తీసుకుంటున్నట్లు కోర్టు స్పష్టం చేసింది. తాజాగా కవిత పాత్రపై సీబీఐ మరో సపిమెంటరీ చార్జిషీట్ దాఖలు చేసింది. వాస్తవానికి రౌస్ ఎవెన్యూ కోర్టులో ఏడేండ్ల వరకు శిక్ష పడే కేసుల్లో దాదాపు 60 రోజుల్లో అరెస్ట్ చేసిన నిందితులపై చార్జి షీట్ దాఖలు చేయాల్సి ఉంటుందని న్యాయ నిపుణులు చెబుతున్నారు. అలాగే ఈడీ ఇదే కేసులో 60 రోజుల్లో కవితపై చార్జిషీట్ వేసింది. ఇదే కోణంలో ఈనెల 11న సీబీఐ కవితను అరెస్ట్ చేసి రెండు నెలలు(60) రోజులు పూర్తవుతుంది. దీంతో అంతకు ముందుగానే సిబిఐ కవితపై తాజా చార్జిషీట్ ను ఫైల్ చేసింది. మరోవైపు లిక్కర్ స్కాంలో అరెస్టైన కవిత జ్యుడీషియల్ కస్టడీలో భాగంగా మార్చి 26 నుంచి తీహార్ జైల్ లో ఉన్నారు. ఈడీ, సీబీఐ కేసుల్లో కవిత పెట్టుకున్న మధ్యంతర, రెగ్యులర్ బెయిల్ పిటిషన్లను ట్రయల్ కోర్టు తిరస్కరించింది. దీంతో ఆమె ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించగా, గత నెల 28న ఇరువైపు వాదనలు ముగించిన జస్టిస్ సర్వకాంత శర్మ తీర్పును రిజర్వ్ చేశారు.

### జ్యుడీషియల్ కస్టడీ పొడిగింపు

సీబీఐ కేసులో కవిత జ్యుడీషియల్ కస్టడీని రౌస్ ఎవెన్యూ కోర్టు మరోసారి పొడగించింది. గతంలో విధించిన కస్టడీ ముగియడంతో శుక్రవారం కవితను జైలు అధికారులు వీడియో కాన్ఫరెన్స్(విసి) ద్వారా కోర్టులో ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా కవిత కస్టడీని పొడిగించాలని సీబీఐ తరపు న్యాయవాదులు కోర్టును కోరారు. ఈ విజ్ఞప్తిని పరిగణనలోకి తీసుకున్న ధర్మాసనం, కవిత జ్యుడీషియల్ కస్టడీని 21 వరకు పొడిగిస్తూ ఉత్తర్వులు వెల్లడించారు.

## స్నేహితుల మధ్య మనస్పర్ధలతోనే ఇద్దరి హత్య

- వాట్సప్ పోస్టులను తొలగించారని కక్ష : వివరాలు వెల్లడించిన శంషాబాద్ జోన్ డీసీపీ నారాయణరెడ్డి

నవతెలంగాణ-శంషాబాద్

స్నేహితుల మధ్య ఏర్పడిన మనస్పర్ధలు చివరికి ఇద్దరి దారుణ హత్యకు దారి తీశాయి. ఇటీవల జరిగిన ఇద్దరు యువకుల హత్య కేసును పోలీసులు ఛేదించారు. రంగారెడ్డి జిల్లా కడ్తాల్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన ఘటనకు సంబంధించి నిందితులను పోలీసులు అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించారు. శంషాబాద్ జోన్ డీసీపీ కార్యాలయంలో డీసీపీ కె.నారాయణరెడ్డి శుక్రవారం మీడియాకు వివరాలు వెల్లడించారు.

## గళమెత్తిన గ్రామ పంచాయతీ కార్మికులు కలెక్టరేట్ ఎదుట ధర్నా

- సమస్యలు పరిష్కరించాలని డిమాండ్
- ప్రభుత్వం స్పందించకుంటే విధులను బహిష్కరిస్తామని హెచ్చరిక



నవతెలంగాణ - సిరిసిల్ల టౌన్

పెండింగ్‌లో ఉన్న వేతనాలు చెల్లించి, తమ సమస్యలు పరిష్కరించాలని గ్రామ పంచాయతీ కార్మికులు డిమాండ్ చేశారు. తెలంగాణ గ్రామ పంచాయతీ ఎంప్లాయిస్ వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) ఆధ్వర్యంలో కార్మికులు సిరిసిల్ల కలెక్టరేట్ ఎదుట శుక్రవారం ధర్నా చేపట్టారు. కలెక్టర్ వచ్చి హామీ ఇచ్చే వరకు వెళ్లబోమని దాదాపు గంటపాటు అక్కడే బైటాయించారు. ఈ సందర్భంగా సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి కూరపాటి రమేష్ మాట్లాడుతూ.. గ్రామాల్లో పారిశుధ్యం నిర్వహణలో కీలక పాత్ర పోషిస్తూ, గ్రామాన్ని పరిశుభ్రంగా తీర్చిదిద్దుతున్న కార్మికుల పట్ల ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించడం సరికాదన్నారు. చాలీచాలని వేతనాలతో పనిచేస్తున్న వారికి, కొన్ని నెలలుగా వేతనాలు చెల్లించకపోవడంతో ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గత ప్రభుత్వం గ్రామపంచాయతీ కార్మికుల సమస్యలను పరిష్కరించిన పాపాన పోలేదన్నారు. ప్రస్తుత ప్రభుత్వమైనా సమస్యలను పరిష్కరిస్తుందన్న ఆశతో ఎదురు చూస్తున్నారని తెలిపారు. ఇప్పటికైనా కలెక్టర్ స్పందించి జిల్లాలో పెండింగ్ వేతనాలను వెంటనే చెల్లించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. గ్రామపంచాయతీ కార్మికులకు కనీస వేతనం రూ.18వేలు చెల్లించాలని, మల్టీపర్పస్ విధానాన్ని రద్దు చేసి, ప్రమాద, ఆరోగ్య బీమా సౌకర్యం కల్పిస్తూ తదితర న్యాయమైన సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. లేకుండా కార్మికులందరూ నిరవధిక సమ్మెకి సిద్ధం ఉన్నారని, వారంలోపు వేతనాలు చెల్లించకుంటే విధులను బహిష్కరించనున్నట్లు హెచ్చరించారు. అనంతరం కలెక్టరేట్ ఏఓకి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షులు ఎగమంటి ఎల్లారెడ్డి, కార్యదర్శి కోడం రమణ, సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి మూశం రమేష్, అన్నల్దాస్ గణేష్, ఎలిగేటి రాజశేఖర్ గ్రామపంచాయతీ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు మల్యాల నర్సయ్య, లింగంపల్లి కృష్ణవేణి, బుర్ర శ్రీనివాస్, వర్కోలు మల్లయ్య, అంజయ్య, మహేష్, నర్సయ్య కార్మికులు పాల్గొన్నారు.

## డబుల్ బెడ్ రూమ్స్ కోసం లబ్దిదారుల నిరసన



నవతెలంగాణ-గజ్వేల్

గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ పరిధిలోని డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను పేదలకు కేటాయించాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం గజ్వేల్ మున్సిపల్ కార్యాలయం వద్ద లబ్దిదారులు పెద్దఎత్తున నిరసన తెలిపారు. అనంతరం ఎమ్మెల్సీ డాక్టర్ యాదవరెడ్డితో ఇండ్లపై చర్చించారు. సంబంధిత శాఖ అధికారులతో మాట్లాడి తగిన న్యాయం చేస్తానని ఆయన హామీ ఇచ్చారు. డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల విషయంలో జిల్లా కలెక్టర్, ప్రభుత్వం పూర్తి బాధ్యత తీసుకున్న తర్వాత మల్లన్నసాగర్ నిర్వాసితులు ముందుకు వచ్చే అవకాశం ఉందని అన్నారు. పార్లమెంట్ ఎన్నికల తర్వాత ఒక నిర్ణయం వస్తుందని మాత్రమే తాను చెప్పినట్టు ఎమ్మెల్సీ 'నవ తెలంగాణ'తో చెప్పారు. బాధ్యతగా తాను వివరించినప్పటికీ.. నిర్వాసితులకు రావాల్సిన అన్ని వసతులు వచ్చిన తర్వాతనే ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటుందని తెలిపారు. జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకుపోయి తన వంతు కృషి చేస్తానని లబ్దిదారులకు హామీ ఇచ్చారు.

## పెండింగ్ రెమ్యూనరేషన్ వెంటనే చెల్లించాలి.

- ఇంటర్ వార్షిక పరీక్షలు విధులు నిర్వహించిన వారికి వెంటనే ఇవ్వాలి
- రాష్ట్రవ్యాప్తంగా ఇంటర్ పరీక్ష మూల్యాంక కేంద్రాల వద్ద క్యాంప్ ఆఫీసర్లకు వినతిపత్రాలు



నవతెలంగాణ- విలేకరులు

ఇంటర్ బోర్డు నిర్వహించే ఇంటర్ పబ్లిక్ వార్షిక పరీక్షల నిర్వహణలో పాల్గొనే వారికి పెండింగ్ రెమ్యూనరేషన్ వెంటనే చెల్లించాలని కోరుతూ శుక్రవారం ఆందోళన నిర్వహించారు. రాష్ట్రవ్యాప్తంగా ఇంటర్ మూల్యాంక కేంద్రాల వద్ద క్యాంప్ ఆఫీసర్లకు వినతి పత్రాలు ఇచ్చినట్టు తెలంగాణ గెజిటెడ్ జూనియర్ లెక్చరర్స్ అసోసియేషన్- 475, రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ శ్రీనివాస్, డాక్టర్ కొప్పిశెట్టి సురేష్ తెలిపారు. రెండు సంవత్సరాల క్రితం ఇంటర్ పబ్లిక్ వార్షిక పరీక్షల, ప్రాక్టికల్స్, థియరీ మరియు స్పాట్ విధులు అనంతరం సిబ్బందికి రెమ్యూనరేషన్ చెల్లించేవారని, కానీ గత రెండు సంవత్సరాల నుంచి తెలంగాణ ఇంటర్ బోర్డు ఆన్లైన్ ద్వారా చెల్లిస్తానని చెబుతూ, చాలా ఇబ్బందులు గురి చేస్తోందని అన్నా రు. 2023, 2024 పెండింగ్ రెమ్యూనరేషన్ ఇంతవరకు చెల్లించలేదని ,ఈ విషయంపై గత రెండు నెలలుగా అధికా రులకు వినతి పత్రాలు ఇస్తున్నా ఫలితం లేకపోవడంతో రాష్ట్ర వ్యాప్తంగా శుక్రవార ఇంటర్ మూల్యాంకన కేంద్రాల వద్ద భోజ నం విరామ సమయంలో నిరసన తెలియజేసినట్టు తెలి పారు. ఖమ్మం, హనుమకొండ, జగిత్యాల, అదిలాబాద్, నిజామా బాద్, మహబూబ్‌గర్, ఆసిఫాబాద్, మంచిర్యాల, కరీంనగర్, కొత్తగూడెం, నల్లగొండ, హైదరాబాద్ (కస్తూర్బా గాంధీ వెస్ట్ మారేడ్‌పల్లి) ఇంటర్ క్యాంప్ ఆఫీసర్లకు మూల్యాంక కేంద్రాల వద్ద వినతి పత్రాలు అందజేసినట్లు తెలిపారు. అదేవిధంగా ఈ నెల 9న మూల్యాంక కేంద్రంలో పనిచేస్తున్న అధ్యాపకుల సంతకాలతో కూడిన వినతి పత్రాన్ని క్యాంప్ ఆఫీసర్లకు ఇవ్వనున్నట్టు శ్రీనివాస్ కె. సురేష్ తెలిపారు ముఖ్యమంత్రి, విద్యాశాఖ మంత్రి జోక్యం చేసుకొని ఇంటర్ వార్షిక పరీక్ష విధుల్లో పాల్గొనే సిబ్బందికి వెంటనే రెమినేషన్ చెల్లించేవిధంగా చూడాలని కోరారు. ఈ విషయమై ఇంటర్ బోర్డు కార్యదర్శి సానుకూలమైన నిర్ణయం ప్రకటించాలని కోరారు.

అనుదినం... జనస్వరం
www.navatelangana.com
# నవతెలంగాణ
శనివారం 08-06-2024
సమగ్ర తెలుగు దినపత్రిక
సంపుటి : 10 సంచిక : 109 | Published from Khammam, Rangareddy, Hyderabad, Karimnagar | 12 పేజీలు వెల : 6.50

### నేటినుంచి ఉపాధ్యాయ బదిలీలు, పదోన్నతులు

- హైకోర్టు ఆదేశాలతో రంగారెడ్డి జిల్లాకు మినహాయింపు
- టెట్ లేకుండానే టీచర్లకు ప్రమోషన్స్
- గతంలో ఆగిపోయినప్పటి నుంచి ఇప్పుడు ప్రారంభం
- మల్టీజోన్-1లో 22 వరకు నిర్వహణ

12లో

### పరువు నష్టం కేసులో రాహుల్‌కు ఊరట

**బెంగుళూరు కోర్టు నుంచి బెయిల్**



**బెంగుళూరు :** పరువు నష్టం కేసులో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీకి ఊరట లభించింది. ఆయనకు బెంగుళూరు కోర్టు బెయిల్ మంజూరు చేసింది. ప్రధాన వార్తాపత్రికల్లో కాంగ్రెస్ పరువు నష్టం కలిగించే వార్తలు ...11లో

# మోడీ ఏకగ్రీవం

**లోక్‌సభాపక్ష నేతగా ఎన్నుకున్న ఎన్డీఏ ఎంపీలు**

- చంద్రబాబు, నితీశ్‌తో పాటు కూటమి నేతలు హాజరు
- రాష్ట్రపతిని కలిసిన నేతలు

ప్రభుత్వ ఏర్పాటుకు అవకాశమివ్వాలని వినతి

**ప్రధానిగా ఆదివారం ప్రమాణస్వీకారం**



**న్యూఢిల్లీ :** బీజేపీ నేతృత్వంలోని ఎన్డీఏ కూటమికి చెందిన పలు పార్టీల ఎంపీలు మోడీని తమ నాయకుడిగా ఎన్నుకున్నారు. పాత పార్లమెంటు భవనంలోని సెంట్రల్ హాల్‌లో జరిగిన సమావేశంలో బీజేపీ సీనియర్ నాయకుడు రాజ్‌నాథ్‌సింగ్.. మోడీ పేరును ప్రతిపాదించారు. ఆయన నాయకత్వాన్ని సమర్థిస్తూ ఎన్డీఏ ఎంపీలు ఏకగ్రీవ తీర్మానం చేశారు. దీంతో ప్రధానిగా మూడోసారి ప్రమాణస్వీకారం చేయటానికి ఆయనకు మార్గం సుగమమైంది. ఈ సమావేశానికి ఎన్డీఏలోని పలు పార్టీల అధినేతలు, ముఖ్యనాయకులు, ఎంపీలు, ముఖ్యమంత్రులు, సీనియర్ నాయకులు హాజరయ్యారు. ఎన్డీఏ ఎంపీల సమావేశానికి ముందు బీజేపీ సీనియర్ నేత ప్రహ్లాద్ జోషి మాట్లాడుతూ.. ఆదివారం నాడు ప్రధానిగా మోడీ ప్రమాణస్వీకారం చేస్తాడని స్పష్టం చేశారు. ఈ నెల 9న సాయంత్రం ఆరు గంటలకు మోడీ ప్రమాణస్వీకార కార్యక్రమం ఉంటుందని పాత పార్లమెంటు భవనంలోని సెంట్రల్ హాల్‌లో మోడీ నాయకత్వాన్ని సమర్థించటానికి సమావేశమైన ఎన్డీఏ నేతలతో ప్రహ్లాద్ జోషి అన్నారు.

**ఎన్డీఏ భేటీలో పొగడ్తలే...**

నరేంద్ర మోడీ నాయకత్వంపై టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు ప్రశంసల జల్లు కురిపించారు. భారత్‌కు సరైన సమయంలో సరైన నాయకుడు దొరికారని, ఆయన మోడీ అని చంద్రబాబు పొగిడారు. మోడీకి విజన్, ఉత్సాహం ఉన్నాయన్నారు. పరిపూర్ణ కార్యదక్షత కలిగిన నాయకుడని అన్నారు.

**దేశానికి మోడీ ఒక స్ఫూర్తి: పవన్ కల్యాణ్**

ఎన్డీఏ నేతగా మోడీ పేరును బలపరుస్తూ మాట్లాడిన పవన్ కల్యాణ్ ఆయనపై ప్రశంసల జల్లు కురిపించారు. దేశానికి మోడీని ఒక స్ఫూర్తిగా అభివర్ణించారు. ఆ స్ఫూర్తితో ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక ఎన్నికల్లో అద్భుత విజయం సాధించామన్నారు. ఆయన దిశానిర్దేశంతో ఏపీలో 91 శాతం పైగా సీట్లు సాధించామని తెలిపారు. మోడీ వెనుక తామంతా ఉన్నామని ప్రకటించారు. ఎన్డీఏ పక్ష నేతగా మోడీకి వారి పూర్తి మద్దతు ఉంటుందన్నారు

**మోడీ కూడా పోటీపడి..**

ప్రధాని మోడీ మాట్లాడుతూ లక్షలాది మంది కార్యకర్తలు రాత్రింబవళ్లు కష్టపడటంతో ఎన్డీఏ కూటమి మెజార్టీ సాధించిందని ప్రధాని మోడీ అన్నారు. కూటమికి మద్దతు తెలిపిన పార్టీలు, అధినేతలు, ఎంపీలకు మోడీ ధన్యవాదాలు తెలియజేశారు. జనసేన అధినేత పవన్ కల్యాణ్‌పై మోడీ ప్రశంసలు కురిపించారు. "ఇక్కడ కూర్చున్నాడు చూడండి.. ఈయన పవన్ కల్యాణ్ కాదు, తుఫాన్" అని సంబోధించారు. దానికి పవన్ కల్యాణ్ ఉబ్బితబ్బి బ్బైపోయారు. ఏపీ అసెంబ్లీ ఎన్నికల్లో ఎన్డీఏ కూటమికి ప్రజలు అఖండ విజయం అందజేశారని గుర్తుచేశారు. టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు తో కలిసి పవన్ కల్యాణ్ చారిత్రాత్మక విజయం సాధించారని అన్నారు.



**ఎన్డీఏ పార్లమెంటరీ పార్టీ నాయకుడిగా..**

ఎన్డీఏ పార్లమెంటరీ పార్టీ నాయకుడిగా మోడీ పేరును సీనియర్ బీజేపీ నాయకుడు రాథ్‌నాథ్‌సింగ్ ప్రతిపాదించారు. ఈ ప్రతిపాదనకు బీజేపీ నాయకులతో పాటు ఎన్డీఏ నేతలు మద్దతు పలికారు. లోక్‌సభలో బీజేపీ నాయకుడిగా, ఎన్డీఏ పార్లమెంటరీ పార్టీ, బీజేపీ పార్లమెంటరీ పార్టీ నేతగా.. ఇలా మూడు ప్రతిపాదనలకు మోడీ పేరును రాజ్‌నాథ్ సింగ్ సిఫారసు చేశారు. మద్దతు తెలిపిన బీజేపీ అగ్రనాయకులు అమిత్ షా, నితిన్ గడ్కరీ వంటి సీనియర్ నాయకులు, ఎన్డీఏ ఇతర సీనియర్ నాయకులు టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు, హెచ్‌డి కుమారస్వామి (జేడీఎస్, కర్నాటక), బీహార్ సీఎం, జేడీ(యూ) చీఫ్ నితీశ్ కుమార్‌లు ఉన్నారు. దీంతో భారతదేశ మూడో ప్రధానిగా ప్రమాణస్వీకారం చేయటానికి మోడీకి మార్గం ...11లో



## ఆదాయం పెంచే మార్గాలు అన్వేషించండి

**ప్రభుత్వ శాఖలకు డిప్యూటీ సీఎం, ఆర్థికశాఖ మంత్రి భట్టి ఆదేశాలు**

**నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో**

రాష్ట్ర ప్రభుత్వ ఆదాయం పెంచే మార్గాలు అన్వేషించాలని ఉప ముఖ్యమంత్రి, ఆర్థికశాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క అధికారులను ఆదేశించారు. శుక్రవారం సచివాలయంలో వివిధ శాఖల ఉన్నతాధికారులతో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఆర్థిక, రెవెన్యూ, ఎక్సైజ్, రవాణా, ఆరోగ్యశ్రీ విభాగాల పనితీరును సమీక్షించారు. రెవెన్యూ శాఖ మంత్రి పొంగిలేటి శ్రీనివాస్‌రెడ్డి, ఎక్సైజ్‌శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రెండేండ్ల ఆర్థిక ప్రగతిని పరిశీలించారు. అన్ని శాఖలు ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగాన్ని పటిష్టపరిచి బడ్జెట్ అంచనాలను అందుకోవాలని సూచించారు. అలాగే ఆదాయం పెంచుకునేందుకు వాణిజ్య పన్నుల శాఖలో వేసిన కమిటీ పనితీరును ఆర్టీసీ ప్రస్తుతం వివిధ బ్యాంకులు, సంస్థలకు చెల్లిస్తున్న రుణాల వడ్డీ రేట్లను సమీక్షించుకొని, తక్కువ వడ్డీ రేటు ఇచ్చే సంస్థలకు రుణాలు బదలాయించుకోవాలని ఆదేశించారు. ఇటీవల సింగరేణిలో ఇలాంటి ప్రయోగం చేయడం ద్వారా వందల కోట్ల ప్రయోజనం చేకూరిందంటూ ఆ వివరాలను ఆర్టీసీ, రవాణా శాఖ అధికారులకు వివరించారు. ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తులు సుదీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్నాయనీ, ఎన్నికల నోటిఫికేషన్‌కు ముందే ఈ ప్రక్రియ ప్రారంభమైనా పురోగతి లేకపోవడానికి కారణాలు అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ భూములు కబ్జా చేసి ఎల్‌ఆర్‌ఎస్ ద్వారా ప్రయోజనం పొందే ప్రమాదం ఉందనీ, అందువల్ల అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు. హౌసింగ్ ...11లో

### హస్తినలో సీఎం..

సీడబ్ల్యూసీ సమావేశంలో పాల్గొననున్న రేవంత్

ఎంపీలకు నేడు ఖర్గే డిన్నర్

వివరాలు 11లో

## ఆందోళన వద్దు.. అవగాహన పెంచుకోండి

**సీజనల్ వ్యాధుల నివారణకు జాగ్రత్తలే ప్రధానం**

రిస్క్ గ్రూప్ అప్రమత్తంగా ఉండాలి

**నవతెలంగాణ** ఇంటర్వ్యూలో హైదరాబాద్ ఫీవర్ ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కె.శంకర్

**నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్**

రాష్ట్రంలో వర్షాలు ప్రారంభమైన నేపథ్యంలో సీజనల్ వ్యాధులు పెరుగుతున్నాయి. జ్వరం, దగ్గు, విరేచనాలు, నీరసం, వాంతులు వంటి లక్షణాలతో ప్రజలు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. నీటి నిల్వలు పేరుకుపోవడం, నీటి కాలుష్యంతో వచ్చే వ్యాధులు, అపరిశుభ్రత కారణంగా దోమకాటుతో వచ్చే వ్యాధులు, ఆహార కాలుష్యంతో తలెత్తే సమస్యలతో ప్రజలు ఆస్పత్రులకు పరుగులు తీస్తున్నారు. రోగుల ఆందోళనలతో కార్పొరేట్, ప్రయివేటు ఆస్పత్రులు లెక్కకు మించి రోగ నిర్ధారణ పరీక్షలకు సిఫారసు చేసిన తర్వాతే చికిత్స అందించేందుకు ముందుకొస్తున్నాయి. ఈ క్రమంలో ఒకవైపు ఆర్థికంగా ఇబ్బందులకు తోడు, మరోవైపు అనారోగ్యంపాలై రోగులు నానా అవస్థలు పడుతున్నారు. ఈ నేపథ్యంలో సీజనల్ వ్యాధులు రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, వాటి బారిన పడిన వారు ఏం చేయాలి?, ప్రభుత్వాస్పత్రుల్లో అందుబాటులో ఉన్న చికిత్సలపై తదితరాంశాలను హైదరాబాద్ ఫీవర్ ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కె.శంకర్ విశదీకరించారు. నవతెలంగాణకు ఆయన ఇచ్చిన ఇంటర్వ్యూలోని ముఖ్యాంశాలు....



**అకాల వర్షాలు కురిశాయి. మరోవైపు వానాకాలం కూడా సమీపిస్తున్నది. ఈ నేపథ్యంలో రాష్ట్రంలో ఎలాంటి సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశముంది. అవి రాకుండా ప్రజలు ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి ?**

వర్షాకాలంలో నీటిసంబంధిత వ్యాధులతో పాటు ఆహార కాలుష్యం వల్ల వచ్చే వ్యాధులు ప్రబలే అవకాశముంది. ముఖ్యంగా డయేరియా, టైఫాయిడ్, మలేరియా, డెంగ్యూ, జాండీస్ (కామెర్లు), డిప్తీరియా, చికెన్ పాక్స్ (అమ్మతల్లి), మీజిల్స్ (తట్టు), టెటనస్ (ధనుర్వాతం) మమ్స్ (దవడ బిళ్లలు) తదితర వ్యాధులు ప్రబలే అవకాశముంది. కలుషిత ఆహారం తీసుకోవడం, నీటిని నిల్వ ఉంచడం, దోమలు పెరిగేందుకు ఆస్కారమిచ్చేలా అపరిశుభ్ర వాతావరణంతో పాటు, గాలిలో తేమ శాతం ఎక్కువగా ఉండటం, ఉష్ణోగ్రత తక్కువగా ఉండటంతో వైరల్, బాక్టీరియా, ఫంగల్ ఇన్‌ఫెక్షన్లు పెరుగుతుంటాయి. వర్షంలో తడిస్తే దగ్గు, జలుబు, గొంతునొప్పి, నీరసం సాధారణంగా ...12లో

## కార్పొరేట్ విద్యాసంస్థల్లో ఫీజులు నియంత్రించాలి

**గుర్తింపు లేని కాలేజీలు రద్దు చేయాలి**




సర్కారు కళాశాలల్లో సదుపాయాలు కల్పించాలి

విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అందించాలి

ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ఇంటర్ బోర్డు ముట్టడి ఉద్రిక్తం

గేట్లు ఎక్కి పలువురు నేతలు నిరసన

**నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్**

రాష్ట్రంలోని కార్పొరేట్ విద్యాసంస్థల్లో ఫీజులను నియంత్రించాలని భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) రాష్ట్ర కమిటీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. గుర్తింపు లేకుండా నడుపుతున్న కాలేజీలు, అకాడమిలను రద్దు చేయాలని కోరింది. అక్రమంగా లక్షల రూపాయల ఫీజులను వసూలు చేస్తున్న కాలేజీ యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలని సూచించింది. ఇలాంటి సమస్యలన్నింటినీ పరిష్కరించాలని కోరుతూ ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం హైదరాబాద్‌లోని ఇంటర్ ...11లో

### కవిత పాత్రపై సీబీఐ మరో చార్జిషీట్



**ఈ అంశంపై జులై 6 విచారణ**

కవిత జ్యుడీషియల్ కస్టడీ 21 వరకు పొడిగింపు

**నవతెలంగాణ -న్యూఢిల్లీ బ్యూరో**

ఢిల్లీ లిక్కర్ స్కాంలో మరో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ స్కాంలో బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత పాత్రపై సీబీఐ సప్లిమెంటరీ చార్జిషీట్ ను దాఖలు చేసింది. దాదాపు 2 ...2లో



### తీన్మార్..విజయం

- వరంగల్- ఖమ్మం- నల్లగొండ జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీగా ఎన్నిక
- సెకండ్ ప్రియార్టీ కౌంటింగ్‌తో తేలిన ఫలితం
- నిర్దేశిత ఓట్లు 1,55,095 సాధించి రాకేశ్‌రెడ్డిపై మల్లన్న గెలుపు
- మూడ్రోజుల పాటు కొనసాగిన కౌంటింగ్

12లో



## పాఠాలు నేర్పిన ఫలితాలు

**ఓట్లు రాల్చని హిందూత్వ | ఆధ్యాత్మిక కేంద్రాల్లోనూ అపజయాలే**

లోక్‌సభలో బీజేపీ అతి పెద్ద పార్టీగా అవతరించినప్పటికీ ఆ పార్టీ దూకుడుకు అడ్డుకట్ట వేయడంలో ప్రతిపక్ష ఇండియా బ్లాక్ విజయం సాధించింది. ఈ క్రమంలో ప్రతిపక్షాలు అనేక అవరోధాలను ఎదుర్కోవాల్సి వచ్చింది. ఇద్దరు ముఖ్యమంత్రులను జైలుకు పంపారు. ప్రధాన ప్రతిపక్ష పార్టీ అయిన కాంగ్రెస్ బ్యాంక్ ఖాతాలను స్తంభింపజేశారు. ప్రభుత్వ యంత్రాంగం, ప్రధాన స్రవంతి మీడియా బీజేపీతో కుమ్మక్కైంది. ప్రతిపక్షాలకు నిధులు అందకుండా ఎక్కడికక్కడ అష్టదిగ్బంధం చేశారు. ఎన్నికల ప్రక్రియలో అన్ని పార్టీలకూ సమానావకాశాలు లభించి ఉంటే ఇండియా కూటమి కచ్చితంగా మ్యాజిక్ ఫిగర్ 272ని దాటేసి ఉండేది. కానీ అది అసాధ్యమైంది. అయినప్పటికీ ఇండియా కూటమి చైర్‌పర్సన్ మల్లిఖార్జున ఖర్గే, కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీతో పాటు ప్రతి ఒక్క ప్రతిపక్ష నాయకుడూ ప్రజల హృదయాలను గెలుచుకున్నారు.

**న్యూఢిల్లీ :** అసాధారణ రీతిలో వచ్చిన ఫలితాలను ప్రజా విజయంగా అందరూ భావించారు. అనేకమంది భారతీయులు దీనిని తమ వ్యక్తిగత విజయంగా తీసుకొని సంబరాలు చేసుకున్నారు. ఎందుకంటే వారు భారతీయ ఆత్మ కోసం జరిగిన చారిత్రక పోరాటంలో భాగస్వాములయ్యారు.

**అంతర్గత తిరుగుబాట్లు అనివార్యం**

బీజేపీ ఓటమికి కారణాలు అనేకం. ఆ పార్టీలో సంస్థాగత సమస్యలు వేళ్లూనుకుపోయాయి. మోడీ పాలనలో బీజేపీ సంస్థాగతంగా బలహీనపడింది. పైగా బీజేపీ, సంఘ్ పరివార్ మధ్య సంబంధాలు సజావుగా సాగలేదు. అధికార పంపిణీ, ఆధిపత్యం విషయంలో తీవ్రమైన విభేదాలు పొడసూపాయి. ప్రత్యామ్నాయ ...11లో

పార్టీలో రాజుకుంటున్న అసమ్మతి కుంపట్లు

మిత్రుల నుంచీ ఒత్తిళ్లు ?



## రైతులు అధైర్య పడొద్దు

**వర్షాకాలం పంటలకు నీరందిస్తాం**



తుమ్మిడిహట్టి నిర్మిస్తాం

ఎన్డీఎస్ నివేదిక ఆధారంగా యుద్ధ ప్రాతిపదికన డ్యామ్‌కు మరమ్మతులు

జ్యుడీషియల్ ఎంక్వయిరీ తర్వాత దోషులకు శిక్ష తప్పదు : భారీ నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

వివరాలు 2లో

సంపాదకీయం

# అస్మదీయుల చేతివాటం!

ముచ్చటగా మూడవసారి మోడీ ప్రమాణ స్వీకారానికి ముందే, అసలు ఫలితాలు పూర్తిగా రాకముందే, ఇంకా చెప్పాలంటే ఎన్నికల ప్రక్రియ పూర్తికాకముందే రూపుదిద్దుకున్న అతి పెద్ద కుంభకోణం ఇది. దేశంలో షేర్ మార్కెట్లలో పెట్టుబడులు పెట్టే మధ్యతరగతి 'నిర్భాగ్య' జీవులు ఐదు కోట్ల మందే ఉండి ఉండచ్చు. వాళ్ల జూదం ఆడే 'సెన్సెక్స్' షేర్లు యాభై పేరు మోసిన కంపెనీలవే అయి ఉండచ్చు. పెరిగిన షేర్లు, తరిగిన షేర్లు కూడా అంబానీ, అదానీలవే అయి ఉండచ్చు.

కాని జూన్ 4 డి-డే నాడు (ఇంగ్లీషులో డూమ్స్ డే అంటే ఉపద్రవం ముంచుకొచ్చిననాడు) 31 లక్షల కోట్ల రూపాయల మదుపుదార్ల సంపద ఆవిరై పోయింది. దాన్నే జూన్ 5న బ్లడ్ బాత్ (రక్తపు స్నానం) అని, మార్కెట్ల అల్లకల్లోలమని (మేహెమ్) పత్రికలు ప్రచురించాయి. దీనికి కారణాలు ఊహించడం పెద్ద కష్టమేమీ కాదు. ప్రజావ్యతిరేక సంస్కరణలకు బ్రేక్ పడ్తుందనే భయం పట్టుకున్నప్పుడల్లా మార్కెట్లో అమ్మకాలు జరుగుతాయి. మార్కెట్లు కుప్పకూలు తాయి. దీన్నే మరోలా చెప్పుకోవాలంటే, పెట్టుబడికి చెలికాడుగా ఉన్న మోడీ సర్కార్ పడిపోతుందనే భయం మార్కెట్ల బ్లడ్ బాత్‌కి కారణం. ఏడాదికిపైగా రైతాంగం ఢిల్లీ చుట్టూ గేరి వేసి పోరాడినా నిర్దాక్షిణ్యంగా ఆ ఉద్యమాన్ని అణిచివేసే ప్రయత్నం చేసిన మోడీ (చివరికి రైతుల పట్టుదలముందు తలదించినా) సర్కారు పడిపోవడం అంటే పెట్టుబడిదార్లకు ఎంత నష్టం? ప్రతిపక్షాన్ని బయటికి నెట్టేసి నాలుగు కార్మిక కోడ్‌లు ఆమోదించిన ప్రభుత్వాన్ని పెట్టుబడి చేజార్చుకుంటుందా?

ఈ నేపథ్యంలో రాహుల్‌గాంధీ దీని వెనకున్న కారణాలపై విచారణ జరపాలని డిమాండ్ చేయడం సకారణంగానే. తమ ఆధ్వర్యంలో, స్థిరమైన ప్రభుత్వం మరింత పెద్ద మెజారిటీతో వస్తోంది కాబట్టి షేర్ మార్కెట్‌లో, కొంత రిస్క్ అయినా, పెట్టుబడిపెడితే బాగా



లాభపడతారని సాక్షాత్తూ మోడీయే చెప్పారు. షేర్ మార్కెట్ పెరుగుదల గురించి ఒక అస్మదీయునితో ప్రశ్న వేయించుకున్న అమిత్‌షా తానేమీ జ్యోతిష్కుణ్ణి కాదని, స్థిరమైన ప్రభుత్వాలుంటే షేర్ మార్కెట్ ఉరుకులు పెడ్తుం దని, తమ పార్టీ మరింత పెద్ద మెజారిటీతో అధికారం లోకొస్తామని నర్మగర్భంగా పెట్టుబడులు పెట్టమనే చెప్పాడు. ఇవన్నీ ఓ రెండు వారాలముందు ఘటనలు.

ప్రతిపక్షాల ఆరోపణేమంటే ఎన్డీయేకు అంత భారీ మెజారిటీ వచ్చే అవకాశమే లేదని వేగుల నివేదికలు అప్పటికే వచ్చాయి. అయినా ఎన్నికల్లో ఓట్లడుక్కోకుండా షేర్ మార్కెట్లలో జూదానికి జనాన్ని పురికొల్పుడేంటని? అసలు ఇలాంటి ఘటనలు దేశంలో అంటే పాలకులే ప్రత్యక్షంగానో, పరోక్షంగానో ప్రజలను ఈ షేర్ల జూదానికి ప్రోత్సహించిన ఘటనలు ఇప్పటిదాకా లేవు. పెట్టుబడిదారుల మరో ఇష్ట సఖుడు పియూష్ గోయల్ భారత ఆర్థిక వ్యవస్థ 5 లక్షల కోట్ల డాలర్లకు చేరుతుంటే రాహుల్‌గాంధీ దాన్ని వెనక్కి లాగుతున్నాడని చెప్పడం విస్తుగొలిపే అంశం.

"తమకు 220 సీట్లు దాటవన్న అంశం తెలిసినా జరిగిన ప్రచారంతో స్టాక్ మార్కెట్లు ఎగిసిపడ్డాయి. చివరికి 31 లక్షల కోట్ల రూపాయల మదుపర్ల సొమ్ము ఆవిరైంది. మార్కెట్లు రక్తమోడాయి" అని రాహుల్‌గాంధీ అన్న మాటలను కొట్టేయలేము. షేర్ మార్కెట్లు పెరగడానికి దోహదపడ్డ ఎగ్జిట్‌పోల్స్, 4వ తేదీతో అధ:పాతాళానికి దొర్లిపోవడం కీలకాంశం. దేశంలో స్టాక్ మార్కెట్లు పడ్డ సందర్భాలు గతంలోనూ ఉన్నాయి. వామపక్షాలకు అరవై ఒక్క సీట్లు వచ్చి, లెఫ్ట్‌పై ఆధారపడ్డ యూపీఏ ప్రభుత్వం వస్తున్న సందర్భంలో సంస్కరణలు ఆగిపోతాయన్న భయానికి ఒకసారి 'బ్లడ్ బాత్' జరిగింది. 1996లో వాజ్‌పాయ్ 13 రోజుల సర్కార్ పడిపోయిన తర్వాత కూడా మార్కెట్లు రక్తమోడాయి. గతంలో హర్షద్ మెహతా, కేరత్‌పరేఖ్‌ల షేర్ మార్కెట్ స్కాంలను చూశాం. వీళ్ళు షేర్ బ్రోకర్లు. అది కాంగ్రెస్ పాలనలో, మోడీ హయంలో పెట్టుబడికి కాళ్ళు రావడమేకాదు. కోరలూ మరింత పదును తేలాయి. చట్టాలన్నీ వారికి చుట్టాలైనాయి. అన్నింటినీ దేశ, విదేశీ పెట్టుబడిదార్లకే సమర్పిస్తున్నారు.

స్థూలంగా, కోట్లాది కష్టజీవులకు నష్టం కలిగించే సంస్కరణలను ముందుకు తీసుకెళ్లే 'మొనగాండ్ల'కు నష్టం జరిగితే షేర్ మార్కెట్లు కూలతాయి. దీన్ని బట్టే "మోడీ 3.0"ను అంచనా కట్టాలి. జరిగిన నష్టంపై విచారణ జరగాల్సిందే! ఒకటవ తేదీ ఎగ్జిట్ పోల్స్‌కు 4వ తేదీ ఫలితాలొచ్చే నాటి "బ్లడ్ బాత్"కు మధ్యనున్న లింకే కీలకం. దానిపైనే విచారణ జరపాలని డిమాండ్ చేయడం. అసలు కీలక విషయమేమంటే ప్రజలు తమకు ఎవరు బాగా మంచి చేస్తారనుకుంటారో ఆ పార్టీకే ఓట్లు వేస్తారు. మార్కెట్లు పడిపోవడం కోసం కాదన్న విషయం ఈ మార్కెట్ విశ్లేషకులుగా చెప్పుకునేవారు అర్థం చేసుకోవటం అవసరం.

> స్థూలంగా, కోట్లాది కష్టజీవులకు నష్టం కలిగించే సంస్కరణలను ముందుకు తీసుకెళ్లే 'మొనగాండ్ల'కు నష్టం జరిగితే షేర్ మార్కెట్లు కూలతాయి. దీన్ని బట్టే "మోడీ 3.0"ను అంచనా కట్టాలి. జరిగిన నష్టంపై విచారణ జరగాల్సిందే! ఒకటవ తేదీ ఎగ్జిట్ పోల్స్‌కు 4వ తేదీ ఫలితాలొచ్చే నాటి "బ్లడ్ బాత్"కు మధ్యనున్న లింకే కీలకం. దానిపైనే విచారణ జరపాలని డిమాండ్ చేయడం.

# విధి వైపరీత్యం : హిందూ దేవుని బిడ్డకేమిటీ పరిస్థితి!



ఎం కోటేశ్వరరావు
8331013288

మన దేశంలో విధిని నమ్మేవారు ఎక్కువ, నమ్మనివారు తక్కువ. విధి వైపరీత్యం గురించి చెప్పే బాబాలు, జ్యోతిష్కులు, ప్రవచనకారులను రోజూ చూస్తూనే ఉన్నాం. పోతులూరి వీరబ్రహ్మం కాలజ్ఞాన మంటూ కొత్త కొత్త అంశాల గురించి అనేక మంది చెబుతారు. ఫ్రెంచి జ్యోతిష్కుడు నోస్ట్రాడమస్ 1,555లోనే నరేంద్రమోడీ గురించి జోస్యం చెప్పాడని కేంద్ర మంత్రి కిరెన్ రిజుజు గతంలో ప్రకటించిన సంగతి తెలిసిందే. 2014లో హిందువులు అధికారానికి వస్తారని (అటల్ బిహారీ వాజ్‌పేయ్‌ని హిందువుగా గుర్తించలేదా లేక దుర్భిణికి కనిపించ లేదా) భూమ్యాకాశాలను పాలిస్తారని, ఆసియాలో వారిని ఎవరూ నిరోధించలేరని, భారత అధినాయకుడు గుజరాత్‌లో జన్మిస్తాడని, అతని తండ్రి టీ అమ్ముతారని, అతని మొదటి నామం నరేన్‌దసు అని, 2026వరకు అధికారంలో ఉంటారని రాతపూర్వకంగా ఉందని సదరు మంత్రి సెలవిచ్చారు. ఇన్ని చెప్పిన సదరు జ్యోతిష్కుడు బాబరీ మసీదు కూల్చివేత, గుజరాత్ మారణకాండల గురించి, ఆ కారణంగా అమెరికా తన గడ్డమీద అడుగు పెట్టనివ్వదనీ, 2024లో ముస్లిం అనుకూల పార్టీల దయతో ఏలుబడిలోకి వస్తారని ఎలా పసిగట్టలేకపోయారన్నది ప్రశ్న. ఇంకా చాలా ఉన్నాయి. అయోధ్యలో రామమందిరం కట్టిస్తారని, ఓట్ల కోసం దాన్ని పెద్ద ఎత్తున ప్రచారం చేస్తారని, చివరకు అక్కడ పార్టీని గెలిపించటంలో మోడీ చతికిల పడతారని, రామాలయాన్ని బుల్డోజర్లతో కూల్చివేస్తారని నరేంద్రమోడీ ఎవరి గురించి చెప్పారో ఆ సమాజ్‌వాది పార్టీ ప్రతినిధిని ఆ రాముడే తన ఆలయ రక్షణకు గెలిపిస్తారని, బీజేపీని ఓడిస్తారని ఎందుకు చెప్పలేదు. హిందూ హృదయ సామ్రాట్టుగా మన్ననలను అందుకున్న, ముస్లింల సంతుష్టీకరణను తీవ్రంగా వ్యతిరేకించిన 56 అంగుళాల ఛాతీ ఉన్న ధైర్యవంతుడిగా స్తోత్రపాఠాలు అందుకున్న నేతపట్ల విధి ఎందుకు ఇంత విపరీతంగా ప్రవర్తించినట్లు?నోస్ట్రాడామస్‌ను పక్కన పెడదాం, సాధారణ మానవుల మాదిరిగాక దైవాంశ సంభూతుడిగా జన్మించినట్లు చెప్పుకున్న కారణజన్ముడు సైతం రాగల పరిణామాలను ఎందుకు ఊహించలేకపోయారు.

తాను బతికుండగా ముస్లిం రిజర్వేషన్లను అనుమతించే ప్రసక్తి లేదని నరేంద్రమోడీ ప్రతిజ్ఞ చేశారు, దేశానికి గ్యారంటీ అన్నారు. తాము అధికారంలోకి వస్తే నాలుగుశాతం రిజర్వేషన్లు అమలు చేస్తానని చంద్రబాబు చెప్పారు. నితీష్ కుమార్ కూడా ముస్లింలకు అనుకూలంగానే వ్యవహరించారు. బీహార్‌లో కులగణన సర్వే వివరాలు నిలిపివేయాలని కోరిన కేసులో సుప్రీంకోర్టు తిరస్కరించిన తీర్పు మరుసటి రోజు 2023 అక్టోబరు ఏడున నితీష్ కుమార్ తన నివాసంలో ముస్లిం మత పెద్దలతో సుదీర్ఘసమావేశం నిర్వహించారు. మైనారిటీల సంక్షేమం, సామాజిక భద్రత గురించి వారికి హామీ ఇచ్చి లోక్‌సభ ఎన్నికల్లో తనకు మద్దతు ఇవ్వాలని కోరారు. కుల సర్వే వివరాల ప్రకారం బీహార్‌లో ముస్లిం జనాభా 17.7శాతం ఉంది. కులగణనలో ముస్లింలలో ఉన్న పాతిక కులాల వారిని అత్యంత వెనుకబడిన తరగతి(ఇబిసి)గా పరిగణించి లెక్కించారు. స్థానిక సంస్థల ఎన్నికలలో రిజర్వేషన్లకు అర్హత కల్పించారు.నితీష్ కుమార్ రిజర్వేషన్ ఫార్ములా ప్రకారం దళితులకు 16, గిరిజనులకు ఒకటి, ఇబిసిలకు 18, ఓబిసిలకు 12, ఇబిసి మహిళలకు మూడు శాతం అని చెప్పారు. ఇదంతా చేసిన తరువాత ఆ పెద్ద మనిషి ఇండియా కూటమినుంచి ఫిరాయించి తిరిగి ఎన్డీయే కూటమిలో చేరి బీజేపీతో అధికారాన్ని పంచుకున్నారు, లోకసభ ఎన్నికల్లో పోటీచేశారు. వచ్చే ఏడాది అక్టోబరు-నవంబరు మాసాల్లో బీహార్ అసెంబ్లీ ఎన్నికలు జరగాల్సి ఉంది. నితీష్‌కుమార్‌కు అవి పెద్ద పరీక్షగా మారతాయి. తాజా లోక్‌సభ ఎన్నికల్లో ఎన్డీయే పార్టీలకు వచ్చిన ఓట్లను చూసినపుడు 2019లో వచ్చిన ఓట్లకంటే ఆరుశాతం తగ్గగా ఇండియా కూటమి ఓట్లు 3.5శాతం పెరిగాయి. ఓట్లపరంగా చూసినపుడు ఆర్‌జెడి 22.41శాతం ఓట్లతో పెద్ద పార్టీగా ఉంది. బీజేపీ 20.5శాతంతో ద్వితీయ, 18.52శాతంతో జెడియు మూడవ స్థానంలో ఉంది.బీజేపీ, జెడియు రెండూ గతంలో ఉన్న లోక్‌సభ స్థానాలలో తొమ్మిదింటిని కోల్పోయాయి. తెలుగు ప్రాంతాలలో ఇంత బతుకూ బతికి ఇంటివెనకాల చచ్చినట్లు అనే లోకోక్తి తెలిసిందే. తమ పార్టీ ఓట్ల కోసం ఎవరినీ సంతుష్టీకరించదు, మిగతా పార్టీలన్నీ మైనారిటీల సంతుష్టీకరణకు పాల్పడుతున్నట్లు ఊరూవాడా ప్రచారం చేసిన బీజేపీ గురించి తెలిసిందే. ముస్లిం సంతుష్టీకరణకు వ్యతిరేకం, ఎట్టి పరిస్థితిలోనూ దానికి లొంగేది లేదని చెప్పిన వారు ఇప్పుడు ముస్లిం అనుకూల విధానాలను అమలు చేస్తామని చెప్పిన చంద్రబాబు నాయుడు, నితీష్ కుమార్ నాయకత్వంలోని పార్టీల దయమీద కేంద్రంలో అధికారానికి రావటాన్ని ఏమనాలి? ముస్లిం రిజర్వేషన్లు అమలు జరిపితీరుతామని చెప్పిన చంద్రబాబుతో మోడీ రాజీపడతారా లేక చంద్రబాబు నాయుడు నితీష్ కుమార్ ఇద్దరూ మోడీతో సర్దుకుపోదాం పదండి అంటారా? విధి వైపరీత్యం ఎవరితో ఎలా ఆడుకుంటుందో, వారిని నమ్మిన వారిని ఏం చేస్తుందో చూద్దాం.

నరేంద్రమోడీని ఇప్పటి వరకు అనేక మంది విశ్వగురువుగా, ప్రపంచ దేశాలను ప్రభావితం చేసే నేతగా ప్రచారం చేశారు. నిజమే అని నమ్మి అబ్‌కీబార్ ట్రంప్ సర్కార్ అని బాహాటంగా ప్రకటించిన నరేంద్ర మోడీ అమెరికాలో చేతులు కాల్చుకున్నది తెలిసిందే. సదరు ట్రంప్ అధికారం పోయింది. స్వంతంగా ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసే అవకాశం లేకుండా మోడీకి జనం తగిన పాఠం చెప్పారు. అదే ట్రంప్ మనదేశం వచ్చి నరేంద్ర మోడీకి అనుకూలంగా చెప్పి ఉంటే ఏం జరిగేదో అనూహ్యం.ఎన్నికల తరువాత మోడీ గురించి ప్రపంచం ఏమను కుంటోంది అంటే మీడియా వ్యాఖ్యలను చూడాల్సిందే. బీజేపీ పెద్దలు తరచూ పాకిస్తాన్‌తో పోల్చి తాము సాధించిన విజయాల గురించి చెప్పుకుంటారు.అదే పాక్ ఆంగ్ల పత్రిక "డాన్ " మన ఎన్నికల గురించి పతాకశీర్షిక పెట్టింది." విద్వేషాన్ని ఓడించిన భారత్, ముస్లిం అనుకూల పార్టీల దయాదాక్షిణ్యాలపై ఆధారపడిన మోడీ" అని రాసింది. దీన్ని చూస్తే మోడీ భక్తులకు మామూలుగా మండదు. మామ తిట్టినందుకు కాదు తోడల్లుడు తొంగిచూసి కిసుక్కున నవ్వినందుకు అనే ఒక సామెత గుర్తుకు రావటం లేదా ! అందరూ ఈ వార్తను చూస్తారో లేదోనని ఆ పత్రిక మొదటి పేజీని బీజేపీ నేత సుబ్రమణ్యస్వామి తన 'ఎక్స్' ఖాతాలో పంచుకొని మోడీని ఎద్దేవా చేశారు. నరేంద్రమోడీ హిందూత్వ ఉత్సాహం, ముస్లింలు, ఇతర మైనారిటీలను లక్ష్యంగా చేసుకోవటాన్ని అంగీకరించని బీహార్, ఆంధ్రప్రదేశ్‌లోని లౌకిక పార్టీల దయమీద ఆధారపడాల్సి వచ్చిందని, కేరళలో తొలి సారిగా విజయం సాధించిన బీజేపీ అభ్యర్థికూడా మైనారిటీలతో సన్నిహిత సంబంధాలు కలిగి ఉన్న వ్యక్తని కూడా డాన్ పేర్కొన్నది. బలహీనపడినప్పటికీ ఇంకా ప్రాణాంతకమే అంటూ బీజేపీ, నరేంద్రమోడీ గురించి అదే పత్రిక మరో విశ్లేషణలో హెచ్చరించింది.

"భారత్‌లో మోడీ పార్టీ బీజేపీ తన ఆధిక్యతను ఎలా కోల్పోయింది" అనే ప్రశ్నార్థక శీర్షికతో అంతర్జాతీయ ఎఎఫ్‌పి సంస్థ వార్త ఇచ్చింది. పదేండ్ల క్రితం హిందూ జాతీయనేత అధికారానికి వచ్చిన తరువాత తొలిసారిగా సంపూర్ణ మెజారిటీని సాధించటంలో భారత ప్రధాని నాయకత్వంలోని బీజేపీ విఫలమైంది అని వ్యాఖ్యానించింది. వరుసగా మూడోసారి భారీ మెజారిటీ సాధించటంలో వైఫల్యానికి కారణాలను పేర్కొన్నది. విభజనవాద ప్రచారం దెబ్బతీసింది. హిందూ మెజారిటీని సమీకరించుకొనేందుకు అసాధారణ రీతిలో ముస్లింలకు వ్యతిరేకంగా మోడీ మాట్లాడారు. తన సభల్లో వారిని చొరబాటుదార్లు అన్నారు. ప్రతిపక్ష కాంగ్రెస్ అధికారానికి వస్తే దేశ సంపదలను ముస్లింలకు పంచుతుందని చెప్పారు. ఇది హిందూ ఓటర్లను ఉత్సాహపరచలేకపోయింది, మైనారిటీల మద్దతు ప్రతిపక్షానికి గట్టిపడేట్లు చేసింది.ఎన్నికల సందర్భంగా తాము ఓటర్లను కదిలించినపుడు ప్రభుత్వ భావజాల(హిందూత్వ) అజెండా కంటే తమకు నిరుద్యోగ సమస్య ప్రధానమని చెప్పినట్లు పేర్కొన్నది. జనం తమ జీవనం, నిరుద్యోగం, ధరల పెరుగుదల గురించి ఎక్కువ ఆవేదన చెందినట్లు, మోడీ, బీజేపీ చెబుతున్నవి తమకు సంబంధం లేని అంశాలుగా జనం భావించారని మోడీ జీవిత చరిత్రను రాసిన నిలంజన్ ముఖోపాధ్యాయ కూడా అన్నట్లు ఈ వార్తా సంస్థ పేర్కొన్నది. పెద్ద రాష్ట్రమైన ఉత్తర ప్రదేశ్‌లలో విఫలం కావటం, దక్షిణాది రాష్ట్రాలలో బలం పెంచుకొనేందుకు పదేపదే పర్యటించినా ఫలితం లేకపోవటం, అయోధ్యలో ఓటమి తదితర అంశాలను అది ఉటంకించింది.

"భారత ఎన్నికల్లో బీజేపీకి ఎదురుదెబ్బలు, మోడీ విజయం" అంటూ అమెరికా టీవీ సిఎన్ఎన్ వార్తలను ఇచ్చింది.ప్రపంచ అతి పెద్ద ప్రజాస్వామిక వ్యవస్థలో ఓటర్లు ప్రజాకర్ష హిందూ దేశానికి అగ్రతాంబూలం అనే దృక్పథాన్ని ఓటర్లు పాక్షికంగా తిరస్కరించారని విశ్లేషణలో పేర్కొన్నది.మోడీ ముద్రగల హిందూ దేవాలయం ఉన్న పెరటితోటలో తిరుగులేని ఓటమి అంటూ అయోధ్య గురించి న్యూస్‌వీక్ పత్రిక పేర్కొన్నది. ఎట్టకేలకు మేలుకున్న భారతీయ ఓటర్లు అంటూ న్యూయార్క్ టైమ్స్ పత్రిక శీర్షిక పెట్టి విశ్లేషణ రాసింది.అజేయమైన శక్తి అనే మోడీ ప్రతిష్టకు చిల్లుపడింది, సంకీర్ణ రాజకీయాలు తిరిగొచ్చాయి అని పేర్కొన్నది. మోడీ, ఆయన పార్టీకి తిరుగులేని దెబ్బ అని వాషింగ్టన్ పోస్టు పేర్కొన్నది. మోడీ పేలవ ప్రదర్శన ప్రతిపక్షం పుంజుకోవటానికి నిదర్శనం అని బ్రిటన్ పత్రిక ఇండిపెండెంట్ పేర్కొన్నది. "మోడీ విజయంతో చైనా, అమెరికాలతో భారత్ మరింత దగ్గర " అంటూ చైనా పత్రిక గ్లోబల్‌టైమ్స్ విశ్లేషణ శీర్షిక పెట్టింది. మోడీ ఏలుబడి తొలి ఐదేండ్లలో చైనాతో ముద్దులతో మొదలై గుద్దులదాకా వచ్చింది, తరు వాత మరింత ఆర్థిక సహకారం కోసం ఉద్రిక్తతలను సడలించింది.2019 నుంచి సరిహద్దు ప్రతిష్టంభను ఒక ప్రధాన సమస్యగా చేసింది. మూడోసారి మరింత జాగ్రత్తలతో కూడిన మార్పులు జరగవచ్చు. శాంతియుత, స్థిరమైన సంబంధాలు రెండుదేశాలకూ కీలకం, సంబంధాలు దెబ్బతిన్న పుటికీ రెండు దేశాల మధ్య వాణిజ్యం 2023లో అమెరికా-భారత్ లావాదేవీలను అధిగమించింది. గుడ్డిగా వివాదపడితే ఎవరికీ ఉపయోగం ఉండదని రుజువైందని పేర్కొన్నది.

అనేక అంతర్జాతీయ మీడియా సంస్థల విశ్లేషణలు ఇంకా రానున్న రోజుల్లో వెలువడతాయి. వాటితో మోడీ ప్రతిష్ట మరింత మసకబారేదే తప్ప వెలిగేది కాదు. దేశీయంగా సంపూర్ణ మెజారిటీ లేని నరేంద్రమోడీ ఇతర పక్షాల మీద ఆధారపడి ఎలా పని చేస్తారో చూడాల్సి ఉంది. అజేయశక్తి అనుకున్న నేత బలహీనత వెల్లడైన తరువాత ప్రపంచ దేశాలు, నేతలు గతం మాదిరే గౌరవిస్తారా?ఎలా స్పందిస్తాయన్నది ప్రశ్న. బీజేపీ, నరేంద్ర మోడీ బలహీన పడివుండవచ్చు తప్ప ప్రమాదకరంగా ఉంటారన్నది ఇండియా కూటమే కాదు, ఎన్డీయే పక్షాలూ గ్రహించాలి. తన మిత్రపక్షాలను అది ఎలా మింగేసిందీ టీడీపీ, శివసేనకూ తెలిసిందే.



> తాజా లోక్‌సభ ఎన్నికల్లో ఎన్డీయే పార్టీలకు వచ్చిన ఓట్లను చూసినపుడు 2019లో వచ్చిన ఓట్లకంటే ఆరుశాతం తగ్గగా ఇండియా కూటమి ఓట్లు 3.5శాతం పెరిగాయి. ఓట్లపరంగా చూసినపుడు ఆర్‌జెడి 22.41శాతం ఓట్లతో పెద్ద పార్టీగా ఉంది. బీజేపీ 20.5శాతంతో ద్వితీయ, 18.52శాతంతో జెడియు మూడవ స్థానంలో ఉంది.బీజేపీ, జెడియు రెండూ గతంలో ఉన్న లోక్‌సభ స్థానాలలో తొమ్మిదింటిని కోల్పోయాయి.తెలుగు ప్రాంతాలలో ఇంత బతుకూ బతికి ఇంటివెనకాల చచ్చినట్లు అనే లోకోక్తి తెలిసిందే. తమ పార్టీ ఓట్ల కోసం ఎవరినీ సంతుష్టీకరించదు, మిగతా పార్టీలన్నీ మైనారిటీల సంతుష్టీకరణకు పాల్పడుతున్నట్లు ఊరూవాడా ప్రచారం చేసిన బీజేపీ గురించి తెలిసిందే. ముస్లిం సంతుష్టీకరణకు వ్యతిరేకం, ఎట్టి పరిస్థితిలోనూ దానికి లొంగేది లేదని చెప్పిన వారు ఇప్పుడు ముస్లిం అనుకూల విధానాలను అమలు చేస్తామని చెప్పిన చంద్రబాబు నాయుడు, నితీష్ కుమార్ నాయకత్వంలోని పార్టీల దయమీద కేంద్రంలో అధికారానికి రావటాన్ని ఏమనాలి? ముస్లిం రిజర్వేషన్లు అమలు జరిపితీరుతామని చెప్పిన చంద్రబాబుతో మోడీ రాజీపడతారా లేక చంద్రబాబు నాయుడు నితీష్ కుమార్ ఇద్దరూ మోడీతో సర్దుకుపోదాం పదండి అంటారా?

# బీఆర్ఎస్‌కు ఎందుకీ దుస్థితి?



గుండెబోయిన శ్రీనివాస్
9985194697

మంగళవారం వెలువడిన లోకసభ ఎన్నికల ఫలితాల్లో భారత రాష్ట్ర సమితి (బీఆర్ఎస్)కు ఒక్క స్థానం కూడా దక్కకపోవడం ఆశ్చర్యం గొలిపే విషయమే. ఎందుకంటే ఆరునెలల క్రితం జరిగిన శాసనసభ ఎన్నికలలో గెలుపొందిన కాంగ్రెస్ పార్టీ కన్నా కేవలం రెండు శాతం లోపు ఓట్ల తేడాతో రెండవ అతిపెద్ద పార్టీగా అవతరించిన ఆ పార్టీ, ఇప్పుడు లోకసభలో అసలు ప్రాతినిధ్యమే లేని స్థితికి చేరుకోవడం వెనుక బలమైన కారణాలే కనిపిస్తాయి. ప్రజా పోరాటం ద్వారా రాష్ట్రాన్ని, తద్వారా అధికారాన్ని కైవసం చేసుకున్న ఆ పార్టీ ఆ ఉద్యమానికి సంబంధించిన ఏ చిన్న ఆనవాలును కూడా మిగలకుండా చేయడం వల్ల ప్రస్తుతం ఆ పార్టీకి కూడా ఏమీ మిగలకుండా పోయే పరిస్థితి దాపురించింది. చివరికి పార్టీ 'పేరును' కూడా చెరిపేసుకున్న చెడ్డ పేరును మూటకట్టుకోవడం కూడా అందులో ఒక భాగమే. 'ఇకనుండి టీఆర్ఎస్ ఉద్యమ పార్టీ కాదు - పక్కా రాజకీయ పార్టీ' అని రాష్ట్రం ఏర్పడిన కొత్తలో ఆ పార్టీ అధినేత కేసీఆర్ ప్రకటించిన విషయం అందరికీ గుర్తుండే ఉంటుంది. ఉద్యమ పార్టీగా ఉండక పోయినా కనీసం ఉద్యమ స్ఫూర్తితో అయినా పనిచేయక పోతుందా? అని సరి పెట్టు కున్న చాలా మందికి తీవ్ర నిరాశే ఎదురయింది. అందుకు ఈ దశాబ్దకాలంలో అది అందించిన పాలన, అవలంబించిన ఎత్తుగడలు, చేసిన రాజకీయాలే బీఆర్ఎస్ ఈ దుస్థితి రావడానికి ముఖ్య కారణం. తనతో పాటు ఉద్యమించిన 'దోస్తుల' ను దూరం చేసుకుని ఉద్యమ 'ద్రోహుల'ను అక్కున చేర్చుకోవడం వల్ల కలిగిన పర్యవసానాలను తరువాత కాలంలో తెలంగాణ సమాజం సునిశితంగానే గమనిస్తూ వచ్చింది.

'నీళ్లలో అవకతవకలే, 'నియామకాల'లో అవకతవకలే,ఇక 'నిధుల' గురించి ఎంత తక్కువ చెప్పుకుంటే అంత మంచిది. ఆ పార్టీ వ్యవహార శైలి మూలంగా 'నీళ్లు, నిధులు, నియామకాలు' అనే నినాదపు స్ఫూర్తి పూర్తిగా నీరు కారిపోయింది. తెలంగాణను ఒక కుటుంబంగా, తనను తాను ఆ కుటుంబానికి పెద్దగా అభివర్ణించుకున్న అధినేత అధికారం సొంతమయ్యాక మాత్రం తన సొంత కుటుంబమే తెలంగాణ కుటుంబం అన్నట్లుగా వ్యవహరిస్తూ వచ్చారు. తన కుటుంబ సభ్యులకు పదవులు కట్టబెట్టడం మీద ఉన్న శ్రద్ధ,యువతకు ఉద్యోగాల కల్పన విషయంలో చూపించకపోవడం తెలంగాణ సమాజాన్ని తీవ్రంగా బాధించిన విషయాలలో ఒకటి. ఎదుటి పార్టీలను చీల్చడం ద్వారా వాటిని బలహీనపరచాలనుకోవడం, వ్యక్తుల గుణగణాలతో సంబంధం లేకుండా అర్హతలేని వారిని ఎందరినో పార్టీలో చేర్చుకోవడం ద్వారా పార్టీ బలపడతుందనుకున్నాడు. దానికి బదులు, పార్టీ నిర్మాణం మీద కనుక శ్రద్ధ చూపించినట్లయితే పరిస్థితి మరో విధంగా ఉండేది. ఆరు నెలల స్వల్ప వ్యవధిలోనే ఆశ్చర్యకరంగా ఇరవై శాతం ఓటు బ్యాంకును కోల్పోయి ఉండేవారు కాదు. 'మా నాయకుడు మొరిగే కుక్కలను పార్టీలో చేర్చుకొని పిల్లుల్ని చేసి ఓ మూలన పడవేశాడు' అని ఆ పార్టీ నాయకులు గొప్పలు చెప్పుకున్నారు. కానీ ఆ పిల్లులే గోడ మీది పిల్లులై నేడు దర్జాగా గోడలు దూకే కార్యక్రమంలో నిమగ్నం కావడం ఊహించి ఉండరు. శాసనసభ ఎన్నికల తరువాత ప్రారంభమైన ఈ క్రతువు, ఉధృతమై,ఒక ఉద్యమంలా సాగి, ఆఖరికి పార్టీ ఖాళీ అయ్యే పరిస్థితి ఏర్పడితే అందుకు అధినాయకత్వాన్నే తప్ప ఇతరులను తప్పు పట్టలేము.

ఆయన రాష్ట్రంలో ప్రతిపక్షమే లేకుండా చేయాలని చూస్తే ప్రజలు ఆయన పార్టీకి లోకసభలో ప్రాతినిధ్యమే లేకుండా చేశారు. ఇది నిజంగా విషాదమే. పాలనలో పారదర్శకత లోపించడం, ప్రజాస్వామ్యయుతంగా వ్యవహరించకపోవడం, ఎవరికీ అందుబాటులో ఉండకపోవడం, హద్దులు మీరిన అభిజాత్యం, స్వపక్షాన్ని కూడా సంప్రదించక పోవడం, అంతా ఏకపక్షంగా వ్యవహరించడం అనే అవలక్షణాల వల్ల ఆ పార్టీ చేసినటువంటి కొన్ని మంచి పనులు కూడా మరుగున పడే పరిస్థితి ఏర్పడింది. పాలన గాడి తప్పింది. ఒక ఉద్యమం ద్వారా సాధించుకున్న రాష్ట్రంలో ఉద్యమ గొంతుకలకు భిన్నాభిప్రాయాలకు స్థానం లేకపోవడం దేనికి సంకేతం? అసలు ఉద్యమ స్ఫూర్తిని నిర్వీర్యం చేయడం వల్లనే వ్యవస్థలు నిర్వీర్యం కావడం ప్రారంభమయ్యాయన్నది జనాభిప్రాయం. ఏ ఆత్మగౌరవం కోసం అయితే ఇక్కడ ఉద్యమం జరిగిందో రాష్ట్ర ఏర్పాటు తర్వాత ప్రజలకు ఆ ఆత్మగౌరవానికి చోటే లేకుండా పోయిందన్న అభిప్రాయం ప్రజలలో బలంగా నాటుకుపోయింది. ఒక దశాబ్దం క్రితం వరకు టీఆర్ఎస్‌ను గానీ, దాని అధి నాయకుడైన కేసీఆర్‌ను గానీ విమర్శించాలని ప్రయత్నిస్తే, తెలంగాణ ప్రజలు ఆ విమర్శకులను రాళ్లతో కొట్టే పరిస్థితి ఉండేది.కానీ ఇప్పుడు ఆ పార్టీ అధికారాన్ని కోల్పోయి, దాని అవినీతి, కుంభకోణాలు ఒక్కొక్కటిగా బయటపడుతున్న సందర్భంలో, ఆ పార్టీని, దాని అధినేతను సమర్థించాలని ప్రయత్నిస్తే, ఆ సమర్థకులను ప్రజలు రాళ్లతో కొట్టే పరిస్థితులు ఈ రాష్ట్రంలో నెలకొనడం, ఆ పార్టీ స్వయంకృతం.

# నిరంతర రచనా పథికుడు దాశరథి రంగాచార్య



కామిడి సతీష్‌రెడ్డి
9848445134

"నేను కత్తీ, డాలూ పట్టుకోలేను. సాయుధుడినై ఎదిరించలేను. నా పెన్నే నా గన్ను" అని చాటిన ఘనాపాటి దాశరథి రంగాచార్యులు. తెలంగాణ సాయుధ పోరాట యోధుడు, నిజాం నిరంకుశత్వాన్ని ఎదురించిన ధీరుడు. ఆయన బాల్యం నుంచి మొదలుకుని చివరిశ్వాస వరకు వివిధ సాహితీ ప్రక్రియల్లో రచనలు చేశారు. ఆయన తన రచనల ద్వారా ప్రజల్ని మేల్కొల్పడానికి, అన్యాయాన్ని ఎదిరించేలా పురిగొల్పడానికి ఇష్టపడేవారు. 'నా తెలంగాణ కోటి రతనాల వీణ' అంటూ నినదించిన దాశరథి కృష్ణమాచార్యులు రంగాచార్యకు స్వయాన అన్న. తెలంగాణ వేదనను, వీరత్వాన్ని దాశరథి సోదరులు స్వయంగా అనుభవించి సాహిత్యంలో పలవరించారు. ఆంధ్ర మహాసభ ప్రేరణతో అన్న నైజాం సంస్థానానికి వ్యతిరేకంగా ఉద్యమబాట పట్టారు. నేరుగా సాయుధ పోరాటంలో పాల్గొన్నారు. పగలు బడిలో పిల్లలకు పాఠాలు చెబుతూనే, రాత్రుళ్లు రైతు కూలీలకు ఉద్యమ బోధన చేసేవారు. ఇంతలో అన్న కృష్ణమాచార్య జైలు పాలుకావడంతో ఇంటి బాధ్యతలన్నీ రంగాచార్య మోయాల్సి వచ్చింది. కుటుంబం ఉద్యమ ప్రభావంలోకి వెళ్లడంతో తండ్రి వెంకటాచార్యులు భార్యబిడ్డలను వదిలేసి వెళ్లిపోయారు. బతుకుదెరువు కోసం తల్లి వెంకటమ్మ హరికథలు చెబితే, రంగాచార్యులు లైబ్రేరియన్‌గా పనిచేశారు. ఉద్యమం చివరిదశకు చేరుకున్న సమయంలో రజాకార్లు పెట్రేగి దాశరథి కుటుంబంపై దాడులు చేశారు. ఆ సమయంలో అజ్ఞాతంలోకి వెళ్లిన రంగాచార్య తుపాకీ పేల్చడంలో శిక్షణ తీసుకుని రజాకార్లను ఎదురొడ్డి నిలిచారు.

1948 సెప్టెంబరు 16న పోలీస్ యాక్షన్ తరువాత రంగాచార్య ఉద్యమం నుండి బయటకొచ్చారు. స్వాతంత్య్రం సాధించుకున్న తర్వాత ప్రజలను పీడించిన దొరలే ఖద్దరు, గాంధీ టోపీ ధరించి రాజకీయ నాయకులుగా అవతారమెత్తారు. రంగాచార్య వారి మధ్య ఇమడలేక పోయారు. స్వయంకృషితో చదువుకొని 1951లో ఉపాధ్యాయ వృత్తిలో ప్రవేశించారు. తరువాత 1957లో సికింద్రాబాద్ మున్సిపల్ కార్పొరేషన్‌లో చేరి 1988లో అసిస్టెంట్ కమిషనర్‌గా రిటైరయ్యారు. మారేడ్‌పల్లి మున్సిపల్ ప్లేగ్రౌండ్ పక్కన ఉన్న ఇరుకైన సందులోని మూడు గదుల ఇల్లు ఆయన గడిపిన సాధారణ జీవితానికి అద్దం పడుతుంది. తెలంగాణ సాయుధ పోరాటానికి రంగాచార్య రచనలు ఎంతగానో దోహదం చేశాయి. ఒక లక్ష్యశుద్ధితో తన రచనలు కొనసాగించారు. ఆయన సాహితీ సేవ విలక్షణమైనది, విస్తృతమైనది, విభిన్నమైనది. రంగాచార్య రచనలు భావోద్రేకాలు రగిలించేకన్నా భావోద్వేగాలు కలిగిస్తాయి. మహా రచయిత వట్టికోట ఆళ్వారుస్వామి రచనలు ప్రజలపై ఎంతటి ప్రభావం చూపాయో అందరికీ తెలిసిందే. ఆళ్వారు స్వామి వదిలి వెళ్లిన రచనా ఉద్యమాన్ని రంగాచార్య తన భుజ స్కంధాలపై మోశారు. ఆయన తన దైన పద్ధతిలో తెలంగాణ ప్రజల జీవన చిత్రణ కోసం నవలా రచనకు పూనుకున్నారు. మొత్తం తొమ్మిది నవలలు రాశారు. వీటిలో 'చిల్లరదేవుళ్లు', 'మోదుగుపూలు', 'జనపదం' పీరియాడిక్ నవలలు కావడంతో ఒక నవల ముగింపు మరో నవలకు ప్రారంభమవుతుంది. ఆయన తన తొలి నవల 'చిల్లరదేవుళ్ల'ను 1969లో వెలువరించారు.

రంగాచార్య తెలంగాణ సాయుధ పోరాటంలో పాల్గొనడం ద్వారా నాటి వాతావరణాన్ని, ఆ కాలంలోని బానిస పరిస్థితులను ఈ నవలల్లో విస్పష్టంగా ప్రస్ఫుటీకరించారు. గార్ల ప్రాంతంలోని జాగీర్దార్ల దాష్టికాలను ఈ నవలలో కండ్లకు కట్టించారు. ఈ నవలలోని పీరిగాడు, పాణిమంజరి, ఇందిర పాత్రలు ఆనాటి సమాజంలోని ప్రజలకు ప్రతినిధులు. ఈ నవల 1974లో చలన చిత్రంగా వచ్చింది. 'చిల్లరదేవుళ్లు' 1938కి పూర్వపు తెలంగాణ ప్రజల జీవనాన్ని చిత్రిస్తే, తెలంగాణ సాయుధ పోరాటంలోని 1942-48 మధ్య కాలాన్ని 'మోదుగు పూలు' నవల వర్ణిస్తుంది. రంగాచార్య నిర్వహించిన పోరాట చిత్రణమే ఈ నవలలోని ఇతివృత్తం. ఈ నవల చదివే చంద్ర రాజేశ్వరరావు రంగాచార్యను 'ఆంధ్ర గోర్కీ'గా అభివర్ణించారు. ఆయన రాసిన నవలల్లో తెలంగాణ పలుకుబడులను, నుడికారాన్ని పలికించారు. స్వాతంత్య్రం తరువాత రెండు దశాబ్దాల సుదీర్ఘ కాలాన్ని 'జనపదం' నవలలో చిత్రించారు. నగర సమస్యల ఇతివృత్తంతో 'మాయాజలతారు' నవల రాశారు.సుదీర్ఘ తెలంగాణ సామాజిక పరిణామాలను తన రచనల్లో ప్రతిబింబించిన రంగాచార్య తన ఆత్మకథను 'జీవనయానం'పేరుతో తీసుకొచ్చారు. మౌలికంగా ఈ రచన ఆయన స్వీయచరిత్రే అయినా పాఠకులకు ఎక్కడా స్వోత్కర్ష కనపడదు. తానేమిటో చెప్పేకన్నా, ఒక రచయితగా తన బాధ్యత ఏమిటో జీవనయాత్రలో అవగతం చేశారు. ఈ రచనలో రంగాచార్య తన జీవింతంలో పాటు, ఏడు దశాబ్దాల తెలుగు జాతి జీవనాన్ని చిత్రించారు. బుద్ధుని జీవిత చరిత్రను 'బుద్ధ భానుడు' పేరుతో అపురూపమైన రచనను 2010లో వెలువరించారు.

రంగాచార్య నవలలు ఎక్కువగా రాసినా తెలుగు సాహిత్య ప్రక్రియల్లో కథా సాహిత్యం అంటే ఆయనకెంతో అభిమానం.రంగాచార్య చేతి నుంచి జాలువారిన కథా సంపుటి 'నల్లవాగు'. సమర సాహిత్యానికి చెందిన 'రణరంగం', 'రణభేరి', 'జనరంగం' ఆయన రచనలే. తొలుత కమ్యూనిస్టు భావజాలంతో ప్రభావితుడైన రంగాచార్య తదనంతర కాలంలో ఆధ్యాత్మిక భావాలను అలవర్చుకున్నారు. అనంతర కాలంలో తెలుగు సాహిత్య చరిత్రలో తొలిసారిగా నాలుగు వేదాలను తెలుగులోకి అనువదించి 'అభినవ వ్యాసుని'గా ఖ్యాతిగాంచారు. వేదాలను అనువాదం చేయడానికి ముందు ఆయన తన వేషధారణ కూడా మార్చుకున్నారు. పంచె కట్టుకోవడం, చొక్కా వేసుకోకుండా శాలువా కప్పు కోవడం, నుదుట నామాలు పెట్టుకోవడం చాలామందిని ఆశ్చర్యపర్చింది. ఇది ఆయన జీవితంలో వైరుధ్యంగా కనిపించిన విషయం. దీనికి ఆయన 'మతం వ్యక్తిగతమైనది. మార్క్సిజానికి, నా వేషధారణకు, వేదాల అనువాదానికి మధ్య వైరుధ్యమేమీ లేదు" అంటూ నిక్కచ్చిగానే సమాధానమిచ్చారు. ఉమ్మడి వరంగల్ జిల్లా మహబూబాబాద్ చిన్నగూడురులో 1928 ఆగష్టు 24న జన్మించిన రంగాచార్య 2015 జూన్ 8న చనిపోయారు. అయితే ఆయన జన్మించిన మానుకోట నేలకు ధాశరథి జిల్లాగా పేరు పెట్టాలనేది ఈ ప్రాంతవాసుల కోరిక. ఆయన తెలంగాణ సమాజాన్ని తన రచనల ద్వారా చైతన్యపరిచిన తీరును నేటితరం రచయితలు, కవులు అధ్యయనం చేసి ఆచరణకు పూనుకోవడమే దాశరథి సోదరులకు మనమిచ్చే నివాళి.

(నేడు దాశరథి రంగాచార్య వర్థంతి)

> తొలుత కమ్యూనిస్టు భావజాలంతో ప్రభావితుడైన రంగాచార్య తదనంతర కాలంలో ఆధ్యాత్మిక భావాలను అలవర్చుకున్నారు. అనంతర కాలంలో తెలుగు సాహిత్య చరిత్రలో తొలిసారిగా నాలుగు వేదాలను తెలుగులోకి అనువదించి 'అభినవ వ్యాసుని'గా ఖ్యాతిగాంచారు. వేదాలను అనువాదం చేయడానికి ముందు ఆయన తన వేషధారణ కూడా మార్చుకున్నారు. పంచె కట్టుకోవడం, చొక్కా వేసుకోకుండా శాలువా కప్పు కోవడం, నుదుట నామాలు పెట్టుకోవడం చాలామందిని ఆశ్చర్యపర్చింది. ఇది ఆయన జీవితంలో వైరుధ్యంగా కనిపించిన విషయం. దీనికి ఆయన 'మతం వ్యక్తిగతమైనది. మార్క్సిజానికి, నా వేషధారణకు, వేదాల అనువాదానికి మధ్య వైరుధ్యమేమీ లేదు" అంటూ నిక్కచ్చిగానే సమాధానమిచ్చారు.





## కాంపాటి రమేష్ మృతి

- సీపీఐ(ఎం) నివాళి

**నవతెలంగాణ-తిరుమలాయపాలెం**

సీపీఐ(ఎం) గ్రామ నాయకులు కాంపాటి రమేష్ గత నెల 31న రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతూ గురువారం తెల్లవారుజామున మృతి చెందారు. మృతి వార్త తెలుసుకున్న సీపీఐ(ఎం) జిల్లా నాయకులు ఎర్ర శ్రీనివాసరావు, మండల సీనియర్ నాయకులు దొండేటి ఆనందరావు, పార్టీ మండల కార్యదర్శి కొమ్ము శ్రీను సందర్శించి భౌతిక కాయంపై ఎర్రజెండా కప్పి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా సీపీఐ(ఎం) మండల కార్యదర్శి కొమ్ము శ్రీను మాట్లాడుతూ రమేష్ పుట్టిన దగ్గర నుంచి చనిపోయేంతవరకు ఎత్తిన ఎర్రజెండా దించకుండా ఎర్ర జెండా బాటలో పయనించాడని, ఆయన మృతి పార్టీకి తీరని లోటని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) నాయకులు దొడ్డ లింగస్వామి, పద్మనాభుల సుధాకర్, సీనియర్ నాయకులు కాంపాటి బాబురావు, చల్లా వెంకటేశ్వర్లు, రామనబోయిన రవి, బింగి రమేష్, తుళ్లూరు నాగేశ్వరావు, నెర్సుల వెంకటేశ్వర్లు, వశ పొంగు వీరన్న, దొండేటి నిర్మల్ రావు, పప్పుల ప్రసాద్, పప్పుల ఉపేందర్, చావగాని ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.

## గుర్తు తెలియని వాహనం ఢీకొని దూడ మృతి

- గేదెకు గాయాలు

**నవతెలంగాణ-కల్లూరు**

ప్రధాన రహదారిపై గురువారం రాత్రి గుర్తుతెలియని వాహనం ఢీకొని ఒక దూడ మృతిచెందగా గేదెకి తీవ్ర గాయాలయ్యాయి. పశువైద్యాధికారి నయీమ్ పాషా, రాధాకృష్ణలు సంఘటనా స్థలానికి చేరుకొని గాయాలతో బాధపడుతున్న గేదెకు వైద్య సేవలు అందిస్తున్నారు. స్థానికులు వైద్య సేవలు అందించిన వైద్యులను అభినందించారు.

## స్ట్రాంగ్ రూమ్‌కు ప్రశ్న పత్రాలు, ఎగ్జామ్ మెటీరియల్

**నవతెలంగాణ-ఖమ్మం**

ఈనెల 9న జిల్లాలో నిర్వహించే గ్రూప్- 1 ప్రిలిమినరీ పరీక్షకు సంబంధించిన ప్రశ్న పత్రాలు, ఎగ్జామ్ మెటీరియల్ జిల్లా నోడల్ అధికారి, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ బి.సత్యప్రసాద్, కలెక్టరేట్ లోగల ఖజానా స్ట్రాంగ్ రూమ్‌ను సందర్శించారు. పోలీసుల పర్యవేక్షణలో స్ట్రాంగ్ రూమ్ లో భద్రపరిచారు. ఈ కార్యక్రమంలో అదనపు డీసీపీ ప్రసాద రావు, రీజనల్ కో-ఆర్డినేటర్లు డాక్టర్ జాన్ బాబు, డాక్టర్ జి. రాజ్ కుమార్, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## గ్యాస్ వినియోగదారులు ఈ కేవైసీ చేయించుకోవాలి

- మధిర హెచ్‌పీ గ్యాస్ డీలర్ దోసపాటి కళ్యాణి

**నవతెలంగాణ-ఎర్రుపాలెం**



హెచ్‌పీ గ్యాస్ కనెక్షన్ కలిగిన వినియోగదారుడు ఈకేవైసీని తప్పకుండా చేయించుకోవాలని మధిర హెచ్‌పి గ్యాస్ డీలర్ దోసపాటి కళ్యాణి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆమె తెలిపిన వివరాలు ఎర్రుపాలెం మండలానికి చెందిన గ్యాస్ కనెక్షన్ కలిగిన కస్టమర్లు ప్రభుత్వ ఉత్తర్వులు ప్రకారం శ్రీ సాయి వెంకటేశ్వర మధిర హెచ్‌పీ గ్యాస్ ఏజెన్సీ నందు గ్యాస్ కనెక్షన్ ఉన్న కస్యూమర్ ఈ కేవైసీని తప్పకుండా చేయించుకోవాలని, ఈ కేవైసీ చేయించుకునే గడువు జూన్ 30 తేదీ వరకు ఉన్నట్లు ఆమె తెలిపారు. గ్యాస్ కనెక్షన్ ఉన్న కస్యూమర్ ఈ కేవైసీ చేయించుకోని యెడల గ్యాస్ సరఫరాకు అంతరాయం కలుగుతుందన్నారు. ఈ కేవైసీ చేయచుకోవడానికి మీ ఇంటి వద్దకే మా సిబ్బంది వస్తారని ఈ కేవైసీని ఉచితంగా చేస్తారని తెలిపారు. ఈ కేవైసీకి ఎవరు ఎటువంటి రుసుము చెల్లించవలసిన అవసరం లేదని అన్నారు. ఎక్స్ పరీ డేట్ అయిపోయిన పైప్‌లు ఉంటే మార్చు కోవాలన్నారు. పైప్ లు మార్చినందుకు డబ్బులు చెల్లించాలన్నారు.

## సీజన్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

**నవతెలంగాణ-కల్లూరు**



సీజన్ వ్యాధుల పట్ల వర్షాకాలంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పరిసరాలు పరిశుభ్రతను పాటించాలని ప్రభుత్వ వైద్యాధికారి నవ్యకాంత్ ప్రజలను కోరారు. పట్టణంలో శుక్రవారం పట్టణ పరిధిలో ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారి డాక్టర్ వీ.నవ్యకాంత్ ఆధ్వర్యంలో గ్రామాలలో వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది ఆరోగ్య కార్యకర్తలు, ఆశ కార్యకర్తలు గ్రామాలలో గృహ సందర్శన చేసి, ప్రజలకు డ్రై డే పై అవగాహన కల్పించారు. ఇటీవల కురిసిన వర్షాల కారణంగా ఇంటి పరిసరాలలో నీరు నిల్వ ఉండి, డెంగ్యూ చికెన్ గున్యా వంటి దోమల ద్వారా వ్యాప్తి చెందే వ్యాధులు ప్రబలకుండా ఉండేందుకు ముందస్తు జాగ్రత్తలో భాగంగా ప్రతి మంగళవారం శుక్రవారాల్లో డ్రైడే కార్యక్రమం నిర్వహించారు. అలాగే వైద్యశాఖ సిబ్బంది ప్రజలకు దోమల లార్వా గురించి వివరించి, ఇంటి పరిసరాలలో దోమలు పెరగకుండా చూసుకోవాలని అవగాహన కల్పిస్తున్నారు. ఇంటి పరిసరాలలో తాగిపడేసిన కొబ్బరి బొండాలు, ప్లాస్టిక్ గ్లాసులు, పాత జాడీలు, పగిలిపోయిన కుండలు, పూల కుండీలు, కూలర్లు, పాత టైర్లు, వాడని రోళ్లు మొదలగు వాటిలో నీరు నిలువ లేకుండా చూడాలని, వైద్య ఆరోగ్యశాఖ సిబ్బందికి సహకరించి వారి సూచనలు పాటించాలన్నారు. ఈ కార్యక్రమంలోసూపెర్వైసోర్ జీ.రామారావు,వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది ఆశలు, ఆరోగ్య కార్యకర్తలు పాల్గొన్నారు.

## నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

**నవతెలంగాణ-ఖమ్మంరూరల్**

పల్లెగూడెం సబ్ స్టేషన్ పరిధిలో శనివారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏఈ రామారావు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. మండలంలోని పల్లెగూడెం, రెడ్డిపల్లి, ఆరేకోడు, గోళ్ళపాడు, ముత్తగూడెం, సాయి గణేష్ నగర్, సాయి ఆదిత్య టౌన్ షిప్, జీకే నగర్, లక్ష్మి గాయత్రీ నగర్, అనన్య నగర్, ఎంఎస్ఆర్ వెంచర్, అమ్మ ఫంక్షన్ హాల్ వరకు ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు అంతరాయం ఉంటుందని తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

## జేవీఆర్ఓసీ ఏఐటీయూసీ పిట్ కార్యదర్శిగా రమేశ్

**నవతెలంగాణ-సత్తుపల్లి**



సత్తుపల్లి జేవీఆర్ఓసీ ఏఐటీయూసీ పిట్ కార్యదర్శిగా కాటం రమేశ్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. శుక్రవారం ప్రస్తుత పిట్ కార్యదర్శి నరసింహారావు అధ్యక్షతన పిట్ కమిటీ సమావేశాన్ని జరిపారు. ఈ సమావేశంలో ఏఐటీయూసీ సెంట్రల్ కమిటీ కార్యదర్శి, వంగా వెంకటేశ్వరరావు, సెంట్రల్ ఆర్గనైజింగ్ కార్యదర్శి జి వీరాస్వామి, కేజీఎం ఏరియా అసిస్టెంట్ బ్రాంచి కార్యదర్శి గట్టయ్య ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. వీరందరి సమక్షంలో రమేశ్‌ను పిట్ కార్యదర్శిగా ఏకగ్రీవం చేశారు. ఈ కార్యక్రమంలో సంఘ సత్తుపల్లి బ్రాంచి కార్యదర్శి సముద్రాల సుధాకర్, వైస్ ప్రెసిడెంట్ దారా భీమయ్య, సంఘ బాధ్యులు పి .సూర్యప్రకాశరావు, బరిగెల శేఖర్, సమంత పిట్ కార్యదర్శి ప్రసాదరావు పాల్గొన్నారు.

## 9న జరిగే నెల నెలా వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోండి

- ఎన్జీఆర్ సేవా కమిటీ కన్వీనర్ ఏటుకూరి రామారావు పిలుపు

**నవతెలంగాణ-నేలకొండపల్లి**

ఈనెల 9వ తేదీన ఆదివారం నేలకొండపల్లి సీపీఐ(ఎం) సీనియర్ నాయకులు అమరజీవి నూతక్కి గంగాధర్ రావు (ఎన్‌జిఆర్) సేవా కమిటీ ఆధ్వర్యంలో స్థానిక సీపీఐ(ఎం) కార్యాలయం రావెళ్ల సత్యనారాయణ భవనంలో జరిగే నెల నెల వైద్య శిబిరాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సేవా కమిటీ కన్వీనర్ ఎటుకూరి రామారావు పిలుపునిచ్చారు. శుక్రవారం స్థానిక విలేకరులతో ఆయన మాట్లాడారు. ఈ వైద్య శిబిరంలో బీపీ షుగర్ తో పాటు ఇతర అనారోగ్య సమస్యలకు కూడా ఉచితంగా వైద్య సేవలు అందించడం జరుగుతుందన్నారు. వైద్య శిబిరంలో డాక్టర్ మేదరమెట్ల అనిల్ కుమార్ (ఎంఎస్ ఆర్థో) కీళ్ల ఎముకల వైద్య నిపుణులు, డాక్టర్ కొల్లి అనుదీప్ ఎంబిబిఎస్, ఎండి (జనరల్ మెడిసిన్) రోగులకు వైద్య సేవలు అందిస్తారన్నారు. షుగర్ పరీక్షలు ముందుగా చేయించుకుని రావాలన్నారు. బీపీ షుగర్ రోగులకు వంద రూపాయలకే ఉచితంగా మందులను పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. ఉదయం 6 గంటల నుండి 10 గంటల వరకు మాత్రమే వైద్య శిబిరం జరుగుతుందని ప్రజలు సకాలంలో హాజరై వైద్య సేవలు పొందాలని సూచించారు. పేదలకు వైద్యాన్ని మరింత అందుబాటులోకి తీసుకురావాలనే సేవా దృక్పథంతో నెలనెలా వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మరింత సమాచారం కొరకు 9490098225, 9030897480, 9949592544, 9110364581 లను సంప్రదించాలన్నారు. ఈ సమావేశంలో ఎన్జీఆర్ సేవా కమిటీ నిర్వాహకులు గుడవర్తి నాగేశ్వరరావు, కెవి రామిరెడ్డి, కట్టెకోల వెంకన్న పాల్గొన్నారు.

# 10 తరువాత నో ఎంట్రీ

- ప్రిలిమినరీ పరీక్షకు ముందస్తుగా చేరుకోవాలి
- 52 కేంద్రాలు, 18403 మంది అభ్యర్థులు
- షూస్ ధరించి రావొద్దు
- కలెక్టర్ వి.పి. గౌతమ్

**నవతెలంగాణ-ఖమ్మం**



ఈనెల 9న ఉదయం 10.30 గంటల నుండి మధ్యాహ్నం 1 గంట వరకు నిర్వహించు తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ గ్రూప్-1 ప్రిలిమినరీ పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులు సకాలంలో, ముందస్తుగా పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలని జిల్లా కలెక్టర్ వి.పి. గౌతమ్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటల నుండి 10 వరకు పరీక్షా కేంద్రంలోనికి అనుమతి ఉంటుందని, ఉదయం 9.30 గంటల లోపే పరీక్షా కేంద్రానికి చేరుకోవాలని కలెక్టర్ విపీ గౌతమ్ సూచించారు. ఉదయం 10 గంటల సమయం దాటిన తర్వాత ఎట్టి పరిస్థితిలో అనుమతి ఉండదని, అభ్యర్థులు ఈ విషయాన్ని గమనించి పరీక్షా సమయానికి ముందస్తుగా వచ్చి ప్రశాంతంగా పరీక్ష రాయాలని ఆయన అన్నారు. అభ్యర్థులు తమ వెంట ఒరిజినల్ హాల్ టికెట్‌తో పాటు, ఫొటో ఐడీ, గుర్తింపు కార్డ్ తీసుకొని రావాలని ఆయన సూచించారు. బయోమెట్రిక్ 9.30 గంటల నుండి ప్రారంభించబడునని, అభ్యర్థులు బయోమెట్రిక్ వేయకుండా పరీక్షా కేంద్రం వదిలి వెళ్లరాదని, అభ్యర్థులు చేతి వేళ్ళపై ఎలాంటి మెహంది, టాటూలు లేకుండా చూసుకోవాలని ఆయన తెలిపారు. గ్రూప్ -1 ప్రిలిమ్స్ పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులు పరీక్ష కేంద్రాలకు వెళ్లే ముందు తమ హాల్ టికెట్ పై పాస్ పోర్ట్ సైజ్ ఫొటోను తప్పనిసరిగా అతికించాలని, ఈ ఫొటో 3 నెలల లోపు దిగినదే అయి ఉండాలన్నారు. అభ్యర్థులు హాల్ టికెట్ డౌన్లోడ్ చేసుకోవాలన్నారు. హాల్ టికెట్ పై ఫొటో అతికించకపోతే పరీక్ష కేంద్రంలోకి అనుమతించబడరని, ఈ నిబంధనను హాల్ టికెట్ లో పొందు పరిచినట్లు కలెక్టర్ వెల్లడించారు. ఒకరోజు ముందుగా అభ్యర్థులు తమ పరీక్షా కేంద్రం వెళ్లి, చూసుకోవాలన్నారు. జిల్లాలో 52 పరీక్షా కేంద్రాలలో 18403 మంది అభ్యర్థులు పరీక్షకు హాజరు కానున్నారని ఆయన తెలిపారు. పరీక్షా కేంద్రాల్లోకి వెళ్ళే సమయంలో క్షుణ్ణంగా తనిఖీ చేసి పంపనున్నందున అభ్యర్థులు ఆభరణాలు, ఎలక్ట్రానిక్ వస్తువులు, సెల్ ఫోన్ లు, చేతి గడియారాలు వెంట తీసుకొని రావద్దని, షూస్ ధరించి రావద్దని, పరీక్షా కేంద్రంలోకి వెళ్ళిన అభ్యర్థి పరీక్షా సమయం ముగిసేంతవరకు పరీక్షా కేంద్రం వదిలి వెళ్ళుటకు అనుమతించబడరని తెలిపారు.

# అన్ని రకాల వరి ధాన్యానికి బోనస్ ఇవ్వాలి

- తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర నాయకులు నున్నా నాగేశ్వరరావు,
- జిల్లా ప్రధాన కార్యదర్శి బొంతు రాంబాబు

**నవతెలంగాణ-ఖమ్మం**




ఎలాంటి మినహాయింపు లేకుండా సాగు దారులకు రైతు భరోసా అందించాలని, ధాన్యం బోనస్ అన్ని రకాలకు క్వింటాలకు ఐదు వందలు ఇవ్వాలని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర నాయకులు నున్నా నాగేశ్వరరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి బొంతు రాంబాబు డిమాండ్ చేశారు. శుక్రవారం ఖమ్మం సుందరయ్య భవన్‌లో తెలంగాణ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు మాదినేని రమేష్ అధ్యక్షతన జరిగిన జిల్లా కమిటీ సమావేశంలో నున్నా నాగేశ్వరరావు, బొంతు రాంబాబు మాట్లాడుతూ వ్యవసాయ సీజన్ ప్రారంభానికి నైరుతి రుతుపవనాలు అనుకూలంగా ఉన్న నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం రైతులకు అవసరమైన విత్తనాల కొరత రాకుండా చూడాలని, నకిలీ విత్తనాలు మార్కెట్లో విక్రయం జరగకుండా పటిష్ట నిఘా పెట్టాలని, జిల్లాలో పలు గ్రామాల్లో రైతులు పచ్చిరొట్ట విత్తనాల కోసం ఎదురుచూస్తున్నారని వెంటనే సరఫరా చేయాలని కోరారు. ఎలాంటి మినహాయింపు లేకుండా సాగు దారులకు రైతు భరోసా అందించాలని డిమాండ్ చేశారు. ఎన్నికల కోడ్ ముగుస్తున్న సమయంలో జిల్లా మంత్రులు సమస్యల పరిష్కారంపై దృష్టి సారించాలని సూచించారు. పాలేరు రిజర్వాయర్ ఆయకట్టు పరిధిలో రబీ సీజన్లో సాగు చేసి ఎండిపోయిన పంటలకు పరిహారం అందించాలని కోరారు. ఈ సమావేశంలో తెలంగాణ రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు రాయల వెంకటేశ్వరరావు, తాతా భాస్కర్ రావు, ఎస్ కె మీరా, దుగ్గి కృష్ణ, సహ కార్యదర్శులు చింతనిప్పు చలపతిరావు, బిక్కసాని గంగాధర్, జిల్లా కమిటీ సభ్యులు కుసుపూడి మధు, ఎర్రమల మాధవరెడ్డి, బోడేపూడ వీరభద్రం తదితరులు పాల్గొన్నారు.

# ఎర్ర శ్రీకాంత్‌పై పెట్టిన అక్రమ కేసు కొట్టివేత

**నవతెలంగాణ-ఖమ్మం**

మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు ఎర్ర శ్రీకాంత్‌పై పెట్టిన అక్రమ కేసును శుక్రవారం కోర్టు కొట్టివేసింది. ఖమ్మం కోర్టులో గత తొమ్మిది సంవత్సరాల క్రితం ఖమ్మం వ్యవసాయ మార్కెట్ తరలించవద్దని సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో త్రీటౌన్ పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో వివిధ రాజకీయ పార్టీల మద్దతు తరలింపు వ్యతిరేకంగా పోరాటం నిర్వహించారు. ఆ సందర్భంగా సీపీఐ(ఎం) నాయకుడిగా ఉన్న ఎర్ర శ్రీకాంత్ ఓ కరపత్రం వేయడం జరిగింది.

ఆ కరపత్రం మీద ఆ రోజున మంత్రిగా ఉన్న పువ్వాడ అజయ్ కుమార్ ప్రస్తుతం మాజీ మంత్రి పువ్వాడ ఆరోజు ఎర్ర శ్రీకాంత్ మీద కేసు పెట్టారు. పెట్టిన కేసుకు వ్యతిరేకంగా వేలాదిమంది రోడ్డు మీదకు వచ్చి ప్రదర్శన నిర్వహించారు.

ఆ రోజు నుంచి ఈరోజు వరకు ఎర్ర శ్రీకాంత్ కోర్టుకి హాజరవుతూనే ఉన్నారు. గురువారం కేసును పరిశీలించిన జడ్జి కేసుని కొట్టివేయడం వేశారు. ఈ కేసులో సహకరించిన కార్మిక వర్గం, ప్రజలు అందరికీ ఎర్ర శ్రీకాంత్ అభినందనలు తెలిపారు.

# జర్నలిస్టుల పిల్లలకు 50శాతం ఫీజు రాయితీ కల్పించాలి

- టీయూడబ్ల్యూజే జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఆదినారాయణ, రవి
- సానుకూలంగా స్పందించిన విద్యాశాఖ అధికారులు

**నవతెలంగాణ-ఖమ్మం**



ప్రభుత్వానికి ప్రజలకు మధ్య వారిదిగా ఉంటూ ప్రభుత్వ పథకాలను, చట్టాలను పటిష్టంగా అమలు పరచడానికి నిరంతరం కలం కార్మికులుగా పనిచేస్తున్న జర్నలిస్టుల పిల్లలకు ప్రయివేటు విద్యాసంస్థలలో 50శాతం ఫీజు రాయితీ కల్పించాలని, తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఆకుతోట ఆదినారాయణ, చిర్రా రవి ఆధ్వర్యంలో శుక్రవారం జిల్లా విద్యాశాఖ అధికారి ఈ. సోమశేఖర్ శర్మను, అదేవిధంగా జిల్లా ఇంటర్మీడియట్ విద్యాశాఖ అధికారి కే.రవిబాబులను వారి కార్యాలయాల్లో కలిసి వినతి పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఆకుతోట ఆదినారాయణ, చిర్రా రవిలు మాట్లాడుతూ ప్రజా శ్రేయస్సు దృష్ట్యా నిర్విరామంగా పనిచేస్తున్న జర్నలిస్టుల పిల్లలకు ప్రైవేట్ విద్యాసంస్థల్లో 50 శాతం ఫీజు రాయితీ కల్పించాలని కోరారు. ఈ సందర్భంగా విద్యాశాఖ అధికారులు స్పందిస్తూ జర్నలిస్టుల పిల్లలకు ఫీజులో 50 శాతం రాయితీ కల్పించేందుకు సానుకూలంగా స్పందించారు. అందుకు అవసరమైన సర్క్యులర్‌ను జారీ చేస్తామని, ప్రైవేటు, విద్యాసంస్థలు తక్షణమే జర్నలిస్టు పిల్లలకు ఫీజులో రాయితీ కల్పించాలని ప్రయివేటు విద్యాసంస్థలకు తెలియజేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రెస్ క్లబ్ అధ్యక్షులు గుద్దేటి రమేష్ బాబు, యూనియన్ జిల్లా నాయకులు శెట్టి రజినీకాంత్, మందుల ఉపేందర్, భాస్కర్, టీఎస్ చక్రవర్తి, పిన్ని సత్యనారాయణ, షేక్. జానీ పాషా, తిరుపతిరావు, ప్రెస్‌క్లబ్ ప్రధాన కార్యదర్శి కొరకొప్పుల రాంబాబు, కోశాధికారి బిక్కి గోపి, ఎలక్ట్రానిక్ మీడియా నగర అధ్యక్ష, కార్యదర్శులు యలమందల జగదీష్, కరీష అశోక్, మహిళా జర్నలిస్ట్ వంగూరి ఈశ్వరి, భారతి, ముత్యాల కోటేశ్వరరావు, ఉత్కంఠం శ్రీనివాస్, నాగరాజు, పి. పానకాలరావు, బండి కుమార్, తోట గణేష్, అంతోటి శ్రీనివాస్, వెంకట కృష్ణారావు, యాదగిరి, అప్పారావు, ఇస్సంపల్లి వెంకటేశ్వర్లు, నగేష్, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

# నిర్మాణాలను త్వరగా పూర్తి చేయండి

- సింగరేణి కొత్తగూడెం ఏరియా జీఎం షాలేంరాజు
- జగన్నాధపురం పునరావాస కేంద్ర సందర్శన

**నవతెలంగాణ-సత్తుపల్లి**



సింగరేణి ఆధ్వర్యంలోని జగన్నాధపురం పునరావాస కేంద్రంలో (ఆర్అండ్ఆర్) చేపట్టిన నిర్మాణాలను త్వరిత గతిన పూర్తి చేయాలని సింగరేణి కొత్తగూడెం ఏరియా జనరల్ మేనేజర్ ఎం. షాలేంరాజు సంస్థకు చెందిన సివిల్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం సత్తుపల్లి వచ్చిన జీఎం షాలేంరాజు మండలంలోని కిష్టారం ఓసీ పరిధిలోని జగన్నాధపురం పునరావాస కేంద్రాన్ని పీవో మునగంటి వేదాద్రి నరసింహారావుతో కలిసి సందర్శించారు. ఇక్కడి పునరావాస కేంద్రంలో చేపట్టిన ప్రాథమిక పాఠశాల, దేవాలయం, చర్చి, కమ్యూనిటీహాల్, అంగన్వాడీ సెంటర్ తదితర నిర్మాణాలను జీఎం పరిశీలించారు. నిర్మాణ స్థితిగతులను అధికారులను అడిగి తెలుసుకున్నారు. పనులను వేగవంతం చేసి పూర్తి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జీఎం, పీవోల వెంట ఎస్ఈ (సివిల్) రవికుమార్ పాల్గొన్నారు.

### సింగరేణి బైపాస్‌పై ప్రమాద నివారణ చర్యలపై జీఎం సమీక్ష

ఇటీవల కాలంలో సింగరేణి బైపాస్ రోడ్డులో వాహనాదారులకు తరచుగా జరుగుతున్న ప్రమాదాలపై నేపథ్యంలో జీఎం షాలేంరాజు ఆర్అండ్‌బీ అధికారులతో సత్తుపల్లిలోని తన క్యాంపు కార్యాలయంలో సమీక్షించారు. బైపాస్‌లో రక్షణ సూచికలు, వేగాన్ని తగ్గించడానికి, రోడ్డు అంచులు కనపడే విధంగా రేడియం స్టిక్కర్లను ఏర్పాటు చేయాల్సిందిగా ఆర్అండ్‌బీ అధికారులను జీఎం షాలేంరాజు కోరారు.



## ఖరీఫ్ పనులు ముమ్మరం

**నవతెలంగాణ-కల్లూరు**

అడపాదడపా పడుతున్న వర్షాలకు ఖరీఫ్ వ్యవసాయ పనులు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. మే నెల చివర్లో వర్షాలు పడటం జూన్ నెలలో కూడా వర్షాలు పడుతుండటంతో పత్తి విత్తనాలు, వరి పొలాలు దుక్కులు దున్నటం ఇలా గ్రామాల్లో పనులు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. మండలంలో సుమారు 2500 ఎకరాల్లో పత్తి, 2500 ఎకరాల్లో మిర్చి, 33,740 ఎకరాలు వరి సాగు చేస్తున్నారు. జూన్ మొదటి వారం నుండి పత్తి విత్తనాలు వేయడం ప్రారంభించారు. బత్తులపల్లి, కప్పల బంధం, ఎర్ర బంజర, లక్ష్మీపురం, చిన్న కోరుకొండి, తెలగారం, మర్లపాడు, ఈ గ్రామాల్లో పత్తి విత్తనాలు వేస్తున్నారు. వరి పొలాలు మొత్తం ఒకసారి దుక్కి దున్నారు. కొన్ని గ్రామాల్లో వరి విత్తనాలు కూడా పొడి దుక్కిలోనే చల్లుతున్నారు. నాటు వేస్తే ఎక్కువ ఖర్చు వస్తుందాని, వరి విత్తనాలు చల్లుతున్నారు. మరి కొంతమంది రైతులు జీలుగును, పచ్చిరొట్ట ఎరువు కోసం చల్లుతున్నారు. ఈ విధంగా ఖరీఫ్ వ్యవసాయ పనులు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. వాతావరణం అనుకులించి పంటలు పండుతాయని రైతులు ఆశపడుతున్నారు.

**విత్తనం మొలిచే తేమ ఉంటేనే విత్తనాలు వేయండి : వ్యవసాయ అధికారి ఎం.రూప**

భూమిలో విత్తనం మొలిచే తేమంటేనే విత్తనాలు వేయాలని వ్యవసాయ అధికారి ఎం.రూప రైతులకు సూచించారు. పొడి దుక్కిలో విత్తనాలు వేస్తే సకాలంలో వర్షాలు పడకపోతే విత్తనాలు పొట్లిపోయి, పురుగులు తిని, నష్టపోయే పరిస్థితి ఉంటుందని అన్నారు. అలస్యమైన భూమిలో తేమ ఉండి విత్తనం మొలిస్తేనే విత్తనాలు వేయాలన్నారు.



## నాణ్యమైన విత్తనాలను విక్రయించాలి

- ఎస్సై జి.నరేష్

**నవతెలంగాణ-ముదిగొండ**

వానాకాలం పంటల సీజన్లో నాణ్యమైన విత్తనాలు, ఎరువులను రైతులకు విక్రయించాలని ఎస్సై గజ్జెల నరేష్ పురుగు మందుల, విత్తన డీలర్లకు సూచించారు. మండల పరిధిలో వల్లభి రైతు వేదికలో పురుగు మందులు, విత్తన డీలర్లతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. నకిలీ విత్తనాలు, ఎరువులు విక్రయిస్తే కఠినచర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. విత్తన దుకాణాల వద్ద నకిలీ విత్తనాలపై అవగాహన కల్పిస్తూ బ్యానర్లు ఏర్పాటు చేయాలన్నారు. ఎరువులు, విత్తనాలు విక్రయించినప్పుడు విధిగా రైతులకు రసీదులు ఇవ్వాలని చెప్పారు. ఈసమావేశంలో ఏవో మందుల రాధ, పలువురు డీలర్లు పాల్గొన్నారు.

## నేడే జాతీయ లోక్ అదాలత్

**నవతెలంగాణ-ఖమ్మం లీగల్**

సుప్రీంకోర్టు ఆదేశానుసారం నేడే జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు న్యాయ సేవాధికారి సంస్థ చైర్మెన్ జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి. రాజగోపాల్ తెలిపారు. ఈ లోక్ అదాలత్ ద్వారా కక్షిదారుల కేసులను రాజీ చేసుకునేందుకు ఎటువంటి రుసుము ఉండదని, కోర్టు ఫీజు సైతం తిరిగి చెల్లిస్తారని అప్పీల్ అవకాశం లేని శాశ్వత అంతిమ పరిష్కారం లభిస్తుందని, దీనివల్ల సమయం, డబ్బు, ఆదా అవుతుందని, ఇరు పార్టీలు రాజీ పడిన యెడల గ్రామీణ ప్రాంతంలో ఎలాంటి గొడవలు జరగకుండా మంచి వాతావరణంలో జీవించే అవకాశం ఉందని, లోక్ అదాలత్‌లో రాజీ పడడం ద్వారా ఇరుపక్షాలు విజయం సాధించినట్లేనని అన్నారు. లోక్ అదాలత్ నిర్వహించడానికి ఖమ్మంలో 7, సత్తుపల్లి 3, మధిర 1 బెంచ్‌లను కక్షిదారుల సౌకర్యార్థం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అధిక సంఖ్యలో పాల్గొని రాజీ పడడం ద్వారా శాశ్వత అంతిమ పరిష్కారం పొందడమే కాకుండా కక్షిదారులు విలువైన సమయం, డబ్బు సైతం ఆదావుతుందని అన్నారు.

## నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

**నవతెలంగాణ-ముదిగొండ**

మండల పరిధిలో మాదాపురం 33/11 కెవి విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో విద్యుత్తు తీగల మరమ్మతులు ఉన్నందున శనివారం ఉదయం 8 గంటల మధ్యాహ్నం 1:00 వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలగనున్నదని విద్యుత్ శాఖ ఏఈ మేకపోతుల శ్రీనివాసరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ గృహ వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

## జయశంకర్ బడిబాట కార్యక్రమం

**నవతెలంగాణ-మధిర**

మండల పరిధిలోని చిలుకూరు ఉన్నత, ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం రెండు పాఠశాలల ఆధ్వర్యంలో అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీలతో బడిబాటను ఘనంగా నిర్వహించారు. ప్రభుత్వం అందిస్తున్న ఉచిత పాఠ్య పుస్తకాలు, ఉచిత ఏకరూప దుస్తులు, పోషకవిలువతో కూడిన భోజనం విద్యావంతులైన, ప్రతిభావంతులైన ఉపాధ్యాయ బృందం, సకల సౌకర్యాలతో విద్యార్థులకు విద్యను అందించడం జరుగుతుంది. కావున ప్రభుత్వ బడుల్లోనే బాల బాలికలను చేర్పించి ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాల్సిందిగా కోరుతూ బడిబాట నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ నిడమానూరు సంధ్యవంశీ, పాఠశాల ప్రధానోపాధ్యాయులు వూట్ల శంకర్రావు, వూట్ల రాధాకృష్ణ, ఉపాధ్యాయులు భూలక్ష్మి, సుజాత, అమ్మ ఆదర్శ కమిటీ సభ్యులు, డ్వాక్రా, అంగన్వాడి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

**సత్తుపల్లి :** సత్తుపల్లి మున్సిపాలిటీ పరిధిలోని ఎన్టీఆర్‌నగర్‌లో శుక్రవారం అంగన్వాడీ టీచర్లు బడిబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. 3 నుంచి 6 యేండ్లలోపు పిల్లలను అంగన్వాడీ కేంద్రాలను పంపాలని ప్రచారం చేశారు. కేంద్రంలో పిల్లలకు ఆటపాటలతో విద్యను అందించడం జరుగుతుందన్నారు. కేంద్రానికి వచ్చే పిల్లలకు మధ్యాహ్న భోజనం, స్నాక్స్, గుడ్లు ప్రతిరోజూ అందిస్తారని అంగన్వాడీలు అక్కడి పిల్లల తల్లిదండ్రులకు వివరించారు. ఈ కార్యక్రమంలో సత్తుపల్లి సెక్టార్ సూపర్‌వైజర్ సుజాత, అంగన్వాడీ టీచర్లు రామేశ్వరి, నాగలక్ష్మి, భాగ్యలక్ష్మి, రాజ్యలక్ష్మి, అగర్త, ఆదిలక్ష్మి ఆయాలు, లబ్దిదారులు పాల్గొన్నారు.

## తెలుగు మీడియంనూ కొనసాగించాలి

• జిల్లా కలెక్టర్‌కు టీఎస్‌యూటీఎఫ్ విజ్ఞప్తి

నవతెలంగాణ-ఖమ్మం ప్రాంతీయ ప్రతినిధి

డైరెక్టర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ 2022లో ఇచ్చిన ఉత్తర్వుల ప్రకారం పాఠశాలల్లో ఇంగ్లీష్ మీడియంతో పాటు తెలుగు మీడియంనూ కొనసాగించాలని టీఎస్ యూటీఎఫ్ ఖమ్మం జిల్లా కమిటీ కోరింది. ఈ మేరకు కమిటీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జీవీ నాగమల్లేశ్వరరావు, పారుపల్లి నాగేశ్వరరావు కలెక్టర్ వీపీ గౌతమ్‌కు విజ్ఞప్తి చేస్తూ శుక్రవారం ఓ ప్రకటన విడుదల చేశారు. తెలంగాణలో అన్ని పాఠశాలల్లో 2022-23 విద్యా సంవత్సరం నుంచి ఒకటి నుంచి 8 తరగతుల వరకు ఇంగ్లీష్ మీడియాన్ని ప్రవేశపెట్టారని తెలిపారు. ఆ తర్వాతి సంవత్సరం నుంచి ఏడాదికో తరగతి చొప్పున ఇంగ్లీష్ మీడియాన్ని అమలు చేయాలని సూచించారని, అదే ఉత్తర్వుల్లో ఏ మీడియం చదివించాలనేది తల్లిదండ్రుల ఐచ్ఛికతకు వదిలిన విషయాన్ని ప్రస్తావించారు. దీనిలో భాగంగానే ద్విభాషలతో పాఠ్యపుస్తకాలను ప్రభుత్వం రూపొందిస్తుందని తెలిపారు. కానీ ఖమ్మం జిల్లాలో ఇంగ్లీష్ మీడియాన్ని మాత్రమే ఉంచి తెలుగు మీడియాన్ని కొనసాగించడానికి వీల్లేదని జిల్లా కలెక్టర్ ఆదేశించినట్లు డీఈవో, ఎంఈవోలు ఉపాధ్యాయులకు తెలియజేస్తున్నారని పేర్కొన్నారు. ఒకవేళ అలాంటి ఆదేశాలు ఏమైనా ఉన్నట్టయితే తక్షణం వాటిని నిలిపివేయాలని కోరారు. గతంలో లాగే ఇంగ్లీష్ మీడియంతో పాటు తెలుగు మాధ్యమాన్నీ కొనసాగించాలని కోరారు. తెలుగు మీడియాన్ని ఎత్తివేయడం ప్రభుత్వ నిబంధనలకూ విరుద్ధమైనదికి సూచించారు. ఎప్పటిలాగే తెలుగు, ఇంగ్లీష్ మీడియాలను కొనసాగించాల్సిందిగా కోరారు.

## రైలులో గంజాయి పట్టివేత

• విలువ సుమారు రూ.10 లక్షలు

నవతెలంగాణ-ఖమ్మం

నగరంలో శుక్రవారం కోణార్క్ ఎక్స్‌ప్రెస్‌లో రైళ్లల్లో తనిఖీలు నిర్వహిస్తుండగా 23 కిలోల ఎండు గంజాయి పట్టుకున్నామని ఖమ్మం ఎక్సైజ్ టూ స్టేషన్ పరిధిలో ఎక్సైజ్ ఎన్ఫోర్స్‌మెంట్ పోలీసులు పట్టుకున్నారు. వివరాలు ఇలా ఉన్నాయి. ఒరిస్సా, భువనేశ్వర్ ప్రాంతం నుంచి ఎక్కువగా అక్రమంగా గంజాయి రవాణ అవుతుందని, భువనేశ్వర్ నుంచి ముంబాయి వయా హైదరాబాద్ వెలుతున్న కోణార్క్ ఎక్స్‌ప్రెస్‌లో తనిఖీలు నిర్వహిస్తు ఉండగా రెండు సంచుకల్లో తరలిస్తున్న గంజాయిని ఖమ్మం-2 స్టేషన్ పరిధిలో ఎక్సైజ్ ఎన్ఫోర్స్‌మెంట్ పోలీసులు పట్టుకున్నారు. ఈ తనిఖీల్లో ఎక్సైజ్ డిపార్ట్‌మెంట్ సీఐ సుంకరి రమేష్ తోపాటు హరీష్, వెంకట్, హన్మంతరావు, సుధీర్, విజయ్, బేటీలు కలిసి రైళ్లో తనిఖీలు నిర్వహిస్తున్న క్రమంలోగంజాయి పట్టుబడింది. రెండు సంచుల్లో లభించిన గంజాయిని తూకం వేయగా 23 కేజీలుగా ఉందని, ఈ గంజాయి విలువ సుమారు రూ. 10 లక్షల ఉంటుందని సీఐ తెలిపారు. రైల్లో అక్రమంగా తరలివెలుతున్న గంజాయిని పట్టుకున్న సిబ్బందిని ఎక్సైజ్ అసిస్టెంట్ కమిషనర్, గణేష్, ఏఈఎస్ తిరుపతి అభినందించారు.

## టీడీపీ ఆధ్వర్యంలో విజయోత్సవ ర్యాలీ

నవతెలంగాణ-బోనకల్

ఆంధ్రప్రదేశ్‌లో ఎన్డీఏ కూటమి ఆధ్వర్యంలో తెలుగుదేశం పార్టీ భారీ విజయాన్ని సాధించటంతో టీడీపీ మండల కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. బోనకల్ మండల కేంద్రంలో తెలుగుదేశం పార్టీ, బీజేపీ జనసేన, ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో తెలుగుదేశం పార్టీ కార్యాలయం నుండి రావినూతల, బోనకల్ గ్రామాలలో భారీ బైక్ ర్యాలీని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర ఉపాధ్యక్షులు పార్లమెంటరీ అధ్యక్షులు డాక్టర్ వాసిరెడ్డి రామనాథం, జిల్లా ఉపాధ్యక్షులు మల్లాది హనుమంతరావు ముఖ్యఅతిథిలుగా పాల్గొన్నారు. బోనకల్ గ్రామానికి చెందిన సీనియర్ నాయకులు, టీడీపీ మాజీ మండల అధ్యక్షుడు స్వర్గీయ నందమూరి అనంతరామయ్య విగ్రహంకు పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం మండల కేంద్రంలోని సినిమా హాల్ సెంటర్ వద్ద 20 కేజీల బారి కేక్ కట్ చేసి నూతన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా డాక్టర్ వాసిరెడ్డి రామనాథం మాట్లాడుతూ ఆంధ్ర రాష్ట్రానికి పట్టిన సైకో పీడ వదిలి సైకిల్ పాలన వచ్చిందని, గత ఐదేళ్లలో ప్రజలు అన్ని విధాలుగా పలు ఇబ్బందులకు గురయ్యారని, విజనరీ లీడర్ చంద్రబాబు ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్‌లో అభివృద్ధి పరుగులు పెడుతుందన్నారు. తెలంగాణలో కూడా పార్టీ అభివృద్ధికి చంద్రబాబు నాయుడు ప్రత్యేక ప్రణాళికలను తీసుకొస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు రావుట్ల సత్యనారాయణ, తెదేపా నాయకులు నందమూరి సత్యనారాయణ, సాదినేని హనుమంతరావు, తుళ్లూరు కొండలురావు, పాపినేని వెంకటయ్య కళ్యాణపు వెంకటేశ్వరరావు, మామిళ్ళ నరసింహారావు, మామిళ్ళ కొండలరావు గంగుల శ్రీనివాసరావు, బండి రామారావు, సంద్ర ప్రసాద్, మండేపూడి గోర్కీ, కరివేద పిచ్చయ్య, సాధినేని కొండలరావు, చావా హనుమంతరావు, యనమద్ది ఆదయ్య, రావూరి మంగయ్య, ఏసుపోగు నాగేశ్వరరావు, వట్టికొండ నవీన్, బండి శ్రీనివాసరావు, బీజేపీ నాయకులు వీరప్పనేని అప్పారావు, గుగులోతు నాగేశ్వరరావు, గంగుల నాగయ్య, తదితరులు పాల్గొన్నారు.

## ఈదురుగాలులకు ప్రధాన రహదారిపై విరిగిపడ్డ వృక్షాలు

• ట్రాఫిక్‌కు అంతరాయం



నవతెలంగాణ-ముదిగొండ

మండలంలో శుక్రవారం భారీగా వీచిన ఈదురుగాలులకు చిరుమర్రి, వనంవారికిష్టాపురం వెళ్లే ప్రధాన రహదారిపై రెండు వృక్షాలు విరిగి రోడ్డుపై అడ్డంగా పడ్డాయి. దీంతో ప్రయాణికులు, వాహనదారుల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. చెట్లు విరిగిపడటంతో ప్రాణనష్టం ఏమీ జరగలేదు. రోడ్డుపై విరిగిపడిన వృక్షాలను తొలగించి రాకపోకలకు ఆటంకం లేకుండా చూడాలని ప్రయాణికులు, వాహనదారులు సంబంధిత శాఖ అధికారులను కోరారు.

## కొనసాగుతున్న దోస్త్ ప్రవేశాలు

నవతెలంగాణ-ఖమ్మం

2024-25 వార్షిక విద్యా సంవత్సరం, డిగ్రీ కోర్సుల్లో చేరే విద్యార్థులు మొదటి విడత ప్రవేశాలకు సంబంధించి సీట్లు పొందిన విద్యార్థులు సెల్ఫ్ రిపోర్టింగ్ ఈ నెల 12వ తేదీ వరకు చేయాలని ఎస్ఆర్‌బిజిఎన్ఆర్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మొహ్మద్ జాకిరుల్లా శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థులు సకాలంలో నమోదు చేయకపోతే సీటు కోల్పోతారని వెల్లడించారు. కాగా రెండవ విడత ప్రవేశాలకు 13 వతేదీ వరకు రిజిస్ట్రేషన్ చేసుకునే అవకాశముందని తెలిపారు. 14వరకు వెబ్ ఆప్షన్స్ నమోదు చేసుకోవాలని సూచించారు.

## భైరవునిపల్లిలో దారుణం

• వివాహేతర సంబంధంతో మహిళ హత్య

నవతెలంగాణ-నేలకొండపల్లి

మండలంలోని భైరవునిపల్లి గ్రామంలో శుక్రవారం దారుణం జరిగింది. గ్రామానికి చెందిన బూర సైదమ్మ (50) వివాహిత మహిళను అదే గ్రామానికి చెందిన శ్రీను అనే వ్యక్తి కత్తితో దాడి చేసి కిరాతకంగా హత్య చేసినట్లు గ్రామస్తులు తెలిపారు. మృతురాలు సైదమ్మకు కోదాడ మండలం కట్టకొమ్ముగూడెం గ్రామానికి చెందిన బూర సైదులతో గత 30 ఏళ్ల క్రితం వివాహం జరిగింది. వారికి ఇద్దరు కుమారులు ఉన్నారు. కుటుంబ కలహాల నేపథ్యంలో భర్తతో విడిపోయి గత 15 ఏళ్లుగా మృతురాలు సైదమ్మ భైరవునిపల్లిలోని తల్లిదండ్రుల వద్దే కుమారులతో కలిసి ఉంటుంది. వివాహేతర సంబంధం పెట్టుకున్న వ్యక్తి హత్య చేసి ఉంటాడని గ్రామస్తులు అనుమానిస్తున్నారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. ఆమె మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నేలకొండపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



## కాకర్ల వీరబాబుకు నివాళి



నవతెలంగాణ-కూసుమంచి

మండలంలోని మల్లేపల్లి గ్రామంలో సీపీఐ(ఎం) శాఖ సభ్యులు కాకర్ల వీరబాబు క్యాన్సర్ వ్యాధితో చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందారు. విషయం తెలుసుకున్న సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు ఆయన మృతదేహానికి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) పాలేరు నియోజకవర్గ ఇన్‌చార్జి బుగ్గ వీటి సరళ, జిల్లా కమిటీ సభ్యులు బసిరుద్దీన్, మండల కార్యదర్శి యడవల్లి రమణారెడ్డి, మండల సెక్రటేరియట్ సభ్యులు తోటకూరి రాజు మండల కమిటీ సభ్యులు చీర్ల రాధాకృష్ణ పాల్గొని పార్థీవ దేహాన్ని పార్టీ జెండా కప్పి నివాళులర్పించారు.

# ప్రభుత్వ పాఠశాలలో విద్య కార్పొరేట్‌కు దీటుగా ఉండాలి

• విద్యార్థులు ఇంగ్లీష్ మీడియంపై శ్రద్ధ చూపాలి
• నేరడ పాఠశాల ప్రహరీ గోడ నిర్మాణానికి నిధులు మంజూరు
• కలెక్టర్ వీపీ.గౌతమ్



నవతెలంగాణ-బోనకల్(చింతకాని)

ప్రభుత్వ పాఠశాలలో విద్య, కార్పొరేట్ పాఠశాలల కంటే దీటుగా ఉండాలని, పల్లెల్లో ప్రతి ప్రభుత్వ పాఠశాలకు కావలసిన వసతులు వెంటనే పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ వీపీ. గౌతమ్ అధికారులను ఆదేశించారు. మండల పరిధిలో రాఘవాపురం, లచ్చగూడెం, నేరడ, నాగిలిగొండ, తదితర గ్రామాలలో ఉన్న ప్రభుత్వ పాఠశాలలను ఆయన శుక్రవారం ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు ఇంగ్లీష్ మీడియం పై ఎక్కువ శ్రద్ధ వహించి బోధించాలన్నారు. పాఠశాలల ప్రారంభం కాబోయే సరికి విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా సర్వం సిద్ధంగా ఉండాలని ఆయన అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ పాఠశాలలకు ఎక్కువ మంది విద్యార్థులు వచ్చేలా అవగాహన కల్పించాలని పాఠశాల ఉపాధ్యాయులను ఆదేశించారు. ప్రైవేట్ పాఠశాలలకు వెళ్లే విద్యార్థులను కూడా వీలైనంతవరకు ప్రభుత్వ పాఠశాలల్లో చదివించేలా విద్యార్థి తల్లిదండ్రుల చైతన్యం తీసుకురావాలన్నారు. లక్షల్లో ఫీజులు కట్టి విద్యార్థులను ప్రైవేట్ పాఠశాలలకు పంపడం కంటే ప్రభుత్వ పాఠశాలల్లో కూడా మేము ఇంగ్లీష్ మీడియం బోధిస్తున్నామని తల్లిదండ్రులకు వివరించాలన్నారు. ప్రభుత్వ పాఠశాలలో ఉన్న నాణ్యమైన విద్య ప్రైవేట్ పాఠశాలల్లో బోధించడం లేదని విద్యార్థుల యొక్క తల్లిదండ్రులకు అవగాహన కల్పించే కార్యక్రమాలు చేపట్టాలన్నారు. అనంతరం పాఠశాలల్లో అన్ని వసతులను, టాయిలెట్స్ ను, తరగతి గదులను తనిఖీ చేశారు. నేరడ గ్రామంలో ఉన్న పాఠశాలలో గతంలో 10వ తరగతి చదువుతున్న ఆడపిల్లల పట్ల బయట తిరిగే ఆట మూకలు అసభ్యంగా ప్రవర్తిస్తున్నారని పాఠశాలకు చుట్టూ ప్రహరీ గోడ నిర్మించాలని గ్రామస్తులు నేరడ గ్రామ తాజా ఉప సర్పంచ్ దూసరి గోపాలరావు, పెరిక ప్రభాకర్, గుండెపోగు అఖిల్, కెతిబోయిన పుల్లయ్య మరికొందరు గ్రామస్తులు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో కలెక్టర్ స్పందించి ప్రహరీ గోడ నిర్మాణానికి వెంటనే అనుమతులు మంజూరు చేశారు. అనంతరం నాగలిగొండ ఎస్సీ కాలనీలో ఉన్న పాఠశాలను పరిశీలించి అక్కడ వసతులు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో చింతకాని తహసీల్దార్ అనంతుల రమేష్‌బాబు, ఎంపీడీవో రామయ్య, ఎంఈఓ మోదుగు శ్యామ్సన్, ఎంపీఓ మల్లెల రవీంద్రప్రసాద్, పంచాయతీ కార్యదర్శులు మురళి తదితరులు పాల్గొన్నారు.

### గ్రూఫ్-1 పరీక్ష పకడ్బందీగా నిర్వహించాలి

ఖమ్మం : ఈనెల 9న నిర్వహించనున్న గ్రూప్-1 ప్రిలిమినరీ పరీక్ష తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఆదేశాలకనుగుణంగా పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ వీపీ.గౌతమ్ అన్నారు. శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఫ్లయింగ్ స్క్వాడ్స్, డిపార్ట్మెంట్ అధికారులు, చీఫ్ సూపరింటెండెంట్లకు గ్రూప్- 1 ప్రిలిమినరీ పరీక్షల నిర్వహణపై చేపట్టిన శిక్షణా కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ పాల్గొని, సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ నియమ నిబంధనల ప్రకారం గ్రూప్-1 ప్రిలిమినరీ పరిక్షల నిర్వహణ చేయాలని అధికారులను ఆదేశించారు. మొదటి సారిగా బయోమెట్రిక్ పద్ధతిన పరీక్షలు నిర్వహిస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో రీజనల్ కోఆర్డినేటర్లు విజయ ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జీ. జాన్‌బాబు, ఎస్బిఐటి ప్రిన్సిపాల్ డాక్టర్ డీ. రాజకుమార్, జిల్లా అధికారులు, ఫ్లైయింగ్ స్కాడ్స్, డిపార్ట్మెంట్ అధికారులు, చీఫ్ సూపరింటెండెంట్లు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజాతంత్ర శక్తుల బలోపేతమే సీపీఐ(ఎం) లక్ష్యం

• సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు మాచర్ల భారతి



నవతెలంగాణ-పెనుబల్లి

ప్రజాతంత్ర శక్తులు బలపడేందుకు పార్టీ కార్యకర్తలు వ్యూహాత్మకంగా వ్యవహరించాలని సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు మాచర్ల భారతి పిలుపునిచ్చారు. శుక్రవారం లంకపల్లి పిఎస్ఆర్ ఫంక్షన్ హాల్‌లో ప్రస్తుత ఆర్థిక విధానాలపై రాజకీయ శిక్షణ తరగతులు సీపీఐ(ఎం) మండల కార్యదర్శి గాయం తిరుపతిరావు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె వ్యవసాయ కార్మికులు, రైతులు మధ్యతరగతి ప్రజలను సంఘటితం చేసి వారి సమస్యల పరిష్కారం కోసం పోరాడాలన్నారు. కారల్ మార్క్స్ రచించిన కమ్యూనిజ భావజాలాన్ని ప్రజలకు అర్థమయ్యేలా వివరించాలన్నారు. పెట్టుబడిదారులు భూస్వాములు విధానాన్ని ప్రజల లను చైతన్యవంతులుగా ఆలోచింపజేసేందుకు కృషి చేయాలన్నారు. పెట్టుబడిదారులు కాంట్రాక్టర్లు లాభాపేక్షతో ప్రజల కొనుగోలు శక్తి తగ్గి ఆర్థికంగా దిగజారి పోతున్నారని తెలంగాణ రైతు సంఘం జిల్లా నాయకులు మంద సైదులు అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వస్తువుల ఉత్పత్తి పెరిగిన పేదలు వ్యవసాయ కార్మికులు కొనుగోలు శక్తి పడిపోయి కనీస సౌకర్యాలు పొందలేకపోతున్నారన్నారు గ్రామాల్లో మండలాల్లో ఉన్న ప్రభుత్వ ఆర్థిక వనరులను ఆయా బూర్జువా పార్టీలు పెత్తందారి తనంతో కొందరి వ్యక్తులే కోట్లాది రూపాయలు అర్జిస్తున్నారన్నారు పెట్టుబడిదారులకే కోట్లాది రూపాయలు బ్యాంకు రుణాలు ఇస్తున్నారని దానివల్ల ఆర్థికంగా బలపడి ప్రజాస్వామ్యంలో అనేక పదవులు పొంది మిలియనీర్లుగా మారుతున్నారని అని ఆయన ఈ సందర్భంగా వివరించారు. పేదలు వ్యవసాయ కార్మికులు రైతులు కాయ కష్టం చేసిన ఆర్థికంగా ముందుకు పోక ఎక్కడ వేసిన గొంగడి అక్కడే ఉన్నచందంగా వారి ఆర్థిక పరిస్థితి ఉందన్నారు స్వాతంత్రం వచ్చి 80 ఏళ్లు గడుస్తున్న నిరుద్యోగులకు ఉపాధి లేక మెరుగైన విద్యా వైద్యం అందక అనేకమంది ప్రజలు దుర్భర జీవితాన్ని గడుపుతున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో చలమల విట్టల్‌రావు, గుడిమెట్ల బాబు, చలమాల నరసింహారావు, నల్లమల అరుణ, ప్రతాప్, మిట్టపల్లి నాగమణి, కండ సత్యం, తడికమళ్ళ చిరంజీవి, కొప్పుల వెంకటేశ్వరరావు, మామిళ్ళ సోమయ్య, చిలక రామచంద్ర, నాగ బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## నేడు మంత్రి పొంగులేటి పర్యటన



నవతెలంగాణ-ఖమ్మం

తెలంగాణ రెవెన్యూ, గృహనిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి కూసుమంచి మండలంలో శనివారం పర్యటించనున్నారని మంత్రి పొంగులేటి క్యాంపు కార్యాలయ ఇన్‌చార్జ్ తుంబూరు దయాకర్‌రెడ్డి శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. పర్యటనలో భాగంగా మండలంలోని నాయకన్‌గూడెం, భగత్ వీడు తండా, మంగళి తండా, ఈశ్వర మదారం, రాజుపేట బజార్, రాజుపేట, గోరిలపాడు తండా, హిరామాన్ తండా, పెరిక సింగారం, జక్కేపల్లి, జక్కేపల్లి ఎస్సీ కాలనీ, మల్లేపల్లి, గట్టు సింగారం, గంగబండ తండా, లింగారం తండా, కోక్యా తండా, లోక్యా తండా, నేలపట్ల, అగ్రహారం, మునిగేపల్లి గ్రామాల్లో పర్యటిస్తారని పేర్కొన్నారు. ఆయా గ్రామాల్లోని ప్రజలు నేరుగా మంత్రిని కలిసి తమ సమస్యలను విన్నవించుకోవచ్చని తెలిపారు.




## ప్రపంచ వరి సదస్సులో జిల్లా రైతులు

నవతెలంగాణ-ఖమ్మం

హైదరాబాద్ తాజ్ కృష్ణ హెూటల్‌లో ప్రపంచ వరి సదస్సు ప్రారంభమైంది. రెండు రోజుల పాటు జరిగే ఈ సదస్సును రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, సివిల్ సప్లయిస్ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి ప్రారంభించారు. 25 దేశాల నుండి పాల్గొన్న వరి ఎగుమతి దార్లు, వ్యవసాయ శాస్త్రవేత్తలతో పాటు ఆతిథ్యం ఇస్తున్న మన రాష్ట్రం నుండి ఆదర్శ రైతులు, రైతు హాజరయ్యారు. జిల్లా నుండి రైతు నాయకుడు నల్లమల వెంకటేశ్వరావుతో పాటుగా వైరా కృషి విజ్ఞాన కేంద్ర డైరెక్టర్ రవికుమార్, ఆదర్శ రైతులు రామిరెడ్డి, రామకృష్ణ, రాణా ప్రతాప్, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

# పాలకులు ప్రజా సమస్యలపై దృష్టి సారించాలి

• సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు భూక్య వీరభద్రం



నవతెలంగాణ-కారేపల్లి

కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజా సమస్యల పరిష్కారం పై దృష్టి పెట్టాలని సిపిఐ(ఎం) ఖమ్మం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు భూక్య వీరభద్రం డిమాండ్ చేశారు. సిపిఐ(ఎం) కారేపల్లి మండల కమిటీ సమావేశం తలారి దేవప్రకాష్ అధ్యక్షతన శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా భూక్యా వీరభద్రం మాట్లాడుతూ ఎన్నికలలో అధికార ప్రతిపక్షాలు విమర్శలు ప్రతివిమర్శలతో రక్తి కట్టించాయన్నారు. ప్రజలు ఓట్ల ద్వారా తీర్పు ఇచ్చారని తెలిపారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీల అమలు కోసం కృషి చేయాలని డిమాండ్ చేశారు. ఎన్నికలలో ప్రధాని మోడీకి ప్రజల మధ్య చిచ్చు పెట్టి పబ్బం గడుపుకోవాలని చేసిన ప్రయత్నం విఫలమైందన్నారు. దేశం యువశక్తి నిర్వీర్యం కాకుండా ఉద్యోగ, ఉపాధి కల్పించాలని డిమాండ్ చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ఇచ్చిన ఆరు గ్యారెంటీలపై దృష్టి సారిస్తూ రాష్ట్ర ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలన్నారు. ఏజెన్సీలో పోడు సమస్యకు శాశ్వత పరిష్కరం చూపాలని, పారెస్టు వేధింపుల నుండి పేదలను కాపాడలన్నారు. వ్యవసాయ సీజన్ ప్రారంభమైన తరుణంలో రైతులకు విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు అందుబాటులోకి తేవాలన్నారు. ధరలు అదుపులో తీసుకురావడానికి, ప్రత్యేక కార్యచరణ సాగించాలని కోరారు. రైతు భరోసా ఇవ్వడంతో పాటు బ్యాంకు రుణాలు రైతులకు అందేలా చర్యలు చేపట్టాలని సూచించారు. రూ. రెండు లక్షల రుణమాఫీ వెంటనే అమలు చేయాలని, పక్కా ఇండ్ల నిర్మాణం వెంటనే చేపట్టాలని భూక్య వీరభద్ర డిమాండ్ చేశారు. ప్రజల డిమాండ్ల పరిష్కరించకపోతే ప్రజలను కదిలించి ప్రజా ఉద్యమాలు నిర్వహిస్తామన్నారు. పెంచిన నిత్యవసర సరుకుల ధరలను తగ్గించటానికి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు దృష్టి సారించాలన్నారు. ఈ సమావేశంలో పార్టీ జిల్లా కమిటీ సభ్యులు కొండబోయిన నాగేశ్వరావు, మండల కార్యదర్శి కే.నరేంద్ర, నాయకులు వజ్జా మారావు, రేగళ్ల మంగయ్య, దాసరి మల్లయ్య పండగ కొండయ్య సూరబాక ధనమ్మ, గుగ్రం వెంకటేశ్వర్లు, యనమనగండ్ల రవి, అజ్మీర శోభన్, సురబాక సర్వయ్య, బానోతు కిషన్ తదితరులు పాల్గొన్నారు.

# విద్యుత్ మీటర్ కోసం 'దళిత మహిళ' రెండేళ్లుగా పోరాటం



• ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలిసిన సింధు
• సీఎం ఆదేశాలతో విద్యుత్ మీటర్ ఏర్పాటు

నవతెలంగాణ-బోనకల్

ఓ దళిత ఒంటరి మహిళ తనకు ఎటువంటి ఆధారం లేకపోవడంతో ప్రభుత్వ స్థలంలో మూడేళ్ల క్రితం రేకులతో ఇల్లు నిర్మించుకుంది. ఇంటి కోసం విద్యుత్ మీటర్ ఇవ్వాలని రెండేళ్లుగా అధికారులు చుట్టూ తిరిగింది. కానీ విద్యుత్ అధికారులు ప్రభుత్వ స్థలంలో ఎటువంటి అనుమతి లేకుండా ఇల్లు నిర్మించుకున్నావని, గ్రామపంచాయతీ అనుమతి లేకుండా తాము విద్యుత్ మీటర్ ఇవ్వలేమని స్పష్టం చేశారు. అయినా రెండేళ్లుగా విద్యుత్, తహసీల్దార్ కార్యాలయం చుట్టూ తిరుగుతూనే ఉంది. రాత్రి సమయంలో ఉండలేకపోతున్నామని, తనకు ఇద్దరు పిల్లలు ఉన్నారని, చదువుకుంటున్నారని, కరెంటు లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని మొరపెట్టుకున్న అధికారులు కనికరించలేదు. చివరకు ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డిని జూన్ ఒకటో తేదీన సీఎం క్యాంపు కార్యాలయంలో కలిసింది. ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు విద్యుత్ అధికారులు విద్యుత్ మీటర్ అమర్చిన సంఘటన మండల పరిధిలోని చిరునోముల గ్రామంలో శుక్రవారం చోటుచేసుకుంది.

బాధిత మహిళ తెలిపిన వివరాల ప్రకారం...మండల పరిధిలోని చిరునోముల గ్రామానికి చెందిన పట్టా సుందర్‌రావు కుమార్తె సింధును ఆంధ్రప్రదేశ్ లోనే ఎన్టీఆర్ జిల్లా గంపలగూడెం గ్రామానికి చెందిన ఓ వ్యక్తితో కొన్ని ఏళ్ల క్రితం వివాహం జరిగింది. ఇద్దరు పిల్లలు అనంతరం కుటుంబ కలహాలతో విడిపోయారు. అనంతరం మంద సింధు తన ఇద్దరు పిల్లలు శ్రీశాంత్, క్రిష్ కుమార్‌లను తీసుకొని చిరునోముల వచ్చింది. మూడు నెలలపాటు తల్లిదండ్రుల వద్దనే తన పిల్లలతో కలిసి ఉంది. తల్లిదండ్రుల వద్ద ఉంటూనే ఖాళీగా ఉన్న ప్రభుత్వ స్థలంలో మూడేళ్ల క్రితం ఇంటి నిర్మానం చేపట్టింది. రేకులతో ఓ ఇంటి నిర్మాణం పూర్తి చేసుకుంది. ఇంటి నిర్మాణం పూర్తయిన తర్వాత విద్యుత్ మీటర్ కోసం మండల విద్యుత్ అధికారుల వద్దకు వెళ్ళింది. గ్రామపంచాయతీ నుంచి అనుమతి తీసుకొని వస్తేనే తాము విద్యుత్ మీటర్ ఇస్తామనిపైగా ప్రభుత్వ స్థలంలో నిర్మించుకున్నావని విద్యుత్ మీటర్ ఇవ్వటానికి అధికారులు నిరాకరించారు. గ్రామపంచాయతీ కూడా ప్రస్తుతం తమకు అనుమతి ఇచ్చే అధికారం లేదని స్పష్టం చేశారు. దీంతో విద్యుత్ అధికారులు కూడా గ్రామపంచాయతీ అనుమతి పత్రం లేకుండా తాము విద్యుత్ మీటర్ ఇవ్వలేమని స్పష్టం చేశారు. తనకు ఇద్దరు పిల్లలు ఉన్నారని, తమ ఇంటి చుట్టూ అడవిలా ఉందని ఇంట్లో ఉండలేకపోతున్నామని, తమ పిల్లలు చదువుకుంటున్నారని మానవతా దృక్పథంతో తమకు విద్యుత్తు మీటర్ ఇవ్వాలంటూ మండల తహసిల్దార్, విద్యుత్ కార్యాలయం చుట్టూ రెండేళ్లుగా తిరుగుతూనే ఉంది. అనేకమంది నాయకులను కలిసింది. అయినా ఫలితం లేకుండా పోయింది. తాను ఇద్దరు పిల్లలు చీకట్లో మగ్గుతున్నామని, తాను ఒంటరి మహిళనని, దళితురాలునని మొరపెట్టుకున్న అధికారులు కనికరించలేదు. రాత్రి సమయంలో దోమల బెడద తట్టుకోలేక సింధు నేరుగా విద్యుత్తు లైన్ పై వైరు వేసి విద్యుత్‌ను వినియోగించుకుంటుంది. ఈ విషయం తెలిసిన విద్యుత్ అధికారులు సర్వీస్ వైర్‌ను ఆరు నెలల క్రితం తీసుకొని వెళ్లారు. సింధు ఇంట్లో విద్యుత్తు లేక తీవ్ర ఇబ్బందులు పడుతుండటంతో చిరునోముల గ్రామానికి చెందిన ఓ వ్యక్తి ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి వద్దకు ప్రజావాణి నిర్వహించే రోజు వెళ్ళమని సలహా ఇచ్చారు. ఆ సలహాతో మంద సింధు మార్చి నెలలో ముఖ్యమంత్రి కార్యాలయానికి వెళ్ళింది. అయితే ఆ సమయంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఢిల్లీ వెళ్లడంతో సమస్యను కార్యాలయ సిబ్బందికి వివరించింది. వారి వెంటనే జిల్లా విద్యుత్ ఉన్నతాధికారులతో మాట్లాడారు. అయినా సమస్య పరిష్కారం కాలేదు. దీంతో మరల ఒకటీ జూన్‌న రాత్రి 9:30 గంటల సమయంలో హైదరాబాదులోని ముఖ్యమంత్రి కార్యాలయంలో ఎనుముల రేవంత్‌రెడ్డిని స్వయంగా కలిసి వినతి పత్రం ఇచ్చి సమస్యను వివరించింది. దీంతో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వెంటనే స్పందించి జిల్లా విద్యుత్‌శాఖ అధికారులతో మాట్లాడి వెంటనే విద్యుత్ మీటర్‌ను అమర్చే విధంగా చర్యలు తీసుకోవాలని తన సిబ్బందిని ఆదేశించారు. దీంతో ముఖ్యమంత్రి సిబ్బంది జిల్లా విద్యుత్ ఉన్నతాధికారులతో మాట్లాడి వెంటనే మంద సింధు ఇంటికి విద్యుత్ మీటర్ అమర్చాలని ఆదేశాలు జారీ చేశారు. దీంతో విద్యుత్ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మండల విద్యుత్ అధికారులు ఆగమేఘాల మీద ఆరునెలల క్రితం తీసుకువెళ్లిన సర్వీసు వైర్‌ను, మీటర్‌ను తీసుకువచ్చి ఇంట్లో బిగించారు. దీంతో మంద సింధు ఆనందంలో మునిగి తేలుతుంది. ముఖ్యమంత్రిని తాను స్వయంగా కలిసి సమస్యను వివరించబట్టే విద్యుత్ అధికారులు తనకు విద్యుత్ మీటర్‌ను అమర్చారని సంతోషంతో 'నవ తెలంగాణ'కు తెలిపింది. తన ఇంటికి కాంతిని కల్పించిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి సింధు కృతజ్ఞతలు తెలిపింది.



## నేడు సుదీర్ఘ గాన లహరి

నవతెలంగాణ-ఖమ్మం

ఖమ్మంలో నేడు (శనివారం)32 గంటల నిర్విరామంగా 32 మంది గాయకులచే సుదీర్ఘ గాన లహరి ఉంటుందని అధ్యక్షులు ఇసనపల్లి నగేష్, సీనియర్ గాయకులు వీవీ.రెడ్డి తెలిపారు. శుక్రవారం ఖమ్మంలోని నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఖమ్మంలోని సాయిశ్రీ డెవలపర్స్ అండ్ కన్స్ట్రక్షన్స్ వారి సౌజన్యంతో స్వర మధురిమ కల్చరల్ ఈవెంట్స్- ఖమ్మం వారి ఆధ్వర్యంలో స్థానిక భక్త రామదాసు కళాక్షేత్రంలో శనివారం ఉదయం 10 గంటల నుండి తెలుగు, హిందీ చలన చిత్ర రంగ అగ్రశ్రేణి సినీ తారాగణం నటించిన సుమారు 400 పాటల మధుర గీతాలతో జీనియస్ బుక్ ఆఫ్ రికార్డ్స్, వండర్ బుక్ ఆఫ్ రికార్డ్స్, తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్ 2023 లో జరిగిన 30 గంటల రికార్డ్‌ను అధిగమిస్తూ నూతనంగా 32 గంటల నిర్విరామంగా 32 మంది గాయకులచే పాటల కార్యక్రమము సుదీర్ఘ గాన లహరిని వంజా మాలతీ నాయుడు చే నిర్వహిస్తున్నామని తెలిపారు. సభా కార్యక్రమం ఆదివారం రాత్రి 8 గంటల వరకు ఉంటుందన్నారు. ఈ కార్యక్రమానికి ఖమ్మం, భద్రాచలం, పాల్వంచ, కొత్తగూడెం, హైదరాబాద్, వరంగల్, విజయవాడ, నర్సాపూర్, కరీంనగర్, ఒంగోలు, కాకినాడ, గుంటూరు, ఏలూరు, కడప, కరీంనగర్, చిత్తూరు, నెల్లూరు తదితర జిల్లాల నుండి గాయని గాయకులు అధిక సంఖ్యలో పాల్గొంటారని తెలిపారు.

## నేడు విద్యుత్‌కు అంతరాయం

**నవతెలంగాణ-చంద్రుగొండ**

శనివారం 33/11కేవి చంద్రుగొండ ఉపకేంద్రం నందు మరమ్మతులు ఉన్నందున ఉదయం 09:00 గంటల నుండి మధ్యాహ్నం 01:00 గంటల వరకు చంద్రుగొండ, అయ్యన్నపాలెం, దామరచర్ల, తిప్పనపల్లి, సత్యనారాయణ పురం, దుబ్బ తండా, రవికంపాడు, బాలికుంట, బెండాలపాడు, గుర్రాయి గూడెం గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్టు మండల విద్యుత్ శాఖ ఏఈఎంఎల్ నరసింహారావు తెలిపారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

## సమస్యలు పరిష్కరించండి

**నవతెలంగాణ-మణుగూరు**



ఎన్నికల కోడ్ ఎత్తే ఎత్తివేశారు...సమస్యలను పరిష్కరించాలని ఏరియా ఎస్ఓటు జీఎం శ్యామ్ సుందర్‌కి సింగరేణి ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు అంతోటి నాగేశ్వరరావు ఆధ్వర్యంలో శుక్రవారం వినతి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ఎన్నికల కమిషన్ విధించిన ఎన్నికల కోడ్ (ఎన్నికల ప్రవర్తన నియమావళి) ఎత్తివేసిన నేపథ్యంలో సాధారణ పరిపాలన కొనసాగింపునకు మార్గం సుగమం అయింది కనుక ఏరియా సింగరేణి ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి తగు చర్యలు చేపట్టాలని కోరారు. ముందుగా మర్యాదపూర్వకంగా శుభాకాంక్షలు తెలియజేస్తూ పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఎస్సీ ఎస్టీ ఉద్యోగులకు సంబంధించి రైట్స్ ఆఫ్ రిజర్వేషన్ యాక్టింగ్ ఫ్యానల్ ప్రమోషన్ పాలసీ పైన, ఇతర సమస్యల పైన చర్చించడం జరిగిందని, ఎస్ఓటు జీఎం సానుకూలంగా స్పందించారని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో జనరల్ సెక్రెటరీ అంతోటి నాగేశ్వరరావు, సెంట్రల్ కమిటీ మెంబర్ జిమ్మిడి మల్లేష్, ఎం.రవి, మధుసూదన్ (చిన్ని) సుమన్, మణుగూరు ఏరియా వైస్ ప్రెసిడెంట్ శనిగరపు కుమారస్వామి, డీవైఎఫ్ఎం పసుల రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## వ్యవసాయ వ్యాపార వ్యవహారాలపై ముగిసిన ఆన్‌లైన్ శిక్షణ

**నవతెలంగాణ-అశ్వారావుపేట**



వ్యవసాయ కళాశాలలోని వ్యవసాయ విస్తరణ విభాగం నిర్వహిస్తున్న మూడు రోజుల ఆన్లైన్ శిక్షణా కార్యక్రమం శుక్రవారంతో ముగిసింది. గత మూడు రోజులు అనగా జూన్ 5 నుండి 7వ తారీఖు వరకు నిర్వహించిన ఈ కార్యక్రమంలో వ్యవసాయ వ్యాపార అంశాలపై దేశంలోని వ్యవసాయ శాస్త్రవేత్తలు, నిపుణులు వివిధ అంశాలపై అవగాహన కల్పించారు. వ్యవసాయ విస్తరణా విభాగంలో పేరుగాంచిన సంస్థ "మేనేజ్" (నేషనల్ ఇన్స్టిట్యూట్ అఫ్ అగ్రికల్చరల్ ఎక్స్టెన్షన్ మానెజ్మెంట్) వారి సౌజన్యంతో స్థానిక వ్యవసాయ కలశాల లోని డాక్టర్ టి.శ్రావణ్ కుమార్ నిర్వహించారు. ఈ ముగింపు సభలో సెంటర్ ఫర్ జెండర్ స్టడీస్ సంస్థ డిప్యూటీ డైరెక్టర్‌గా వ్యవహరిస్తున్న డాక్టర్ వినీత కుమారి పాల్గొన్నారు. ఇదే తరహా కార్యక్రమాలు ఇంకా వ్యవసాయ కళాశాలలో ఎన్నో జరిపి కలశాల కీర్తిని పెంపొందించాలని అసోసియేట్ డీన్ డాక్టర్ హేమంత కుమార్ అభిప్రాయపడ్డారు.

## ఈసం భద్రన్న మృతికి సీఐటీయూ నివాళి

**నవతెలంగాణ-ఇల్లందు**

కొమరారం పీహెచ్సీ ఆశా వర్కర్ ఈసం రాధ భర్త సీపీఐ(ఎంఎల్)పార్టీ డివిజన్ కమిటీ సభ్యులు, మాణిక్యారం గ్రామస్తుడు ఈసంభద్రన్న అనారోగ్యంతో శుక్రవారం తుది శ్వాస విడిచారు. ఆయన మృతికి సీఐటీయూ డివిజన్ కమిటీ తీవ్ర సంతాపాన్ని తెలిపి ఆయన భౌతిక కాయానికిపూలమాలలు వేసి నివాళులు అర్పించారు. వారి కుటుంబానికి, ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి అబ్దుల్ నబి, మధ్యాహ్న భోజన కార్మిక యూనియన్ (సీఐటీయూ) జిల్లా కార్యదర్శి సుల్తానా, ఆశా వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) జిల్లా నాయకురాలు చీమల రమణ, మన్యం మోహన్ రావు తదితరులు పాల్గొన్నారు.

## రాఘవరెడ్డిని పరామర్శించిన రెడ్డి సంక్షేమ సమాఖ్య

**నవతెలంగాణ-మణుగూరు**



మాజీ సంక్షేమ సమాఖ్య అధ్యక్షులు జంబూల రాఘవ రెడ్డి, అదే గ్రామానికి చెందిన పసునూరి రాధమ్మ, నర్సమ్మ అనారోగ్యంతో ఉన్నందున రెడ్డి సంక్షేమ సమాఖ్య- మణుగూరు ఆధ్వర్యంలో రెడ్డి సంఘం అధ్యక్షులు నాసిరెడ్డి విజయ భాస్కర్ రెడ్డి, సానికొమ్ము వెంకటేశ్వర్ రెడ్డి, గాయం అవినాష్ రెడ్డి వారి ఇంటికి వెళ్లి వారి ఆరోగ్య వివరములు తెలుసుకొని వారిని పరామర్శించారు.



## ఉచిత పాఠ్యపుస్తకాలు, ఏక రూప దుస్తుల అందజేత

**నవతెలంగాణ-ఆళ్ళపల్లి**

మండల కేంద్రంలోని మండల విద్యా వనరుల కేంద్రంలో శుక్రవారం స్థానిక విద్యాశాఖ అధికారి పి.కృష్ణయ్య ఎంపీడీవో ఆర్.రమాదేవి చేతుల మీదుగా వివిధ పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు పిల్లల ఉచిత పాఠ్యపుస్తకాలు, ఏకరూప దుస్తులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఇస్లావత్ హతిరామ్, షేక్ మహమూద్ పాషా, ఇస్లావత్ నరేష్, భూక్య రమేష్, చిరంజీవి, సమ్మక్క, స్వరూప, అంగోత్ రమేష్, తదితరులు పాల్గొన్నారు.

## మాదిగ జేఏసీ మండల అధ్యక్షుడిగా కొట్టే శేషు

- నియామకం పత్రం అందజేసిన జిల్లా అధ్యక్షులు గద్దల రమేష్

**నవతెలంగాణ-ములకలపల్లి**



మాదిగ జేఏసీ మండల అధ్యక్షుడిగా కొట్టే శేషును నియమించారు. మాదిగ జేఏసీ ముఖ్య కార్యకర్తల సమావేశం గురువారం పాల్వంచ పట్టణంలోని జరిగింది. మాదిగ జేఏసీ జిల్లా అధ్యక్షులు గద్దల రమేష్ కొట్టే శేషుకు నియమక పత్రాన్ని అందజేసి, మాట్లాడారు. డా.పిడమర్తి రవి ఆదేశానుసారంగా మాదిగ జేఏసీ నూతన కార్యవర్గాన్ని ఎనున్నకున్నట్టు తెలిపారు. మాదిగ జేఏసీ సంఘ అభివృద్ధికి కృషి చేయాలని, క్రమశిక్షణ కలిగిన మంచి కార్యకర్తగా అందరినీ కలుపుకొని పోవాలని కొట్టే శేషుకు గద్దల రమేష్ సూచించినారు. ఈ కార్యక్రమంలో లక్ష్మణ్, మధు, ప్రవీణ్, జోషి, తదితరులు పాల్గొన్నారు.

## పాఠశాల ప్రారంభం రోజే పాఠ్యపుస్తకాలు : ఎంఈఓ

**నవతెలంగాణ-పినపాక**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పినపాకలో విద్యా వనరుల కేంద్రానికి పాఠ్యపుస్తకాలు చేరాయని ఎంఈఓ వీరస్వామి తెలియజేశారు. శుక్రవారం పినపాక మండల వనరుల కేంద్రంలో ఉపాధ్యాయులతో సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో ఎంఈఓ వీరస్వామి మాట్లాడుతూ పాఠశాలల ప్రారంభం రోజే విద్యార్థులకు పుస్తకాలు అందించేలా ప్రభుత్వం కార్యాచరణ చేపట్టిందని, అన్ని మండల విద్యా వనరుల కేంద్రాలకు పుస్తకాలు పూర్తిస్థాయిలో చేరాయని తెలియజేశారు. రేపటినుండి అన్ని పాఠశాలలకు పుస్తకాలు పంపిణీ చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పినపాక మండల ఉపాధ్యాయులు, సీఆర్పిలు పాల్గొన్నారు.

## కామ్రేడ్ కోమటి వెంకయ్యకు ఘన నివాళులు

**నవతెలంగాణ-దమ్మపేట**



సీపీఐ(ఎం) నాయకులు, అమరజీవి, కామ్రేడ్ కోమటి వెంకయ్యకు మండల పార్టీ ఆధ్వర్యంలో ఘన నివాళులు అర్పించారు. గురువారం మండల పరిధిలోని నాచారం గ్రామంలో కోమటి వెంకయ్య 12వ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకయ్య స్మారకస్థూపం వద్ద సీనియర్ నాయకులు ఎంద్రాతి అప్పారావు పార్టీ జెండాను ఎగుర వేయగా జిల్లా కమిటీ సభ్యులు పిట్టల అర్జునరావు పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం మండల కమిటి సభ్యులు పిల్లి నాయుడు అధ్యక్షతన జరిగిన సభలో వక్తలు పిట్టల అర్జునరావు, దొడ్డా లక్ష్మీనారాయణ, మండల కార్యదర్శి మోరంపూడి శ్రీనివాసరావులు మాట్లాడుతూ అమరజీవి కోమటి వెంకయ్య ప్రపంచంలోనే మహత్తరమైన కమ్యునిష్టు, మార్కిస్టు పార్టీ సిద్ధాంతాన్ని నమ్మి కడవరకూ ఎర్ర జెండా మోసారని అన్నారు. ఈ ప్రాంతంలో ఆనాటి భూస్వాములు, జమీందారులు, జాగీర్దాల ఆగడాలకు వ్యతిరేకంగా పేద ప్రజల తరపున, వ్యవసాయ కార్మికులు, రైతులు, దళితులు, గిరిజనుల తరపున పోరాటాలు నిర్వహించి వారి సమస్యల పరిష్కారం కోసం కృషి చేశారని అన్నారు. ఈ ప్రాంతంలో మార్కిస్టు పార్టీ అభివృద్ధికి ఎనలేని కృషి చేశారని పేర్కొన్నారు. వీరి కుమారుడు రాష్ట్ర కమిటి సభ్యులుగా హైదరాబాద్‌లో పార్టీ అభివృద్ధి కోసం పనిచేస్తున్నారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో కొండారు ఎల్లమంద, సొసైటీ డైరెక్టర్ బేతిని కుటుంబరావు, ఆబోతు చెన్నకేశవులు, ఎంద్రాజ్ సత్యనారాయణ, మోరంపూడి సూర్యనారాయణ, రామ్‌మోహన్‌రావు, సత్తెనపల్లి కుటుంబరావు, వెంకయ్య కుమారుడు కోమటి రంగయ్య, కోమటి వెంకటేశ్వరావు, జగన్, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

## గ్రూప్-1 ప్రిలిమినరీ పరీక్షకు కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు

- జిల్లా వ్యాప్తంగా 21 సెంటర్లు
- పరీక్షకు హాజరు కానున్న 8,871 మంది అభ్యర్థులు
- ఉదయం 10 గంటలలోపే అనుమతి
- ఒక్క నిమిషం ఆలస్యమైన అనుమతి లేదు
- ఎస్పీ రోహిత్ రాజు

**నవతెలంగాణ-కొత్తగూడెం**



తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీజీ పీఎస్సీ) ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న గ్రూప్-1 ప్రిలిమినరీ పరీక్షకు పోలీసు శాఖ తరపున అన్ని రకాల భద్రతా ఏర్పాట్లు పూర్తి చేసినట్లు, అభ్యర్థులు ఉదయం 10 గంటలలోపు పరీక్షా కేంద్రానికి చేరుకోవాలని, ఒక్క నిముషం ఆలస్యం అయినా అనుమతి ఉండదని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఎస్పీ రోహిత్ రాజు తెలిపారు. శుక్రవారం ప్రకటన విడుదల చేశారు. జిల్లా వ్యాప్తంగా 21 సెంటర్లలో మొత్తం 8,871 మంది అభ్యర్థులు పరీక్ష రాయనున్నారని, పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులకు ఎలాంటి అసౌకర్యాలు కలుగకుండా భద్రతాపరంగా, ఇతర శాఖల సమన్వయంతో కట్టుదిట్టమైన చర్యలు చేపట్టడం జరిగిందన్నారు. పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుదని, ఎవ్వరూ కూడా పరీక్ష కేంద్రం పరిసరాలలో తిరగటానికి వీలు లేదన్నారు. పరీక్షా కేంద్రాల పరిసర ప్రాంతాల్లో ఎలాంటి జిరాక్స్ షాపులు, ఇంటర్నెట్ షాపులు తెరిచి ఉంచరాదన్నారు. బయోమెట్రిక్ విధానం ద్వారా అభ్యర్థులను అనుమతించడం జరుగుతుందని, అభ్యర్థులు బయోమెట్రిక్, వెరిఫికేషన్ సిబ్బందికి సహకరించాలని సూచించారు. ఈ సందర్భంగా గ్రూప్-1 పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులకు పలు సూచనలు చేశారు. జూన్ 9న ఆదివారం ఉదయం 9 గంటల నుండి అభ్యర్థులను పరీక్షా కేంద్రంలోనికి అనుమతించడం జరుగుతుంది. ఖచ్చితంగా 10 గంటలకు ఎగ్జామ్ సెంటర్ గేట్లు మూసివేయడం జరుగుతుందని తెలిపారు. 10 గంటల తర్వాత ఒక్క నిముషం ఆలస్యంగా వచ్చినా ఎవ్వరినీ లోపలికి అనుమతి లేదన్నారు. ఎగ్జామ్‌కు వచ్చిన అభ్యర్థులు హాల్ టికెట్ మీదున్న నియమ నిబంధనలను తప్పకుండా పాటించాలన్నారు. అభ్యర్థులు హాల్ టికెట్‌తో పాటు ఒక కలర్ ఫోటో, ఒరిజినల్ ఆధార్ కార్డు, డ్రైవింగ్ లైసెన్స్, ఉద్యోగి గుర్తింపు కార్డ్, ఓటర్ గుర్తింపు కార్డ్ ఏదైనా ఒకటి తప్పనిసరిగా తీసుకొని రావాల్సి ఉంటుందని తెలిపారు. హాల్ టికెట్ నందు ఫోటో సరిగ్గా కనిపించకపోయినట్లైతే 3-కలర్ ఫోటోలు తీసుకొని, హాల్ టికెట్‌పై గెజిటెడ్ అధికారి సంతకం చేయించుకొని తీసుకురావాలన్నారు. అభ్యర్థులు తమకు కేటాయించిన పరీక్ష కేంద్రాన్ని ముందస్తుగా చూసుకున్నట్లైతే, పరీక్ష రోజు పరీక్ష కేంద్రానికి సులువుగా చేరుకోవచ్చు అన్నారు. పరీక్ష రాయడానికి (బబ్లింగ్) బ్లాక్ లేదా బ్లూ బాల్ పెన్ను మాత్రమే అనుమతిస్తారని అన్నారు. పరీక్షా కేంద్రంలోనికి మొబైల్ ఫోన్స్, స్మార్ట్ వాచ్, కాలిక్యులేటర్స్, వైట్ పేపర్స్, పెన్ డ్రైవ్స్ లాంటి ఎలక్ట్రానిక్ గాడ్జెట్స్‌ను అనుమతించడం జరగదన్నారు. ఎగ్జామ్ పూర్తయిన తర్వాత మధ్యాహ్నం ఒంటిగంట వరకు ఎవ్వరినీ బయటకు పంపడం జరగదని తెలిపారు. అభ్యర్థులు ఎవరైనా మాల్ ప్రాక్టీస్, మాస్ కాపీయింగ్ చేసినట్లు తేలితే చట్టరిత్యా కఠిన చర్యలు తీసుకోనున్నట్టు హెచ్చరించారు. పరీక్షకు హాజరు కానున్న అభ్యర్థులకు ఆయన ముందస్తుగా ఆల్‌దిబెస్ట్ చెప్పారు.

## డిగ్రీ కళాశాలలో ప్రవేశాలు

- ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నిర్వహణ

**నవతెలంగాణ-అశ్వారావుపేట**

ఉన్నత విద్యామండలి దోస్త్ మొదటి ఫేజ్ మొదటి సంవత్సరం ప్రవేశాలను గురువారం ప్రకటించింది. ఈ క్రమంలో అశ్వారావుపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రెండు గ్రూపుల్లో పలువురు విద్యార్థులు ప్రవేశం పొందినట్లు ఈ కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ డాక్టర్ కే.విజయ్ కుమార్ తెలిపారు. బీఏలో, బీఎస్సీ, ఎంపీసీలో విద్యార్థులు చేరినట్ల నవతెలంగాణకు తెలిపారు. మొదటి ఫేజ్ చేరికలు షెడ్యూల్ గురువారంతో ముగిసిందని, నేటి నుండే రూ.400లు రుసుంతో రెండో దఫా రిజిస్ట్రేషన్ మొదలై ఈ నెల 13 వరకు గడువు ఉంటుందని అన్నారు. రెండో ఫేజ్ వెబ్ ఆప్షన్ ఈ నెల 6 నుండి 14 ఉంటుందని అన్నారు.

**ఎట్టకేలకు ప్రవేశాలు :**

వాస్తవానికి ఈ కళాశాల గతేడాది విద్యా సంవత్సరమే మంజూరు అయినప్పటికీ అనుమతులు వచ్చేసరికి దోస్త్ అడ్మిషన్‌లు గడువు ముగిసింది. దీంతో ఒక విద్యాసంవత్సరం వృధా అయింది. ఎట్టకేలకు విద్యార్థులకు సీట్ కేటాయించడంతో కళాశాల సిబంది హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## విత్తన దుఖాణాలను తనిఖీ చేసిన ఏడీఏ

**నవతెలంగాణ-అన్నపురెడ్డిపల్లి**



నకిలీ విత్తనాలు, లూజు విత్తనాలు రైతులకు అమ్మిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఇంటర్నల్ స్కాడ్ తాతారావు హెచ్చరించారు. మండల కేంద్రంలో గల పలు విత్తన దుకాణాలను తాతారావు తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లూజు ప్యాకెట్లు వున్న ప్రతి విత్తనాలు రైతులు కొనుగోలు చేయవద్దు అని అన్నారు. విత్తనాలు కొనుగోలు చేసే రైతులు తప్పనిసరిగా ఆధార్ కార్డు నెంబర్ నమోదు చేసుకొని విత్తనాలు కొనుగోలు చేసుకోవాలని అన్నారు. ఎవరైనా బిల్లు లేకుండా విత్తనాలు అమ్మినట్లు అయితే వారిపై కేసు నమోదు చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏఓ అనూష, ఏఈఓ ప్రశాంత్, డీలర్లు పాల్గొన్నారు.

**పినపాక** నకిలీ విత్తనాలు అమ్మితే కేసులు తప్పవని టాస్క్ ఫోర్స్ వ్యవసాయ శాఖ ఏడీఏ అఫ్జల్ బేగం హెచ్చరించారు. శుక్రవారం మండలంలో గల ఎరువుల దుకాణాలలో శుక్రవారం ఆమె ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. ఎరువుల దుకాణ యజమానులు నకిలీ విత్తనాలు అమ్మినట్టయితే వారిపై కఠిన చర్యలు తీసుకొని లైసెన్స్ రద్దు చేస్తామన్నారు. రైతులందరూ కూడా లైసెన్సు కలిగిన దుకాణంలోనే విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు కొనాలని సూచించారు. ప్రతి రైతు కూడా వారు కొనుగోలు చేసిన ప్రతి వస్తువుకు రసీదు తీసుకోవాలన్నారు. ఫెర్టిలైజర్స్ దుకాణాలలో రికార్డులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో మణుగూరు డివిజన్ ఏవో రామశివరావు, కరకగూడెం ఏవో చటర్జీ, వ్యవసాయ శాఖ విస్తరణ అధికారులు కొమరం లక్ష్మణరావు, రమేష్, ప్రశాంత్, అనిల్, తదితరులు పాల్గొన్నారు.

## ఆదివాసీ మహిళలకు స్కానింగ్ పరీక్షలు

**నవతెలంగాణ-భద్రాచలం రూరల్**



భద్రాచలం ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో పూర్తిస్థాయిలో వైద్య సిబ్బంది అందుబాటులో లేనప్పటికీ వైద్యుల కొరత ప్రభావంతో ఆదివాసీ మహిళలకు ప్రాణాపాయం కలగకూడదన్న ఉద్దేశంతో భద్రాచలం ఐటీడీయో ప్రాజెక్ట్ అధికారి ఆదేశానుసారం ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి సూపరెంటెంట్ ముదిగొండ రామకృష్ణ ప్రత్యేక చొరవతో ఒకే రోజు 23 మంది మారుమూల ఆదివాసీ గర్భిణీలకు స్కానింగ్ పరీక్షలు నిర్వహించారు. వివరాల్లోకెళ్తే గత సంవత్సర కాలం నుండి భద్రాచలం ఆసుపత్రి స్కానింగ్ విభాగానికి ప్రత్యేక వైద్య నిపుణులు లేకపోవడంతో మార్మూల ఆదివాసీ గ్రామాలనుంచి వచ్చే మహిళలు తీవ్ర ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో భద్రాచలం ప్రాజెక్టు అధికారి ప్రతీక్ జైన్ ప్రత్యేక చొరవతో ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి సూపర్డెంట్ ముదిగొండ రామకృష్ణ పాల్వంచ ప్రభుత్వ ఆసుపత్రికి చెందిన స్కానింగ్ వైద్య అధికారిని ప్రతి వారంలో రెండు సార్లు భద్రాచలం ప్రభుత్వాసుపత్రిలోని స్కానింగ్ నిర్వహించే విధంగా ఏర్పాటు చేశారు. ఈ నేపథ్యంలో శుక్రవారం ఏజెన్సీ ప్రాంతంలోని 23 మంది గుత్తి కోయ గర్భిణీలకు స్కానింగ్ పరీక్షలు నిర్వహించి కావలసిన వైద్య సూచనలను అందించారు. పూర్తిస్థాయిలో సిబ్బంది లేకపోయినప్పటికీ ఈ ప్రాంత ప్రజలకు వైద్యాన్ని అందించాలన్న లక్ష్యంతో ఇతర ప్రాంతాల నుండి వైద్య బందాన్ని పిలిపించి మరి వైద్య సేవలు అందించడంతో ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిపై ఈ ప్రాంత ప్రజలకు నమ్మకం నిలబడుతుంది. తెలంగాణ రాష్ట్రంలో నూతన ప్రభుత్వం ఏర్పడ్డ నేపథ్యంలో మూడు రాష్ట్రాలకు సరిత ప్రాంతంగా ఉన్నటువంటి భద్రాచలం ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి పూర్తిస్థాయిలో వైద్యుల్ని నియమించాలని ఈ ప్రాంత ప్రజలు కోరుతున్నారు.



## ముమ్మరంగా రైతుసంఘం సభ్యత్వం చేర్పులు

**నవతెలంగాణ-అశ్వారావుపేట**

మండల వ్యాప్తంగా రైతు సంఘం సభ్యత్వం చేర్పులు ఆ సంఘం రాష్ట్ర నాయకులు పుల్లయ్య నేతృత్వంలో ముమ్మరంగా నిర్వహిస్తున్నారు. అనంతరం మండలంలోని పండువారిగూడెంలో మూడు గ్రామ కమిటీలు ఏర్పాటు చేసారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ రైతాంగానికి ఎన్నికలు ముందు ఇచ్చిన హామీలు అమలు చెయ్యాలని, ప్రస్తుతం రైతులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేసారు. ఈ కార్యక్రమంలో రైతులు, సంఘం సభ్యులు పాల్గొన్నారు.

## గౌతమ బుద్ధుని బోధనలు అందరికీ ఆదర్శం

**నవతెలంగాణ-మణుగూరు**

గౌతమ బుద్ధుని బోధనలు అందరికీ ఆదర్శం అని అబ్దుల్ కలాం జాతీయ అవార్డు, జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత, ఆంగ్ల ఉపాధ్యాయులు డాక్టర్ షేక్ మీరా హుస్సేన్ బుద్ధ పూర్ణిమ అన్నారు. ఈ సందర్భంగా ఆయన గౌతమ బుద్ధుని చిత్రపటానికి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గౌతమ బుద్ధుడు మనోవికాస నిపుణుడని, అందరి పట్ల దయ, ప్రేమ, కరుణ కలిగి ఉండడం పరోపకారం ఎదుటివారిని ఇబ్బంది పెట్టకపోవడం నిందించిన, స్తుతించిన సమానంగా తీసుకోవడం వంటి గౌతమ బుద్ధుని బోధనలు అందరికీ స్ఫూర్తిదాయకం అన్నారు. ఈ బోధనలు సమగ్ర వ్యక్తిత్వ వికాసాన్ని నిర్మిస్తాయన్నారౌ ముఖ్యంగా యువత విద్యార్థినీ, విద్యార్థులు గౌతమ బుద్ధుని బోధనలు పూర్తిగా తీసుకొని దయ దానధర్మ గుణాలను పెంపొందించుకోవాలన్నారు. ఈ సమాజంలో ఎక్కువ మంది ప్రజలు ఆశాశ్వత విషయాలతో మనశ్శాంతిని కోల్పోతున్నారని అన్నారు. శాశ్వతమైన సంతోషం గౌతమ బుద్ధుని బోధన వలన కలుగుతుందని అన్నారు.

## క్రీడలు ఆరోగ్యానికి మేలు

- స్నేహ సంబంధాలూ పెంపొందుతాయి
- సింగరేణి, ప్రెస్ క్లబ్స్ ఫ్రెండ్లీ క్రికెట్ పోటీల సందర్భంగా జీఎం

**నవతెలంగాణ-ఇల్లందు**



దేహ దారుఢ్యానికి, ఆరోగ్యానికి క్రీడీలు మేలు చేయడమే కాకుండా స్నేహ సంబంధాలు పెంపొందుతాయని జనరల్ మేనేజర్ జాన్ ఆనంద్ అన్నారు. శుక్రవారం స్థానిక 24 ఏరియాలోని రన్స్ అండ్ గోల్స్ స్టేడియంలో జరిగిన సింగరేణి, ఇల్లందు ప్రెస్ క్లబ్స్ ఫ్రెండ్లీ క్రికెట్ మ్యాచ్‌ను జీఎం ప్రారంభించారు. ఈ సందర్భంగా జీఎం మాట్లాడుతూ క్రీడలు మానసిక ఉల్లాసానికి శారీరక దారుఢ్యానికి ఎంతగానో తోడ్పడుతాయన్నారు. క్రీడలలో గెలిచినవారు గర్వపడకుండా, ఓడిన వారు నిరుత్సాహపడకుండా ఉండాలని సూచించారు. క్రీడాలలో ఓడినవారు ఓటమికి గల కారణాలను తెలుసుకొని మరల పునరావృతం కాకుండా చూసుకోవాలని పేర్కొన్నారు. ఓటమి గెలుపుకు నాంది అని, ఓటమి చెందినప్పుడే గెలుపు కోసం నిరంతరం కృషి చేయడం జరుగుతుందని తెలిపారు. అనంతరం జరిగిన క్రికెట్ మ్యాచ్‌లో టాస్ గెలిచి ప్రెస్ క్లబ్ జట్టు ఫీల్డింగ్ ఎంచుకుంది. సింగరేణి జట్టు 12 ఓవర్లలో 111 రన్స్ సాధించింది. 112 లక్ష్య సాధనలో ప్రెస్ క్లబ్ జట్టు 82 పరుగులు చేశారు. విజేతగా నిలిచిన సింగరేణి జట్టుకు కప్‌ను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఓటూ జీఎం మల్లారపు మల్లయ్య, కేఓసీ పీఓ శ్రీనివాస్, అధికారుల సంఘం నేత బోడ నాగేశ్వరరావు, గుర్తింపు సంఘ డిప్యూటీ జనరల్ సెక్రెటరీ కె.సారయ్య, ప్రాతినిధ్య సంఘ ఉపాధ్యక్షుడు జె.వెంకటేశ్వర్లు, డీజీఎం పర్సనల్ జీవి మోహన్ రావు, పర్యావరణ అధికారి ధనుంజయ రెడ్డి, సెక్యూరిటీ అధికారి అంజిరెడ్డి, ప్రెస్ క్లబ్ జట్టు కెప్టెన్ శ్రీకాంత్, ప్రెస్ క్లబ్ సభ్యులు, సింగరేణి ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

## పోలీస్ కంట్రోల్ రూమ్‌ను పునరుద్ధరించాలి

**నవతెలంగాణ-మణుగూరు**



సింగరేణి పీవీ కాలనీ ఏరియాలో వరుసగా జరుగుతున్న దొంగతనాల దృష్ట్యా గతములో ఏర్పాటు చేసిన పోలిస్ కంట్రోల్ రూము పునరుద్ధరించి రాత్రి పూట గస్తీ పెంచాలని టీబీజీకేఎస్ డిమాండ్ చేసింది. శుక్రవారం డీఎస్పీ రవీందర్‌రెడ్డికి వినతి పత్రాన్ని అందజేశారు. పీవీ కాలనీ ఏరియా సింగరేణి కార్మిక నివాసాల్లో వరుసగా జరుగుతున్న దొంగతనాలను అరికట్టి గస్తీ మరింతగా పెంచాలని పోలీసులను కోరారు. ప్రకృతికి విరుద్ధముగా విధులు నిర్వహిస్తూ రాష్ట్ర విద్యుత్ అవసరాలతో పాటూ, దేశ విద్యుత్ అవసరాలు తీర్చటంలో సింగరేణి కార్మికుల పాత్ర మరువలేనిదని దిన దిన గండం నూరేళ్ళ ఆయుస్సు లాగా బొగ్గు బాయిలోకి వెళ్లి రక్తాన్ని చెమటగా మార్చి ప్రాణాలకు తెగించి భగవంతుని మీద భారం వేస్తూ కార్మికులు పని చేస్తారని తెలిపారు. కష్టపడి దాచుకున్న పైకాన్ని, బంగారం, వెండి ఆభరణములను గుర్తు తెలియని దుండగులు సునాయాసంగా వారికి ఉన్న నైపుణ్యతతో కాలనీలో చొరబడి దొంగ తనాలకు పాల్పడుతున్నారని తెలిపారు. ఇలాంటి సంఘటనలు వల్ల కార్మిక కుటుంబం ఆర్థికముగా నష్టపోవటమే కాకుండా కుటుంబాలు వీధిన పడ్డ సందర్భాలు ఉన్నాయని తెలిపారు. దొంగతనాల వల్ల కార్మిక వారి కుటుంబ సభ్యులు భయాందోళనకు గురవుతున్నారని తెలిపారు. కార్మిక వారి కుటుంబ శ్రేయస్సును దృష్టిలో ఉంచుకొని గతములో స్థానిక ఏరియా హాస్పిటల్ ఎదురుగా ఏర్పాటు చేసిన పోలిస్ కంట్రోల్ రూమును పునరుద్ధరించి తగు సిబ్బందిని కేటాయించి గస్తీ మరింతగా పెంచాలని వారు కోరారు. అందుకు డీఎస్పీ సానుకూలంగా స్పందించి రాత్రి సమయాల్లో గస్తీ మరింతగా పెంచుతామని హామీ ఇచ్చినట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో రామాచారి, బంగారి పవన్ కుమార్, మునిగెల నాగేశ్వర రావు, వినయ్ కుమార్, శ్రీనివాస్, రమేష్, ఇమ్రాన్ తదితరులు పాల్గొన్నారు.

## ఏఐపీకేఎస్ ఆధ్వర్యంలో ధర్నా

- ఆర్ఐకి వినతి

**నవతెలంగాణ-అశ్వారావుపేట**



ఖరీఫ్ సీజన్లో ఏకకాలంలో రైతులకు రూ.2 లక్షలు రుణమాఫీ చేయాలని, రైతులకు అన్ని రకాల పంటలకు విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు, వ్యవసాయ ఉత్పత్తి సాధనాలు, మినీ ట్రాక్టర్స్ 50 శాతం సబ్సిడీపై ఇవ్వాలని డిమాండ్ చేస్తూ ఏఐపీకేఎస్ (అఖిలభారత ప్రగతి శీల రైతు సంఘం)ఆధ్వర్యంలో ఆ సంఘం నాయకులు కంగాల పుల్లయ్య నాయకత్వంలో శుక్రవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాను ఉద్దేశించి సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు గోకినపల్లి ప్రభాకర్ మాట్లాడారు. రైతులు వ్యవసాయానికి సిద్ధమవుతున్నారని కానీ కేవలం జనుము, జీలుగులు మాత్రమే ప్రభుత్వం పంపిణీకి సిద్ధం చేసిందని వీటితో పాటు అన్ని రకాల విత్తనాలు ఎరువులు, పురుగు, మందులు 50% సబ్సిడీతో, వ్యవసాయ ఉత్పత్తి సాధనాలు వ్యవసాయ పరికరాలు మినీ ట్రాక్టర్లు సబ్సిడీతో ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అలాగే దళిత, గిరిజన, చిన్న, సన్నకారు రైతులకు ఉచితంగా ఇవ్వాలని, నూతన ప్రభుత్వం రైతులకు రెండు లక్షల రూపాయలు రుణమాఫీ చేసి మాట నిలబెట్టుకోవాలని విజ్ఞప్తి చేసారు. అనంతరం తహశీల్దార్ కార్యాలయంలో ఆర్ఐ పద్మావతికి మెమోరాండం అందజేసారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) ఎల్- మాస్ లైన్ (ప్రజా పంథా) అశ్వారావుపేట మండల కార్యదర్శి వాసం బుచ్చి రాజు, మండల నాయకులు ధర్మల శ్రీరాములు, కంగాల భూ లక్ష్మీ, కారం మల్లేష్, గొంది లక్ష్మణ్ రావు, కంగాల గోవింద్ రావు, కొర్రి రాజు, ధర్మల రాంబాబు, సోడెం మల్లేష్, వాసం జోగయ్య తదితరులు పాల్గొన్నారు.

## భద్రన్న మరణం తీరని లోటు

- మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నరసయ్య

నవతెలంగాణ-ఇల్లందు



విప్లవానికి అంకితమై పేద ప్రజల కోసం ప్రాణాలను సైతం లెక్కచేయకుండా నిర్బంధాలను అక్రమ కేసులను ఎదుర్కొని ప్రజా ఉద్యమాల్లో ముందు నడిచిన ఈసం భద్రన్న మరణం విప్లవోద్యమానికి తీరని లోటని, విప్లవద్యమ చరిత్రలో మరువలేని నాయకుడిగా ఈసం భద్రన్న నిలిచిపోతాడని మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నరసయ్య, సీపీఐ ఎంఎల్ ప్రజాపంథా రాష్ట్ర నాయకులు చంద్ర అరుణ, నాయిని రాజు అన్నారు. శుక్రవారం మాణిక్యరం గ్రామంలో ఈసం భద్రన్న భౌతిక దేహం పై ఎర్ర జెండాను కప్పి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈసం భద్రన్న, ప్రజాపంథా డివిజన్ నాయకులు సుదీర్ఘకాలం అజ్ఞాత దళాల్లో పనిచేసి జీవితకాలమంతా పేద ప్రజల కోసమే అంకితం చేసి విప్లవోద్యమంలో ప్రయాణించి నిర్బంధాలను, అక్రమ కేసులను, కష్టాలను ఇష్టంగా భరించి ఏనాడు అలసిపోకుండా త్యాగం చేసేందుకు ముందుకు వచ్చిన ఈసం భద్రన్న నేడు మనకు దూరం కావడం బాధాకరమని వారు అన్నారు. ఇల్లందు ప్రాంతంలో పేద ప్రజల అభ్యున్నతికి పాటుపడుతూ వారి కష్టాల్లో చేదోడుగా ఉంటూ పోడు భూమి పోరాటం, తునికాకు పోరాటం, రోడ్డు రవాణా, మంచినీరు, విద్యా, వైద్యం అభివృద్ధి కోసం జరిగిన పోరాటాల్లో ఈసం భద్రన్న ప్రముఖ పాత్ర పోషించాడని వారు తెలిపారు. భద్రన్న ఆశయాలను కొనసాగిస్తూ ప్రజా ఉద్యమాలలో కొనసాగడమే భద్రన్నకు నిజమైన నివాళి అని వారు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో డివిజన్ కార్యదర్శి ఈసం శంకర్, బుర్ర వెంకన్న, వి.అజయ్, బండారి సత్యం, తులిష్యా, నరసయ్య, మోడెం రాంబాబు, జూకంటి గాంధీ, ముడిగ బుచ్చి రాములు, జనగం కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## బడిబాటకు ఉపాధ్యాయులు డుమ్మా

- ఎంఈఓ పర్యవేక్షణ లేకపోవడంతోనే...

నవతెలంగాణ-పినపాక

రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా బడిబాట కార్యక్రమాన్ని చేపట్టాలని హెడ్మాస్టర్‌ను ఆదేశించిన కొంతమంది హెడ్మాస్టర్లు మాత్రం పెడచెవిన పెట్టినట్టుగా కనిపిస్తుంది. పినపాక మండలంలో మారుమూల ప్రాంతాలలో ఎవరు వస్తారు...ఎవరు చూస్తారు అనే విధంగా కొంతమంది హెడ్మాస్టర్లు ప్రవర్తిస్తున్నారు. ఉపాధ్యాయులు చేద్దామని చూసినా హెడ్మాస్టర్లు ఎందుకులే అన్నట్లుగా ప్రవర్తిస్తున్నట్లుగా సమాచారం. దీంతో ప్రభుత్వం చేపట్టిన బడిబాట కార్యక్రమం కుంటుపడే అవకాశం కనిపిస్తూ ఉంది. స్థానికంగా ఉండకుండా ఉపాధ్యాయులు జిల్లాలో ఏదో ప్రాంతంలో ఉంటూ తూతూ మంత్రంగా బడిబాట కార్యక్రమానికి రాకుండా బడిబాట కార్యక్రమాన్ని మీడియాకు సైతం సమాచారం ఇస్తే ఎక్కడ బయటపడతామో అని కనీసం మీడియాకు సైతం సమాచారం ఇవ్వడం లేదు. బడిబాట కార్యక్రమం ఇలా ఉంటే కొత్త అడ్మిషన్లు ఎలా వస్తాయి. ఒకవైపు ప్రవేటు పాఠశాల ఉపాధ్యాయులు అడ్మిషన్ల కోసం గడపగడపకు తిరుగుతుంటే కొంతమంది హెడ్మాస్టర్ల నిర్వాకంతో ప్రభుత్వ పాఠశాలకు అడ్మిషన్లు దూరమవుతున్నాయి. స్థానికంగా ఉండని ఉపాధ్యాయులపై చర్యలు తీసుకోవాలని పలు సంఘాలు సైతం ఇప్పటికే మండిపడుతున్నారు.

## ప్రతి శుక్రవారం ఫ్రైడే..డ్రై డే పాటించాలి

- మండల ప్రాథమిక వైద్యులు కనకం తనూజ

నవతెలంగాణ-చంద్రుగొండ



ప్రతి శుక్రవారం ఫ్రైడే...డ్రైడే పాటించాలని మండల ప్రాథమిక వైద్యులు కనకం తనూజ తెలిపారు. అయ్యన్నపాలెం గ్రామాలలో డ్రై డే ఫ్రైడే కార్యాచరణ ఇంటి ఇంటికి తిరిగి నిలువ ఉన్న నీటిని ఎప్పటికప్పుడు శుభ్రం చేస్తూ ఉండాలని సూచించారు. దోమలు కుట్టకుండా దోమతెరలు వాడాలన్నారు. దోమకాటు నుండి రక్షించుకుని డెంగ్యూ, మలేరియా వంటి వ్యాధుల నుండి కాపాడుకోవాలని అన్నారు. పరిసరాలు పరిశుభ్రముగా ఉంచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఎన్ఎంలు పుల్లమ్మ, రమణమ్మ, రాధ, భవాని, ఆశాలురుక్మిణి, పుణ్యవతి, కుమారి, లక్ష్మీ, ప్రవళిక, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

## 9న జూనియర్ సివిల్ జడ్జి మోడల్ టెస్ట్

నవతెలంగాణ-కొత్తగూడెం

ఈ నెల 23న తెలంగాణ హై కోర్టు వారు నిర్వహించనునన్న జూనియర్ సివిల్ జడ్జి స్క్రీనింగ్ టెస్ట్‌ను యువ న్యాయవాదులు విజయవంతంగా ఎదుర్కోవడంలో సహాయ పడేందుకు నమూనా మోడల్ టెస్ట్‌ను కొత్తగూడెంలో ఈ నెల 9న నిర్వహించనున్నట్లు ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ (ఐలూ) జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎం.వి. ప్రసాద రావు, రమేష్ కుమార్ మక్కడ్ తెలిపారు. ఏఐఎల్‌యు ఆధ్వర్యంలో నిర్వహించే ఈ పరీక్ష, కొత్తగూడెం జిల్లా కోర్టు ప్రాంగణంలోని బార్ అసోసియేషన్ హాలులో ఉదయం 10.30 గంటలకు నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు. తెలంగాణ రాష్ట్ర వ్యాపితంగా అన్ని జిల్లా కేంద్రాల్లోని మోడల్ టెస్ట్ నిర్వస్తున్నట్లు వారు తెలిపారు. ఈ పరీక్షలో పాల్గొన దలచిన వారు తమతో పాటు కిలారు పురుషోత్తం రావు, పి.కిషన్ రావు, ఎస్. వెంకట నర్సయ్య, జె.శివ రాంప్రసాద్‌లను సంప్రదించాలని విజ్ఞప్తి చేశారు.



## కాబోయే డాక్టర్లను సన్మానించిన జారే

నవతెలంగాణ-అన్నపురెడ్డిపల్లి

ఒకే కుటుంబం నుండి అక్క, తమ్ముడు ఇటీవల నీట్ ఫలితాల్లో ఉత్తమ ఫలితాలు సాధించి మండలంలో ఒకే ఇంట్లో ఇద్దరు కాబోయే డాక్టర్లుగా నిలిచారు. అన్నపురెడ్డిపల్లి గ్రామం మాజీ సర్పంచ్ పద్మ-శ్రీకృష్ణ దంపతులు కుమార్తె హిమ వర్షిణి 448 మార్కులు, లక్ష్మణ్ సాహిత్ 675 మార్కులు సాధించి జాతీయ, రాష్ట్ర స్థాయిలో ఉత్తమ ర్యాంకులు సాధించడంతో అశ్వరావుపేట శాసనసభ్యులు జారే ఆదినారాయణ అన్నపరెడ్డిపల్లిలో వారి స్వగృహానికి వచ్చి శాలువాతో సత్కరించి స్వీటు తినిపించారు. ఈ సందర్భంగా జారే వారికి అభినందనలు తెలియజేశారు. ఎంబిబిఎస్ పూర్తి చేసి పేద ప్రజల కోసం ఉచిత సేవలు అందించి డాక్టర్ వృత్తికి గొప్పతనం తీసుకురావాలని వారికి సూచించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు వనమా గాంధీ, పర్సా వెంకట్ తదితరులు పాల్గొన్నారు.



## అర్హులైన ప్రతి ఒక్కరికీ గృహ జ్యోతి

- ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు

నవతెలంగాణ-మణుగూరు



అర్హులైన ప్రతి ఒక్కరికీ గృహ జ్యోతి పథకం అందుతుందని పినపాక శాసనసభ్యులు పాయం వెంకటేశ్వర్లు అన్నారు. శుక్రవారం న్నికల కోడ్ ముగియడంతో కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న గృహ జ్యోతి పథకానికి దరఖాస్తు చేసుకున్న వారిలో అర్హులైన వారందరికీ నేటి నుండి లబ్ధి చేకూరుతుందని ఎమ్మెల్యే తెలిపారు. 200 యూనిట్లు లోపు విద్యుత్ వినియోగదారులకు జీరో బిల్లులు ప్రభుత్వం జారీ చేస్తుందని, అర్హులైన పేదలు అందరికీ పార్టీలకతీతంగా ప్రజాప్రభుత్వం సంక్షేమ పథకాలు అందిస్తుందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేయడంలో వెనకడుగు వేసేది లేదన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన విమర్శలను ప్రజలు పెడచెవిన పెట్టారని, చక్రం తిప్పుతానన్న నేతలను జీరో చేశారన్నారు.

# నకిలీ విత్తనాలను తక్షణమే అరికట్టాలి

- రైతులకు నాణ్యమైన అన్ని రకాల విత్తనాలు సరఫరా చేయాలి
- రైతు సంఘం రాష్ట్ర నాయకులు కాసాని

నవతెలంగాణ-ములకలపల్లి



నకిలీ విత్తనాలను వెంటనే అరికట్టాలని, రైతులకు నాణ్యమైన విత్తనాలు సరఫరా చేయాలని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర నాయకులు కాసాని ఐలయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం మండల కేంద్రంలోని సీపీఐ(ఎం) కార్యాలయం నందు తెలంగాణ రైతు సంఘం మండల కమిటీ సమావేశం నిర్వహించగా ఆయన హాజరై మాట్లాడారు. ఖరీఫ్ సీజన్ ప్రారంభమైందని రైతులకు విత్తనాలు, ఎరువులు అధికారులు అందుబాటులో ఉంచాలని అన్నారు. నకిలీ విత్తనాలు అరికట్టాలని, 2 లక్షల రైతు రుణమాఫీ ఒకే ఒకే దఫాలో రుణమాఫీ చేయాలని డిమాండ్ చేశారు. జిల్లా మొత్తంలో వడ్డీ వ్యాపారులు విచ్చలవిడిగా రైతుల దగ్గర దోచుకుంటున్నారని వడ్డీ వ్యాపారులపై అధికారులు తక్షణమే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అన్ని రకాల పంటలకు బోనస్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. మూక మామిడి ప్రాజెక్ట్ ఆయకట్టు రైతులందరికీ చివరి కాలువ రైతులకు పంటలు పూర్తి దశ వరకు అధికారులు సాగునీరు అందించాలని డిమాండ్ చేశారు. గ్రామాలలో రైతులకు అవగాహన సదస్సులు ఏర్పాటు చేసి పంటలపై అవగాహన చేయాలని అన్నారు. రైతులకు 24 గంటల కరెంట్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి అన్నవరపు సత్యనారాయణ, సంఘం మండల కార్యదర్శి భూకం రవికుమార్, వర్షా శ్రీరాములు, గోపగాని లక్ష్మీ నరసయ్య, శనగాని వినోద్, శ్రీదేవి, గడ్డం వెంకటేశ్వర్లు, కోర్సా వెంకటేశ్వర్లు, కుర్సం ముత్యాలు, గుగులోతు హేమాని, పెంకె భద్రయ్య, పోడియం సీతారాములు, తదితరులు పాల్గొన్నారు.

## నాటు సారాయిని అరికట్టండి

- పోలీస్ స్టేషన్లో మహిళలు ఫిర్యాదు

నవతెలంగాణ-దుమ్ముగూడెం



నాటు సారాయిని అరికట్టాలని కోరుతూ శుక్రవారం నర్సాపురం గ్రామానికి చెందిన మహిళలు పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. నిరుపేద కుటుంబాలతో చెలగాటమాడుతున్న నాటు సారాను నియంత్రించి, పేద కుటుంబాలకు అండగా నిలవాలని మహిళలు ఎస్సై గణేష్‌కు విన్నవించుకున్నారు. కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు వీరమాచినేని వినీల్ ఆధ్వర్యంలో అందజేసిన వినతిపత్రంలో నరసాపురం గ్రామ పరిసరాలలో నాటుసారా విపరీతంగా పెరిగిపోయిందని, ఈ క్రమంలో పేద కుటుంబాలు సారా మహమ్మారి కారణంగా చిద్రం అవుతున్నాయని, మహిళలు ఎస్సై దృష్టికి తీసుకువెళ్లారు. నాటు సారా నియంత్రణ కోసం ఎక్సైజ్ శాఖ అధికారులకు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసిచేసినా ఫలితం లేకుండా పోతుందని కనీసం దుమ్ముగూడెం పోలీస్ శాఖ అయినా తగు చర్యలు తీసుకోవాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు శిరపు అప్పలరెడ్డి, గ్రామ మహిళలు కనుక రమాదేవి, పుల్లమ్మ, భారతి, లక్ష్మి, వెంకట నరసమ్మ, సంపెల్లి వెంకటమ్మ వల్లపాక భువమ్మ కనుక రమణ, తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్ర అథ్లెటిక్స్ చాంపియన్షిప్ భద్రాద్రి జిల్లా

నవతెలంగాణ-కొత్తగూడెం



తెలంగాణ రాష్ట్ర అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో హన్మకొండ, జవహర్ లాల్ నెహ్రూ స్టేడియంలో ఈ నెల 6, 7వ తేదీలలో జరిగిన 10వ రాష్ట్ర సీనియర్, యూత్ అథ్లెటిక్స్ చాంపియన్ షిప్‌లో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అథ్లెట్లు 30 మంది పాల్గొని మొత్తం 22 పతకాలు సాధించారని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ జనరల్ సెక్రటరి కె.మహిధర్ తెలిపారు. పోటీల్లో పాల్గొన్న క్రీడాకారులు సాధించిన వివరాలు శుక్రవారం ప్రకటనలో తెలిపారు. 7 బంగారు పతకాలు, 11 రజిత పతకాలు, 4 కాంశ్య పతకాలు సాధించారని తెలిపారు. అత్యంత ప్రతిభ కనబరిచి 48 పాయింట్లుతో ఓవరాల్ ఛాంపియన్ షిప్, 18 పాయింట్లతో యూత్ బాలికల ఛాంపియన్ షిప్ సాధించరాని తెలిపారు. విజేతల వివరాలు పాల్వంచకు చెందిన ఆర్.అభినవ నాయక్ 110 మీటర్ల హర్డిల్స్, 200 మీటర్లలో రెండూ బంగారు పతకాలు, భద్రాచలంకు చెందిన వాసం రాజు 800 మీటర్ల పరుగు పందెంలో బంగారు పతకం, 400 మీటర్ల పరుగు పందెం కాంశ్య పతకాలు సాధించారు. టి.శ్రీతేజ, హెప్టాత్లోన్‌లో బంగారు పతకం, కొత్తగూడెంకు చెందిన ఏ.వందన షాట్ పుట్, డిస్కస్ త్రోలో రెండు బంగారు పతకాలు, ఎం.సంగీత త్రీ కిలోమీటర్ల రేస్ వాకింగ్‌లో బంగారు పతకం కైవసం చేసుకున్నారు. రుద్రంపూర్‌కు చెందిన పిఎస్.అభిలాష్ రెండు వంద మీటర్ల పరుగు పందెంలో రజిత పతకం, భద్రాచలంకు చెందిన బి.పృథ్వీవిక జావెలిన్ త్రోలో రజిత పతకం, ఎం.శ్రీవిద్య దొర 400 మీటర్ల పరుగు పందెంలో రజిత పతకం, కొత్తగూడెంకు చెందిన ఎం.ఆఖిల్ 1000 మీటర్ల పరుగు పందెంలో రజిత పతకం, పాల్వంచకు చెందిన ఎం.సిద్ధి వినయ్ హై జంపులో రజిత పతకం, సీహెచ్.వినయ్ లాంగ్ జంప్‌లో రజిత పతకం, బి.దాకేష్ స్వామిత్ 110 మీటర్ల హర్డిల్స్‌లో రజిత పతకం, మెడ్లీ రిలేలో ఆర్.అభినవ నాయక్, బి.దాకేష్ స్వామిత్, పి.మనోజ్ కుమార్, సిహెచ్.వినయ్ బృందం రజిత పతకం, కొత్తగూడెంకు చెందిన శశాంక్ 80 మీటర్ల పరుగు పందెంలో కాంశ్య పతకం, భద్రాచలంకి చెందిన బి.గణేష్ 400 మీటర్ల పరుగు పందెంలో కాంశ్య పతకం, పి.మనోజ్ కుమార్ 100 మీటర్ల పరుగు పందెంలో కాంశ్య పతకం గెలుపొందారని మహిధర్ తెలిపారు. ఈ సందర్భముగా పతకాలు కైవసం చేసుకున్న క్రీడాకారులును, కోచ్‌లు పి.నాగేందర్, కె.శివ, ఎం.నరేశ్, డి.మల్లికార్జునరావు, జన్ను గిరిప్రసాద, ఎం.కృష్ణలను భద్రాద్రి కొత్తగూడెం జిల్లా క్రీడల ఇన్‌చార్జ్ అధికారి కె.సంజీవ రావు, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ అద్యక్షులు జివికే మనోహర రావు, వైస్ ప్రెసిడెంట్ ఈ.మొగిలి, కోశాధికారి రాసపల్లి రాజేందర్ ప్రసాద్, రాష్ట్ర అథ్లెటిక్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ స్టాన్లీ జోన్స్, సెక్రటరి కె.సారంగపాణి, చీఫ్ కోచ్ ఆఫ్ ఇండియా నాగపురి రమేష్, జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ అధ్యక్షులు గొట్టపు రాధాకృష్ణ అభినందించారు.

# ప్రభుత్వ బడులను బలోపేతం చేద్దాం

- బడి బాట కార్యక్రమంలో గ్రామ సమాఖ్య పిలుపు

నవతెలంగాణ-ఇల్లందు



అశ్వారావుపేట



దమ్మపేట



ఇల్లందు



జూలూరుపాడు



పాల్వంచ రూరల్

బడి బయట ఉన్న పిల్లలందరినీ పాఠశాలలో చేర్పించి ప్రభుత్వ బడులను బలోపేతం చేద్దామని గ్రామ సమాఖ్యపిలుపునిచ్చింది. ఉపాధ్యాయులు, గ్రామ సమాఖ్య ప్రత్యేక సమావేశం శుక్రవారం నిర్వహించారు. బడిబాట కార్యక్రమంలో బడి ఈడు పిల్లలను జాయిన్ చేపిస్తామని ప్రతిజ్ఞ చేయించారు. అలాగే సంఘ సభ్యులు, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ సభ్యులు, టీచర్లు, హెడ్ మాస్టర్లు తల్లిదండ్రులు, పాత విద్యార్థులులతో బడిబాట అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో 21పిట్ జెడ్‌పీ హై స్కూల్, ఎంపీ ప్రైమరీ స్కూల్, హెడ్ మాస్టర్ సీహెచ్ రమేష్, టీచర్లు సుజాత, కిరణ్, కృష్ణ కుమారి, పీఈటీ శంకర్, అమ్మ ఆదర్శ పాఠశాల చైర్మెన్ చంద్రు రమణ, రథసారథి గ్రామ సమాఖ్య వీఓఏ సుల్తానా మహిళా సంఘాల సభ్యులు, రథసారథి గ్రామ సమాఖ్య సభ్యులు జాడి సారమ్మ, తదితరులు పాల్గొన్నారు.

**లక్ష్మీదేవి పల్లి :** బడిబాటలో భాగంగా మండలంలోని శ్రీనగర్ కాలనీ పంచాయతీ ఇందిరానగర్ కాలనీ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల పరిధిలో హెచ్ఎ జ్యోతిరాణి ఆధ్వర్యంలో అర్హత ఉన్న పిల్లలను పాఠశాలలో చేర్పించాలని ప్రచారం చేశారు. ప్రభుత్వ పాఠశాలలో కల్పిస్తున్న ఉచిత సౌకర్యాల గురించి తెలియజేశారు. సాంఘిక సంక్షేమ శాఖ హాస్టల్‌లో కూడా సీట్లు ఉన్నాయని, పిల్లలను చేర్పించండి అనీ బీసీ హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ కే.హిమంతరావు ఈ బడిబాటలో పాల్గొని బీసీ హాస్టల్స్‌లో చేరాలని చెప్పారు. టీచర్ శౌరిఇన్నయ్య, పాల్గొన్నారు.

**జూలూరుపాడు :** బడిబాటలో భాగంగా రెండవ రోజు జూలూరుపాడు ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు బృందం శుక్రవారం కీమా తండా, సాయిరాం తండా, దండు మిట్ట తండా గ్రామాలలో గడపగడపకు సందర్శించి విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించే విధంగా కృషి చేస్తున్నారు. వారి కృషి ఫలితంగా పదిమంది విద్యార్థులు ప్రభుత్వ ఉన్నత పాఠశాల జూలూరుపాడులో చేరుటకు విద్యార్థుల తల్లిదండ్రులు వారి అంగీకారాన్ని తెలిపారు.

**దమ్మపేట :** ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమంలో భాగంగా మండల పరిధిలోని నాచారం గ్రామంలో శుక్రవారం డోర్ టు డోర్ సర్వే కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలో బడిఈడు పిల్లలను గుర్తించి బడిలో చేర్పించే ఏర్పాటు చేశారు. ఈ సర్వేలో 5+ విద్యార్థులు, 6వ తరగతి నుండి 10వ తరగతి లోపు విద్యార్థులు, ప్రయివేట్ పాఠశాలల నుండి కూడా విద్యార్థులను అడ్మిషన్‌లు చేయించారు. ప్రభుత్వ పాఠశాలలో అందజేస్తున్న సౌకర్యాలను వివరించారు. అదే విధంగా గ్రామంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల స్పెషల్ ఆఫీసర్ కె సురేష్ కుమార్, ఎంపిడిఓ రవీంద్రనాద్ రెడ్డి, మండల విద్యాశాఖ అధికారిని కె.లక్ష్మి, ఏపీఎం నాగేశ్వరరావు, ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ కార్యకర్తలు, పాల్గొన్నారు.

**పాల్వంచ రూరల్ :** ప్రతి ఉపాధ్యాయుడు ఇంటింటికీ తిరిగి ప్రభుత్వ పాఠశాలల ప్రాధాన్యతను తల్లిదండ్రులకు తెలియ చేసి విద్యార్థులను స్కూల్లో చేర్పించాలని ఎంపీడీవో విజయభాస్కర రెడ్డి సూచించారు. శుక్రవారం మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో బడిబాట కార్యక్రమంపై ప్రధానోపాధ్యాయులు, ఐసిడిఎస్, ఐకెపి సభ్యులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడారు. ప్రతి స్కూల్లో మహిళా సంఘాల సభ్యులతో కమిటీలు వేసి ప్రతి విద్యార్థి స్కూలుకు వెళ్లే విధంగా చూడాలని పేర్కొన్నారు. అనంతరం విద్యాశాఖ అధికారి శ్రీరామ్మూర్తి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ వివేక్, సీడీపీఓ రేవతి, ఎంపీవో బొగ్గ నారాయణ, నోడల్ అధికారి బి.ప్రకాష్ రావు, ఏపీఓ రాంబాబు, ఏపీఓ రంగా, ప్రధానోపాధ్యాయులు, ఐసీడీఎస్ సూపర్వైజర్లు, కమ్యూనిటీ కోఆర్డినేటర్లు, తదితరులు పాల్గొన్నారు.

**అశ్వారావుపేట :** బడి ఈడు పిల్లలందరినీ ప్రభుత్వ బడిలోనే చేర్పించాలని అందుకు అందరూ సమిష్టిగా కృషి చేయాలని ఎంపీడీఓ శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ సమావేశమందిరంలో ఏర్పాటు చేసిన బడిబాట మండలస్థాయి సమన్వయ సమావేశంలో ఆయన మాట్లాడారు. 6వ తేదీ నుండి 19వ తేదీ వరకు ప్రతిరోజు ప్రతి హేబిటేషన్ లోనూ బడిబాట కార్యక్రమాలను నిర్వహించాలని అంగన్వాడీ కార్యకర్తలు, ఐకేపీ, వీఓలు, ప్రధానోపాధ్యాయులు, సీఆర్‌పీలు సమన్వయంతో నిర్వహించాలని అన్నారు. కాంప్లెక్సు ప్రధానోపాధ్యాయులు ప్రతిరోజు నివేదికలను పంపాలని అన్నారు. విద్యాశాఖ మండల నోడల్ అధికారి, మామిళ్ళ వారి గూడెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు ప్రసాదరావు బడిబాట షెడ్యూల్‌ను వివరించారు. సెర్ప్ ఏపీఎం వెంకటేశ్వరరెడ్డి మాట్లాడుతూ పాఠశాలలు తెరిచే నాటికి యూనిఫాం అందించడానికి సన్నాహాలు చేస్తున్నామని అన్నారు. ఈ సందర్భంగా అశ్వారావుపేట జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు పి.హరిత ముద్రించిన బడిబాట కరపత్రాన్ని వారు ఆవిష్కరించారు.

**పినపాక :** రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ బడుల్లో విద్యార్థుల సంఖ్య పెంచడమే లక్ష్యంగా విద్యాశాఖ రూపొందించిన బడిబాట కార్యక్రమం ఉత్సాహంగా సాగుతోంది. ఈ కార్యక్రమంలో భాగంగా గురువారం పినపాక మండలం ఈ బయ్యారం గ్రామపంచాయతీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, స్వచ్ఛంద సంస్థ సభ్యులు అవగాహన ర్యాలీని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెడ్మాస్టర్ నాగయ్య, ఉపాధ్యాయులు గ్రామాల్లో ఇంటింటికి తిరుగుతూ అవగాహన కల్పిస్తున్నారు. సర్కార్ పాఠశాలల్లో 1వ తరగతి నుంచి 10వ తరగతి వరకు ఇంగ్లీష్ మీడియంలో విద్యా బోధన, విశాలమైన తరగతి గదులు, ఆట స్థలం, డిజిటల్ స్మార్ట్ బోర్డ్, నాణ్యమైన విద్యాబోధన అందిస్తున్నామని వారు తల్లిదండ్రులకు వివరిస్తున్నారు. ఉపాధ్యాయులు ఉదయం 7 నుండి 11 గంటల వరకు గ్రామాలలో తిరుగుతూ ఎండ వేడమిని సైతం లెక్క చేయకుండా బడి బాట కార్యక్రమంలో పాల్గొంటూ ప్రభుత్వ పాఠశాలల్లో ఉన్న సౌకర్యాలు తల్లిదండ్రులకి చెపుతూ ఉన్నారు. ఆంగ్ల మాధ్యమంలో పిల్లలు ఇబ్బందులు పడతారనే ఉద్దేశంతో పాఠ్యపుస్తకాల్లో కూడా ఓవైపు తెలుగు, మరోవైపు ఆంగ్లంలో పాఠ్య పుస్తకాలను ముద్రించి పంపిణీ చేస్తుందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు శ్రీనివాస్, నాగేశ్వరరావు, సుజాత, పాపారావు, రఘురాం, సీఆర్పి సాంబశివరావు, స్థానిక యువత వంశీ, శివ, విద్యార్థులు పాల్గొన్నారు.

**జూలూరుపాడు :** రాష్ట్ర ముఖ్యమంత్రి ఆదేశానుసారం మన తెలంగాణ రాష్ట్రంలో ఆరో తారీకు నుండి 19వ తారీకు వరకు జరగబోతున్న మన ఊరి-మనబడి కార్యక్రమంలో భాగంగా రాష్ట్ర విద్యాశాఖ నుండి ఇచ్చిన ఉత్తర్వులు ప్రకారం, కలెక్టర్ ఆదేశానుసారం శుక్రవారం మండల కేంద్రంలో ఎండీఓ ఆధ్వర్యంలో, మండల విద్యాశాఖ అధికారి జి.వెంకట్ ఆదేశానుసారం మండలంలో ఉన్న ప్రాథమిక ప్రాథమికోన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఇందిరా క్రాంతి పథకం ఏపీవో, వీవోల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ప్రభుత్వ పాఠశాల పిల్లలకు యూనిఫామ్ స్టిచ్చింగ్ చేసినవి, బుక్స్ ఈ నెల 10వ తేదీకి పంపిణీ చేయుటకు నిర్ణయించారు. అదే విధంగా మన మండలంలో జరుగుతున్న ఏపీసీ వర్క్స్ గురించి చర్చించడం జరిగిందని మండల విద్యాశాఖ అధికారి వెంకట్ తెలిపారు. ఈ సమావేశంలో మండల విద్యాశాఖ నోడల్ ఆఫీసర్ సంజీవరావు, కాంప్లెక్స్ హెడ్మాస్టర్లు, వివిధ పాఠశాల ప్రధానోపాధ్యాయులు, మండల ఇందిరా క్రాంతి పథక ఏపీఓ సత్యనారాయణ రాజు, సీసీలు, సిఆర్పిఎస్, వీఓలు, విద్యాశాఖ ఐఈఆర్‌పీలు, సీఆర్పిలు తదితరులు పాల్గొన్నారు.

**టేకులపల్లి :** మండలంలోని అన్ని గ్రామాలలో అర్హత గల ప్రతి విద్యార్థి బడిబాట పట్టే విధంగా తల్లిదండ్రులకు వివరించి ఈనెలలో జరిగే బడిబాటను విజయవంతం చేయాలని జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్, జిల్లా గ్రామీణ అభివృద్ధి శాఖ అధికారి విద్యా చందన అన్ని శాఖల అధికారులకు ఆదేశించినట్లు శుక్రవారం తెలిపారు. టేకులపల్లి మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ఈ విద్యా సంవత్సరానికి గాను బడిబాట కార్యక్రమాన్ని అన్ని శాఖల అధికారులు సమన్వయం చేసుకొని, గ్రామాల్లో పాఠశాలకు వెళ్లకుండా ఉన్న విద్యార్థులను గుర్తించి, ప్రతి ఒక్కరినీ ప్రభుత్వ పాఠశాలకు పంపి విధంగా కృషి చేయాలన్నారు. విద్యార్థులకు ప్రభుత్వం ఇవ్వదలచిన రెండు జతల ఏకరూప దుస్తులను ఈనెల 8 తారీకు వరకు పాఠశాలలకు అందజేయాలని స్థానిక ఏపీఎం రవికుమార్‌కు ఆదేశాలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి వెంకటేశ్వర చారి, జిల్లా నోడల్ అధికారి సైదులు, తహసీల్దారు నాగ భవాని, మండల పరిషత్ అధికారి రవీందర్, మండల సమాఖ్య ఏపీఎం రవికుమార్, మండల నోడల్ అధికారి జగన్, సర్ప్ ఐకెపి సీసీలు, వివోఏలు, మండల కాంప్లెక్స్ హెడ్మాస్టర్లు, అంగన్వాడీ సూపర్వైజర్లు, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

## చేప ప్రసాదం వల్ల ఆస్తమా(ఉబ్బసం) నయం కాదు

వెంటనే ఈ కార్యక్రమాన్ని నిలిపివేయాలి

నేషనల్ కోఆర్డినేటర్, సైంటిఫిక్ స్టూడెంట్స్ ఫెడరేషన్ -చార్వాక

నవతెలంగాణ -కొత్తగూడెం

జూన్ 8న హైదరాబాద్లోని నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో బత్తిన సోదరులు వేస్తున్న చేప ప్రసాదం పేరుతో ఆస్తమా (ఉబ్బసం) వ్యాధి నయం చేస్తామని ఇస్తున్న ప్రసాదంలో ఎటువంటి శాస్త్రీయత లేదని, దీనిని నమ్మి ప్రజలు మోసపోవద్దని నేషనల్ కో-ఆర్డినేటర్, సైంటిఫిక్ స్టూడెంట్స్ ఫెడరేషన్ చార్వాక అన్నారు. ప్రతి సంవత్సరం మృగశిర కార్తె రోజున బత్తిని సోదరులు కొర్రమీను చేప పిల్ల నోట్లో చేప ప్రసాదం పేరుతో (ఉబ్బసం) ఆస్తమాను తగ్గిస్తామని చేప పిల్లను మింగించడం తద్వారా ఆస్తమా తగ్గిపోతుందని ప్రజలను నమ్మించి శాఖాహారం భుజించే వారికి అయితే బెల్లం లో ఆ మందును పెట్టి వచ్చిన రోగి నోట్లో నేరుగా వేయడం తద్వారా తగ్గుతుందని నమ్మించి మోసం చేస్తూ వస్తున్నారని ఆరోపించారు. గతంలో ఆస్తమాను తగ్గిస్తామని చేప మందు పేరుతో పంపిణీ చేయగా రాష్ట్రంలోని నాస్తిక, హేతువాద సంఘాలు హైకోర్టులో కేసు వేయగా తాము ఆస్తమాకు మందు వేయడం లేదని కేవలం చేప ప్రసాదం పంపిణీ చేస్తున్నామని ఇది ఒక మతపరమైన ఆచారంగా తరతరాలుగా ఈ విధంగా చేస్తున్నామని బత్తిన సోదరులు హైకోర్టులో వివరించారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఖమ్మం-భద్రాద్రి కొత్తగూడెం
శనివారం | జూన్ 08, 2024 | www.navatelangana.com

## రికార్డులు సమగ్రంగా ఉండాలి

- ఏడీఏ తాతారావు

**నవతెలంగాణ-చండ్రుగొండ**



పురుగుమందు విత్తనాల షాపుల్లోనే రికార్డులను సమగ్రంగా ఉంచాలని ఏడిఏ తాతారావు సూచించారు. శుక్రవారం మండల కేంద్రమైన చండ్రుగొండలో విత్తనాలు షాపులను ఆకస్మికంగా ఆయన తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నకిలీ విత్తనాలను అరికట్టాలన్నారు. నకిలీ విత్తనాలు అమ్మే వారి సమాచారాన్ని రైతులు అధికారులకు తెలియజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి వినయ్, వ్యవసాయ శాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## విద్యుత్ సమస్యలపై సిబ్బంది ప్రత్యేక దృష్టి పెట్టాలి

**నవతెలంగాణ-దుమ్ముగూడెం**

ఇటీవల మండలంలో విద్యుత్ సరఫరాలో తరచూ తీవ్ర అంతరాయం ఏర్పడుతుందని, ఈ విషయంపై ప్రత్యేక దృష్టి సారించి, విద్యుత్ వినియోగదారులకు నిరంతర విద్యుత్ అందించాలని కాంగ్రెస్ పార్టీ నాయకులు విద్యుత్ శాఖ ఏఈ మోహన్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. శుక్రవారం పార్టీ మండల అధ్యక్షులు వీరమాచినేని వినీల్ ఆధ్వర్యంలో నాయకులు విద్యుత్ శాఖ ఏఈ మోహన్ రెడ్డితో మాట్లాడారు. ఇటీవల మండలంలో విద్యుత్ సరఫరాలో తీవ్ర ఇబ్బందులు ఉన్నాయని, చీటికిమాటికి విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడడం వల్ల జనం ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆయన దృష్టికి తీసుకువెళ్లారు. ఏ కారణం చేత ఈ సమస్య తలెత్తుతుందని వివరణ అడిగి తెలుసుకున్నారు. వర్షాలు, గాలి దుమారాల కారణంగా అక్కడక్కడ సాంకేతికపరమైన సమస్యలు తలెత్తుతున్న దృశ్యా విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని, ఎప్పటికప్పుడు సిబ్బందితో విద్యుత్ పునరుద్ధరణ కోసం తీవ్రంగా శ్రమిస్తున్నట్లుగా ఏఈ మోహన్ రెడ్డి కాంగ్రెస్ నాయకులు దృష్టికి తీసుకువెళ్లారు. ఈ కార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ నాయకులు శీరపు అప్పల రెడ్డి, నటరాజ స్వామి, గడ్డం బాలాజీ, కెల్లా శేఖర్, పాల్గొన్నారు.

## ప్రభుత్వ ఉపాధ్యాయులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించి ఆదర్శవంతులు కండి

- ఎస్ఎఫ్ఎస్ఐ మాజీ నాయకులు చందర్రావు

**నవతెలంగాణ-జూలూరుపాడు**

ప్రభుత్వ ఉపాధ్యాయులు మీ పిల్లలను కూడా ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించి విద్యార్థుల తల్లిదండ్రులకు ఆదర్శం కావాలని ఎస్ఎఫ్ఎస్ఐ మాజీ నాయకులు చందర్రావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో మీ పిల్లలను కూడా చేర్పించి, మీరు బడిబాటలో పాల్గొంటే ఎంతో హుందాతనంగా ఉంటుందని అభిప్రాయపడ్డారు. బడిబాట కార్యక్రమంలో ప్రభుత్వ ఉపాధ్యాయులు ఎంతో ఉత్సాహంగా పాల్గొంటున్నా.. కానీ మీరు ఎంత బడిబాటలో పాల్గొన్న మొట్ట మొదట మీ పిల్లలను గవర్నమెంట్ స్కూల్లో జాయిన్ చేసి మీరు ఆదర్శవంతంగా నిలబడాలని కోరారు. ఖమ్మం, ఇతర ప్రాంతాల నుంచి ప్రభుత్వ ఉపాధ్యాయులు ఇక్కడకి వచ్చి విద్యార్థులకు బోధన చేయడం ద్వారా విద్యార్థులకు సరైన నాణ్యమైన విద్య అందటం లేదని తెలుస్తుందని, ఏ మండలంలోంచి పనిచేసే ఉపాధ్యాయులు, గవర్నమెంట్ అధికారులు ఆ మండల హెడ్ క్వార్టర్ లో ఉండి పనిచేస్తే ప్రజలకు సరైన న్యాయం చేకూరుతుందని చందర్రావు అభిప్రాయపడ్డారు.

## ధరణి భూసమస్యలు పరిష్కారం

- ఇన్‌చార్జీ తహసీల్దార్ తిరుమల కరుణాకర్ రెడ్డి

**నవతెలంగాణ-ముదిగొండ**

మండలంలోని రైతులు భూసమస్యల పరిష్కారానికి దరఖాస్తు చేసుకొని ధరణిలో పెండింగ్లో ఉన్న భూసమస్యల పరిష్కారానికి సత్వరమే కృషి చేస్తున్నామని ఇన్‌చార్జీ తహసీల్దార్ తిరుమల కరుణాకర్ రెడ్డి తెలిపారు. ముదిగొండ తహసీల్దార్ కార్యాలయంలో ఆయన శుక్రవారం విలేకరులతో మాట్లాడారు. రైతులు పెట్టుకున్న భూసమస్యల అర్జీలు గత రెండు సంవత్సరాలుగా పెండింగ్లో ఉన్నాయన్నారు. వరస ఎన్నికలతో ఎన్నికల కోడ్ అమల్లో ఉండటంతో ధరణి సమస్యలు పరిష్కారానికి నోచుకోలేదన్నారు. తాను గత నెల 17న ఇన్‌చార్జీ తహసీల్దారుగా బాధ్యతలు చేపట్టిన నాటినుండి 328 ధరణి ఫైల్స్ పెండింగ్లో ఉన్నాయని, వాటిలో 22 రోజుల్లో 248 ఫైల్స్ ను పరిష్కారం చేశామన్నారు. మరో 80 ఫైల్స్ పెండింగ్లో ఉన్నాయని, ఆఫైల్స్‌ని కూడా త్వరలోనే పరిష్కరిస్తామన్నారు. ప్రభుత్వ భూములు కబ్జా చేస్తే కఠినచర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.మండలంలో భూసమస్యలు ఏమైనా ఉంటే, తన దృష్టికి తీసుకురావాలని ఆయన కోరారు. కార్యాలయానికి సమస్యలపై వచ్చే ప్రతి ఒక్కరికీ అందుబాటులో ఉండి సమస్యలు పరిష్కారానికి కృషి చేస్తామని టీ.కరుణాకర్ రెడ్డి చెప్పారు.

## కలెక్టర్‌ను కలిసిన లింగపాలెం రైతులు

- గ్రీన్ ఫీల్డ్ హైవే సమస్యలు పరిష్కరించాలని వినతి

**నవతెలంగాణ-వేంసూరు**

గ్రీన్ ఫీల్డ్ హైవే రోడ్డు నిర్మాణంతో లింగపాలెం పెద్ద చెరువు ఆయకట్టు పరిధిలోని 400 మంది రైతులు రహదారి లేక పంట సాగు ప్రశ్నార్థకంగా మారిందని రైతులు శుక్రవారం కలెక్టర్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. రోడ్డు నిర్మాణ సమయంలోనే సమస్యలు తెలియజేశామని, ప్రత్యామ్నాయ మార్గాన్ని చూడాలని కోరారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో మోరంపూడి వెంకటేశ్వరరావు, ఎర్ర సత్యనారాయణ, గన్నేని సురేష్, యర్రా రమేష్, మోరంపూడి సుబ్బారావు, శివ రంగారావు, నున్న రాంబాబు ఉన్నారు.

**ఎమ్మెల్యేకి వినతి**

లింగపాలెం రైతులు స్థానిక ఎమ్మెల్యే మట్ట రాగమాయి దయానంద్‌ను కలసి సమస్యను తెలియజేసి వినతి పత్రాన్ని అందజేశారు. ఎమ్మెల్యే సూచన మేరకు కలెక్టర్‌ను కలిసి వినతిపత్రాన్ని అందజేశారు.

## నిరుపేద మహిళకు కుట్టు మిషన్ పంపిణీ

**నవతెలంగాణ-వైరాటౌన్**

మహిళలకు, పేదలకు వివిధ రకాలుగా తోడ్పాటు ఇవ్వటంలో భాగంగా లయన్స్ క్లబ్ వైరా పలు సేవా కార్యక్రమాలను గత 18 సంవత్సరాలుగా నిర్వహిస్తున్నామని ఫాస్ట్ డిస్ట్రిక్ గవర్నర్ డాక్టర్ మురళీకృష్ణ అన్నారు. లయన్స్ క్లబ్ వైరా అధ్యక్షులు పెనుగొండ ఉపేంద్రరావు ఆధ్వర్యంలో కొమిరిశెట్టి శ్రీధర్, పుష్పావతి దంపతుల దాతృత్వంతో జింకల గూడెంనకు చెందిన నిరుపేద మహిళకు జీవనోపాధి నిమిత్తం కుట్టు మిషన్ అందజేశారు. అనంతరం మరొక ముగ్గురు నిరుపేద మహిళలకు, నిరుపేద వృద్ధులకు నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షులు పెనుగొండ ఉపేంద్రరావు, కొమిరిశెట్టి శ్రీధర్, పుష్పావతి జీఎంటి కోఆర్డినేటర్ యు.శ్యాంబాబు, ఛాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షులు వనమా విశ్వేశ్వరరావు పాల్గొన్నారు.

## భూవివాదంలో ఘర్షణ

**నవతెలంగాణ-ములకలపల్లి**

భూ వివాద విషయమై జరిగిన ఘర్షణలో ఇరువర్గాలకు తీవ్ర గాయాలు కాగా ఒకరిపై ఒకరు స్థానిక పోలీస్ స్టేషన్ లో శుక్రవారం ఫిర్యాదు చేసుకున్నారు. బాధితులు స్థానిక పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండల పరిధిలోని తిమ్మంపేట గ్రామానికి చెందిన రాయల రాములు స్థానిక వీఆర్ఏ (మిషన్ భగీరథలో హెల్పర్ గా విధులు నిర్వర్తిస్తున్నారు. ఈ క్రమంలో గురువారం రాత్రి అదే గ్రామానికి చెందిన జలగం కృష్ణ ఇంటి ఎదురుగా వెళ్లి అసభ్యపదజలంతో దుర్భాషలాడుతుండగా, ఆగ్రహనికి గురైన కృష్ణ ఆయన కుమారుడు సుభాష్ లు రాములుపై దాడి చేశారు. ఈ దాడిలో రాములుకు తీవ్ర గాయాలు కావడంతో చుట్టుపక్కల వారు వారిని సముదాయించి రాములును ఇంటికి పంపించారు. ఉదయం విషయం తెలుసుకున్న రాములు కుమారులు రాయల రమేష్, సురేష్, శ్రీనులు కోపోద్రుక్తులై అదే సమయంలో తన తండ్రిపై దాడిచేసిన వారిలో ఒక్కరైనా జలగం సుభాష్ పై దాడికి పాల్పడతారు. ఈ దాడిలో సుభాష్ తల పగిలి తీవ్ర రక్తస్రావం అవుతుంది. ఇరువర్గాల ఒకరిపై ఒకరు స్థానిక పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేసుకోవడంతో కేసు నమోదు చేసిన ఎస్సై గాయాల పాలైన వారిని చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించి ఇరువర్గాలపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. ఇదిలావుంటే రాయల రాములుకి గ్రామంలో కొంత భూమి ఉండేదని ఆ భూమి లో కొందరు నివాసాలు ఏర్పాటు చేసుకోని ఉంటున్నారని, మద్యం సేవించి అలవాటు ఉన్న రాములు మద్యం తాగినప్పుడల్లా వారిని తన భూమిలో అక్రమంగా ఉంటున్నారని దూషిస్తూ ఉంటాడని ఈ క్రమంలోనే రాములు పై దాడి జరగడం తో అది ఘర్షణ కు దారి తీసినట్లు సమాచారం.

## ముమ్మరంగా వరి నార్లు

**నవతెలంగాణ-అన్నపురెడ్డిపల్లి**



వర్షాకాలం వరి పంట కోసం జూన్ మొదటి వారంలోనే రైతులు వ్యవసాయ పనులు ముమ్మరంగా ప్రారంభించారు. మండల పరిధిలోని రాజపురం గ్రామంలో పలువురు రైతులు చిన్నపాటి చిరు జల్లులకే వరి(నారు) విత్తనాలు జల్లినారు. కాలంతో పాటు వేగంగా రైతులు కూడా అభివృద్ధి చెందుతూ ముందుగానే వరి నార్లు పోసి జిల్లాలో అన్ని ప్రాంతాల కంటే ముందుగానే అన్నపురెడ్డిపల్లి మండలంలో నాట్లు వేస్తారు. స్వగ్రామాల నుండే కాకుండా నాట్లు కూలీలను ఇతర రాష్ట్రాల నుండి తీసుకు వచ్చి రాజపురం గ్రామంలో వరి నాట్లు వేయంచడం జరుగుతుంది. విచిత్రం ఏమిటంటే ఒకే గ్రామంలో ప్రక్క ప్రక్కనే వున్న రైతులు ఒకరు భూమి సారవంతం చేయడం కోసం పచ్చి రొట్ట విత్తనాలు(జీలుగులు) జల్లుతుండటంతో మరో వైపు ఒక రైతు నారు పోయడం మరొక రైతు కరి యెద పెట్టడం చేస్తున్నారు. ఏది ఏమైనా ఎకరానికి 40 బస్తాలు దిగబడి తగ్గకుండా ప్రతి రైతు పండిస్తూ వేగంగా వ్యవసాయ పనులను చేస్తున్నారు.

# ఇంటర్ వార్షిక పరీక్షల విధులు నిర్వహించిన వారికి వెంటనే రెమినరేషన్ చెల్లించాలి

- డీఐఈవో రవి బాబుకి వినతి

**నవతెలంగాణ-ఖమ్మం**



తెలంగాణ ఇంటర్ బోర్డు నిర్వహించే ఇంటర్ పబ్లిక్ వార్షిక పరీక్షల నిర్వహణలో పాల్గొనే వారికి పెండింగ్ రెమ్యూనరేషన్ వెంటనే చెల్లించాలని కోరుతూ శుక్రవారం ఖమ్మంలోని నయాబజార్ ఇంటర్ మూల్యాంక కేంద్రం వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా తెలంగాణ గెజిటెడ్ జూనియర్ లెక్చరర్స్ అసోసియేషన్ 475 ఖమ్మం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు గుమ్మడి మల్లయ్య, కొండ వినోద్ బాబు మాట్లాడుతూ గత రెండు సంవత్సరాల క్రితం ఇంటర్ పబ్లిక్ వార్షిక పరీక్షల, ప్రాక్టికల్, థియరీ, స్పాట్ విధులు అనంతరం స్థానికంగా ఇక్కడనే అందులో పని చేసే సిబ్బందికి రెమినరేషన్ చెల్లించేవారని, కానీ గత రెండు సంవత్సరాల నుంచి రెమినరేషన్ చెల్లింపులో తెలంగాణ ఇంటర్ బోర్డు ఆన్లైన్ ద్వారా చెల్లిస్తానని చెబుతూ, చాలా ఇబ్బందులు గురి చేస్తుందని, 2023, 2024 పెండింగ్ రెమ్యూనరేషన్ ఇంతవరకు చెల్లించలేదని, ఈ విషయంపై గత రెండు నెలలుగా అధికారులకు వినతి పత్రాలు ఇవ్వటం జరిగిందని, కానీ ఫలితం లేకపోవడంతో రాష్ట్రవ్యాప్తంగా ఇంటర్ మూల్యాంకన కేంద్రాల వద్ద భోజనం విరామ సమయంలో క్యాంప్ అధికారి రవి బాబుకి వినతి పత్రం అందజేశామని అన్నారు. ఇప్పటికైనా తెలంగాణ ఇంటర్ బోర్డు కార్యదర్శి జోక్యం చేసుకొని ఇంటర్ మూల్యాంకన కేంద్రంలో పనిచేసే వారికి ఇంటర్ వార్షిక పరీక్షలో విధులు నిర్వహించే వారికి గతంలో లాగా వెంటనే రెమినేషన్ చెల్లించాలని కోరారు.

ఈ కార్యక్రమంలో తెలంగాణ గెజిటెడ్ జూనియర్ లెక్చరర్స్ అసోసియేషన్ -475 రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ కొప్పిశెట్టి సురేష్, రాష్ట్ర నాయకులు శ్రీకాంత్, జి. నరసింహారావు, ఖమ్మం జిల్లా గౌరవ అధ్యక్షులు ఐ.కృష్ణార్జునరావు, భాస్కర్, గ్రంథ పాలకుల సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఎం.గోపాలకృష్ణ, ఎస్.ప్రసాద్ బాబు, ఖమ్మం జిల్లా గెజిటెడ్ జూనియర్ లెక్చరర్స్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు పార్థసారథి, రాష్ట్ర నాయకులు మధు, ఈశ్వరరావు, పంది సత్యనారాయణ, డాక్టర్ శ్రీధర్, సంస్కృత సీనియర్ అధ్యాపకులు భాషా తదితరులు పాల్గొన్నారు.



## ర్యాంకులు సాధించిన గిరి బిడ్డలకు అభినందనలు

**ఐటీడీఏ పీవో ప్రతీక్ జైన్**

**నవతెలంగాణ-భద్రాచలం రూరల్**

గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నడపబడుతున్న తెలంగాణ గిరిజన సంక్షేమ గురుకుల డిగ్రీ కళాశాల (బాలికలు) కొత్తగూడెంలో డిగ్రీ చదివిన విద్యార్థినులు అత్యుత్తమ ర్యాంకులతో ఐఐఎం, ఐఐటీలో సీట్లు సంపాదించి తోటి విద్యార్థినిలకు విద్య పట్ల మక్కువ కలిగించి వారిలో స్ఫూర్తి నింపడానికి మార్గదర్శకులుగా నిలవడం చాలా సంతోషమని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి ప్రతీక్ జైన్ అన్నారు. శుక్రవారం తన చాంబర్లో కరకగూడెం మండలం, గొల్లగూడెం గ్రామానికి చెందిన పాయం ప్రవళిక, సీఏటీ- ఎంబీఏ, కోర్సులో 66.44శాతం సాధించి కలకత్తాలో సీటు సంపాదించిందని, బూర్గంపాడు మండలం అంజనాపురం గ్రామానికి చెందిన బానోత్ స్వాతి, ఐఐటీ జేఏఎం - పీజీ గణితంలో 1449 ర్యాంకు సంపాదించి మద్రాసులో సీటు సంపాదించిందని, పినపాక మండలం అమరవరం గ్రామానికి చెందిన వజ్ర మానస, ఐఐటీ జేఏఎం- పిజి ఫిజిక్స్ లో 5042 ర్యాంకు సాధించి, జోద్‌పూర్‌లో సీటు సంపాదించిందని ఆయన అన్నారు. డిగ్రీ కోర్సులో అత్యుత్తమ మార్కులతో పాసై ర్యాంకులు సాధించి కళాశాలకు, వారి గ్రామానికి తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకుని రావడం చాలా సంతోషమని అన్నారు. ఈ కార్యక్రమంలో గురుకులం ఆర్సిఓ వెంకటేశ్వర్ రాజు, కళాశాల ప్రిన్సిపాల్ రాజేశ్వరి, అధ్యాపకులు అనురాధ, సునీత, కృష్ణ, స్పందన, విద్యార్థినిల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

## బడుల్లో పరిశుభ్రమైన వాతావరణం ఉంచాలి

**- ఎంపీపీ కోండ్రు మంజు భార్గవి**

**నవతెలంగాణ - ఆళ్ళపల్లి**

2024-25 నూతన విద్యా సంవత్సరం ఈనెల 12వ తేదీ నుంచి ప్రారంభం కానున్న నేపథ్యంలో పిల్లలు ఆసక్తితో వచ్చేలా అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో ముందస్తుగా పరిశుభ్రమైన వాతావరణం ఉంచాలని స్థానిక ఎంపీపీ కోండ్రు మంజు భార్గవి స్థానిక మండల పంచాయతీ అధికారిని ఆదేశించారు. శుక్రవారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మండలంలోని వివిధ గ్రామాల పంచాయతీ కార్యదర్శులు పాఠశాల బాధ్యత తీసుకొని దగ్గర ఉండి శుభ్రం చేపించాలని చెప్పారు. పాఠశాలు ప్రారంభోత్సవం నాటి నుండి మొక్కలు లేని పాఠశాలల్లో విద్యార్థులు, ఉపాధ్యాయులు, ఆసక్తిగల పిల్లల తల్లిదండ్రులు అందరూ కలిసి మొక్కలు దశలవారీగా పెట్టేందుకు ఓ ప్రణాళిక ఏర్పాటు చేయాలని సూచించారు.

# చికిత్స పొందుతూ సీఐటీయూ నాయకుడు పేరసాని మృతి

- సీఐటీయూ, ఏఐటీయూసీ, సీపీఐ(ఎం), సీపీఐ, కాంగ్రెస్, బీఆర్ఎస్ నివాళి



**నవతెలంగాణ-కొణిజర్ల**

గత రెండు రోజుల కిందట రోడ్డు ప్రమాదానికి గురై చికిత్స పొందుతూ కండక్టర్, సీఐటీయూ నాయకుడు పేరసాని రామారావు(58) ఖమ్మం పట్టణంలోని ఓ ప్రయివేటు ఆస్పత్రిలో శుక్రవారం మధ్యాహ్నం మృతి చెందారు. మండల పరిధిలోని తనికెళ్ళ గ్రామానికి చెందిన పేరసాని రామారావు చిన్ననాటి నుంచి ఎస్ఎఫ్ఐ, డీవైఎఫ్ఐ సంఘాలలో పనిచేసారు. అనంతరం కండక్టర్‌గా ఉద్యోగం సాధించి కొత్తగూడెం డిపోలో కండక్టర్‌గా బాధ్యతల్లో ఉంటూ సీఐటీయూ అనుబంధ సంఘం అయిన (ఎస్‌డబ్ల్యూఎఫ్) సంఘంలో పనిచేస్తున్నారు. విషయం తెలుసుకున్న ఎస్‌డబ్ల్యూఎఫ్ సంఘం రాష్ట్ర నాయకులు ఎంఎన్ రెడ్డి ఫోన్ లో సంతాపాన్ని తెలియజేశారు. సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు, సీఐటీయూ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు కళ్యాణం వెంకటేశ్వరరావు, తుమ్మా విష్ణువర్ధన్ రెడ్డి, సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు భూక్య వీరభద్రం, బొంతు రాంబాబు, జిల్లా కమిటీ సభ్యులు తాళ్లపల్లి క్రిష్ణ, రామారావు మృతదేహాన్ని సందర్శించి నివాళు లర్పించారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు మోత్కూరి వెంకటేశ్వర్లు, ఏఐటీయూసీ నాయకులు పెదమల్ల సత్యనారాయణ, సీపీఐ(ఎం), సీపీఐ, కాంగ్రెస్, బీఆర్ఎస్ నాయకులు కొప్పుల క్రిష్ణయ్య, చింతనిప్పు చలపతిరావు, అన్నారపు వెంకటేశ్వర్లు, పివి రావు, చల్లా నారాయణ, మాజీ సర్పంచ్‌లు చల్లా మోహన్ రావు, చింతనిప్పు నరసింహ రావు, సత్యం, చల్లా నారాయణ, చింతనిప్పు సూరయ్య, డీవైఎఫ్ఐ నాయకులు వేముల సాంబ, యాసా తిలక్, జగ్గారావు, ప్రభాకర్ రావు, కొనపర్తి విష్ణుమూర్తి తదితరులు పాల్గొన్నారు.



## విత్తన దుకాణాలు తనిఖీ

- నకిలీ విత్తనాలు అమ్మితే కఠిన చర్యలు : తాతారావు

**నవతెలంగాణ-ములకలపల్లి**

మండలంలోని చాపరాలపల్లి, ములకలపల్లి, జగన్నాధపురం, పూసుగూడెంలోని విత్తనాలు, పురుగుమందుల దుకాణాలను శుక్రవారం వ్యవసాయ శాఖ ఇంటర్నల్ స్క్వాడ్ మణుగూరు ఏడీఏ బి.తాతా రావు, స్థానిక ఏఓ కరుణామయి కలసి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విత్తనాల దుకాణాల యజమానులు స్టాక్ బోర్డ్ ఏర్పాటు చేయాలని, కొనుగోలు, అమ్మకానికి సంబంధించిన వివరాలను ఎప్పటికప్పుడు రికార్డులలో నమోదు చేయాలని సూచించారు. కొనుగోలు చేసిన ప్రతీ రైతుకు రసీదు తప్పనిసరిగా ఇవ్వాలన్నారు. రైతులు పంట మార్పిడి విధానాన్ని అవలంబిస్తే అధికదిగుబడులు తోపాటు భూమి కూడా సారవంతంగా అవుతుందన్నారు. జీలుగులకు బదులుగా, పెసర, వంటి పప్పు ధాన్యాలను వాడితే రైతుల ఆర్థికాభివృద్ధి తోపాటు, భూమి సైతం సారవంతం అవుతుందన్నారు. సేంద్రీయ ఎరువులు వాడడం వల్ల ఖర్చు తగ్గడంతో పాటు దిగుబడి పెరుగుతుందని, సేంద్రియ వ్యవసాయానికి ప్రతి రైతు ఓ ఆవును పెంచుకోవాలని కోరారు.

## గ్రామాలలో బడిబాటను నిర్వహించాలి

- ఎంపీడీఓ ఎస్.శ్రీధర్ స్వామి

**నవతెలంగాణ-ముదిగొండ**

మండలంలోని వివిధ గ్రామాల పాఠశాలల పరిధిలో బడిబాట కార్యక్రమాలు నిర్వహించాలని మండల పరిషత్ అభివృద్ధి అధికారి ఎస్.శ్రీధర్ స్వామి అన్నారు. ముదిగొండ మండల పరిషత్ కార్యాలయంలో ఉపాధ్యాయులతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యాశాఖ ఆదేశాలనుసారం బడిబాటను నిర్వహించి, బడి, ఈడు పిల్లలను బడిలో చేర్పించేందుకు కృషి చేయాలన్నారు. బడిబాట కార్యక్రమాన్ని నూరు శాతం విజయవంతం చేయాలన్నారు. తొలిత ముదిగొండ హైస్కూల్, ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు నిర్వహించిన బడిబాట కార్యక్రమంలో పాల్గొని ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం ఐకేపీ కార్యాలయాన్ని సందర్శించి స్కూల్స్ యూనిఫామ్ తయారీని పరిశీలించారు. ఈ సమావేశంలో ఎంఈఓ బాణాల వెంకట రామాచారి, ఐకేపీ ఏపీఎం సిహెచ్ కల్పన, ఐసీడీఎస్ సూపర్వైజర్లు, ఐకెపి సీసీలు, ప్రభుత్వ వసతి గృహాల సంక్షేమ, పంచాయతీల ప్రత్యేక అధికారులు పాల్గొన్నారు.





## విద్యుత్ షాక్ తో గేదె, మూడు ఆవులు మృతి

**నవతెలంగాణ-తిరుమలాయపాలెం**

గాలి దుమారానికి విద్యుత్ వైర్ తెగి కింద పడటంతో మేత కోసం వెళ్లిన ఒక గేదె, మూడు ఆవులు మృతి చెందిన సంఘటన శుక్రవారం చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. మండల పరిధిలోని జల్లేపల్లి గ్రామానికి చెందిన మేకల యాలాద్రికి చెందిన గేదె, రేఖ రామారావు, తురక వెంకన్న, బానోత్ హరి సింగ్‌లకు చెందిన మూడు ఆవులు గ్రామ శివారులో మేతకు వెళ్ళగా గత రాత్రి భారీగా వీచిన గాలులకు విద్యుత్ స్తంభం వైరు తెగి కింద పడటంతో విద్యుత్ వైర్ తగిలి పశువులు అక్కడికక్కడే మృతి చెందాయి. వీటి విలువ సుమారు రెండున్నర లక్షల రూపాయలు విలువ ఉంటుందని బాధితులు తెలిపారు.

మండల కాంగ్రెస్ నాయకులు పోట్ల కిరణ్ సంఘటన స్థలాన్ని సందర్శించి నష్టపోయిన బాధితులకు రాష్ట్ర రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి దృష్టికి తీసుకువెళ్లి ప్రభుత్వపరంగా ఆర్థిక సాయం అందించే విధంగా కృషి చేయనున్నట్లు మండల కాంగ్రెస్ నాయకులు పోట్ల కిరణ్ తెలిపారు.

## వంకర వాగును ఫీల్డ్ విజిట్ చేసిన సర్వేయర్

**నవతెలంగాణ-కల్లూరు**



కల్లూరు పెద్ద చెరువుకి వర్షపు నీరు వచ్చే వంకర వాగు ఆక్రమణకు గురైనట్టు ప్రచారం జరగడంతో జిల్లా అధికారులు ఆదేశాలతో తహసీల్దార్ పులి సాంబశివుడు ఆదేశాలతో మండల సర్వేయర్ అశోక్ ఆధ్వర్యంలో శుక్రవారం ఫీల్డ్ విజిట్ చేశారు. వంకరవాగు విస్తరణ ఎంత ఉంది అనే విషయం ఫీల్డ్ విజిట్ జరిగింది. బత్తులపల్లి గ్రామం బౌండరీ నుండి పెద్ద చెరువు వరకు ఫీల్డ్ విజిట్ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ సర్వేయర్లు బొగ్గుల ప్రసాద్ రెడ్డి, సురేష్ పాల్గొన్నారు.

## న్యూ లిటిల్ ఫ్లవర్ కళాశాలలో అవగాహన సదస్సు

**నవతెలంగాణ-వైరాటౌన్**



ఈఏపీ సెట్ వెబ్ కౌన్సెలింగ్‌కు సంబంధించి న్యూ లిటిల్ ఫ్లవర్ కళాశాలలో ఖమ్మం జిల్లా ఈఏపీ సెట్ కౌన్సెలింగ్ కన్వీనర్ సుబ్రహ్మణ్యం, కరస్పాండెంట్ డా.పి.భూమేష్ రావు, డైరెక్టర్ సుమన్ విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఖమ్మం జిల్లా ఈఏపీ సెట్ కౌన్సెలింగ్ కన్వీనర్ సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ, వెబ్ ఆప్షన్స్ ను ఎలా ఎంచుకోవాలి, ఏ ఏ కాలేజీలు, ఏ ఏ కోర్సులు ఆఫర్ చేస్తున్నాయి, ఎటువంటి కోర్సులకు భవిష్యత్తు ఉంటుంది, వెబ్సైట్లో వచ్చిన ర్యాంకుల ఆధారంగా కట్ ఆఫ్ ఎంతవరకు ఉంటుందనే ముఖ్య విషయాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కరస్పాండెంట్ డా. పి. భూమేష్ రావు మాట్లాడుతూ వెబ్ ఆప్షన్స్ ను ఎంచుకోవడం కూడా చాలా ముఖ్యమని, ఎందరో విద్యార్థులు వెబ్ ఆప్షన్స్ ఎంచుకోవడంలో పొరపాటు వల్ల టాప్ కాలేజీలో సీటు పొందే అవకాశాన్ని కోల్పోతున్నారని అన్నారు. సుబ్రహ్మణ్యం ఎంత బిజీగా ఉన్నా విద్యార్థుల కోసం వచ్చి అవగాహన కల్పించినందుకు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ సుమన్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# ప్రజా పోరాటాలకు సీపీఐ(ఎం) సిద్ధం

- సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు

**నవతెలంగాణ-తిరుమలాయపాలెం**



రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలు అమలు చేయాలని, రైతు రుణాలు మాఫీని వెంటనే అమలుకు పూనుకోవాలని, పేద ప్రజలకు అర్హత కలిగిన వాళ్లకు ఇళ్ల స్థలాలు ఇచ్చి ఇంటి నిర్మాణానికి ఐదు లక్షలు ఇస్తామన్న వాగ్దానాన్ని వెంటనే అమలు చేయాలని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. శుక్రవారం మండల కేంద్రంలోని సీపీఐ(ఎం) విస్తృత స్థాయి సమావేశం తుళ్లూరు నాగేశ్వరరావు అధ్యక్షతన సమావేశం జరిగింది. ఈ సమావేశంలో నున్నా నాగేశ్వరరావు పాల్గొని మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఆరు నెలలు గడుస్తుందని, ఎన్నికల ముందు అర్హత కలిగిన వారందరికీ రేషన్ కార్డులు అందజేస్తామని పింఛన్లను నాలుగువేల రూపాయలకు ఇస్తామని వ్యవసాయ కూలీలకు సంవత్సరానికి 12,000 రూపాయలు ఇస్తామని చేసిన వాగ్దానాలు అమలు చేయాలని లేని పక్షంలో సీపీఐ(ఎం) ప్రజా పోరాటాలకు సిద్ధంగా ఉందని అన్నారు. కేంద్రంలో బీజేపీకి, మోడీకి ప్రజలు తగిన బుద్ధి చెప్పారని అన్నారు. భారత ప్రజలు, లౌకిక ప్రజాతంత్ర పక్షాన నిలబడ్డారని, దేశంలో మతోన్మాదానికి వ్యతిరేకంగా కార్పొరేట్, ప్రయివేటీకరణ విధానానికి వ్యతిరేకంగా సమీకృతం అవుతున్నారని అన్నారు. ఎన్నికల ముందు బీజేపీ తప్పుడు వాగ్దానాలు చేసిందని, 400 ఎంపీ స్థానాలు గెలుస్తామని పెద్ద ఎత్తున ప్రచారం చేసిన బీజేపీకి నేడు ప్రజలు 240 ఎంపీ సీట్లతో సరిపెట్టారని అన్నారు. ఈ జనరల్ బాడీ సమావేశంలో జిల్లా కార్యదర్శి వర్గ సభ్యురాలు బుగ్గ వీటి సరళ, పార్టీ జిల్లా కమిటీ సభ్యులు ఎర్ర శ్రీనివాసరావు, ఎస్కే బషీరుద్దీన్, మండల కార్యదర్శి కొమ్ము శ్రీను, మండల కార్యదర్శి వర్గ సభ్యులు అంగిరేకుల నరసయ్య, వర్షపొంగ వీరన్న, భీంగీ రమేష్, తంగేళ్ల రమేష్, వెంకటేష్, దొడ్డ లింగస్వామి, తంగెళ్ల రమేష్, కొమ్ము వెంకన్న, మద్దినేని శ్రీనివాస్, బొజ్జ ముత్తయ్య, కొత్తపల్లి వెంకన్న, సిద్దుల వెంకన్న, కొమ్ము నాగేశ్వరరావు, గుండ్ల మల్లఉపేందర్, బండారు సైదులు, పల్లి రమేష్, బాలస్వామి, దాసరి మహేందర్. బోడబట్ల సతీష్ తదితరులు పాల్గొన్నారు.

# ముందున్నది ముసళ్ల పండగే...!

## మోడీ ఏకచ్ఛత్రాధిపత్యానికి గండి

- నడ్డా వ్యాఖ్యలపై ఆర్‌ఎస్‌ఎస్ ఆగ్రహం
- పార్టీలో రగులుతున్న అసమ్మతి చిచ్చు
- మిత్రులను మెప్పించకుంటే ముప్పే



**న్యూఢిల్లీ :** దేశభక్తి ముసుగులో దశాబ్దం పాటు బీజేపీ సాగించిన ఆధిపత్యానికి ఎట్టకేలకు అడ్డుకట్ట పడింది. లోక్‌సభ ఎన్నికల్లో సొంతంగా ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసేందుకు అవసరమైన మెజారిటీని చేరుకోలేకపోవడంతో మిత్రపక్షాలపై ఆధారపడాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఎన్నికల్లో తగిలిన ఎదురు దెబ్బల నుండి కోలుకోవడానికి ఆ పార్టీకి చాలా కాలమే పట్టేలా ఉంది. గత పది సంవత్సరాలుగా కమలదళంలో అంతా కేంద్రీకృత రాజకీయాలే నడిచాయి. మోడీ ఆడింది ఆట...పాడింది పాటలా సాగిపోయింది. సంస్థాగతంగా పార్టీ బలపడలేదు. పాత మూస పద్ధతిలోనే వ్యవహారాలు నడిచాయి.

బీజేపీ సంస్థాగతంగా ప్రధాని మోడీ, ఆయన ఇద్దరు ప్రధాన సన్నిహితులు అమిత్ షా, జేపీ నడ్డాల నియంత్రణలో ఉండిపోయింది. ఈ ఇద్దరిలో కూడా అమిత్ షా తరచుగా ప్రధానితో సంప్రదింపులు జరిపేవారు. వారిద్దరూ తీసుకున్న నిర్ణయాలను అమలు చేసేందుకే నడ్డా పరిమితమయ్యే వారు. బీజేపీ అధ్యక్షుడుగా నడ్డా పదవీకాలం జనవరితోనే ముగిసింది. లోక్‌సభ ఎన్నికలు రావడంతో ఆయన ఆ పదవిలోనే కొనసాగుతూ వచ్చారు. ఇప్పుడు నూతన అధ్యక్షుడిని బీజేపీ ఎన్నుకోవాల్సి ఉంటుంది.

### ఆయన ఇటు... ఈయన అటు

2019లో అమిత్ షాకు కేంద్ర మంత్రి పదవిని, నడ్డాకు పార్టీ అధ్యక్ష పదవిని మోడీ కట్టబెట్టారు. అంతకుముందు నడ్డా కేంద్ర క్యాబినెట్‌లో ఉండేవారు. అమిత్ షా పార్టీ అధ్యక్ష బాధ్యతలు నిర్వర్తించే వారు. 2019లో మోడీ రెండోసారి ప్రధాని పదవిని చేపట్టిన తర్వాత వీరిద్దరి పదవులు మారాయి. అప్పటి మాదిరిగా ఇప్పుడు బీజేపీకి చట్టసభలో మెజారిటీ లేదు. మిత్రపక్షాల దయాదాక్షిణ్యాలపై ఆధారపడి ప్రభుత్వాన్ని నడపాల్సి ఉంటుంది. గత దశాబ్ద కాలంలో కొనసాగిన కేంద్రీకృత రాజకీయాలను ఇప్పుడు మిత్రులు సహిస్తారా లేదా అనేది వేచి చూడాల్సిన విషయం.

### ప్రక్షాళన అనివార్యం

మోడీ ప్రభుత్వంలో అమిత్ షాకు లభించిన ప్రాధాన్యత అంతా ఇంతా కాదు. క్యాబినెట్‌లో ఆయనది రెండో స్థానం. ఇప్పుడు ఆ స్థానాన్ని మిత్రపక్షాలు అంగీకరించకపోవచ్చు. విధానపరమైన ప్రతి నిర్ణయం ప్రధాని కార్యాలయంలోనే జరగడానికి ఆ పార్టీలు ఒప్పుకోకపోవచ్చు. ఈ పరిస్థితుల్లో మోడీ ముందున్న తక్షణ కర్తవ్యం ప్రభుత్వాన్ని సుస్థిరపరచుకోవడం. ముందుగా మిత్రుల డిమాండ్లను తీరుస్తూ, ఆ తర్వాత తన అధికారాన్ని పెంచుకోవడానికి ఆయన ప్రయత్నించాల్సి ఉంటుంది. నడ్డా స్థానంలో పార్టీ అధ్యక్షుడిని నియమించుకోవడంతో పాటు సంస్థాగతంగా బీజేపీని పూర్తిగా ప్రక్షాళన చేయాల్సిన అవసరం ఉంది. ఎందుకంటే నూతన అధ్యక్షుడే తన బృందాన్ని ఎంపిక చేసుకోవాలి.

### అదంత ఈజీ కాదు

బీజేపీలోని త్రిమూర్తుల (మోడీ, షా, నడ్డా) మధ్య సంబంధాలు, వీరిలో కూడా నడ్డాకు పెద్దగా అధికారాలు లేకపోవడం వంటి అంశాలను పరిశీలిస్తే ఆయన తనకు తానుగా అలాంటి ప్రకటన చేసి ఉంటారని భావించలేము. ఈ ప్రకటన పార్టీ అత్యున్నత స్థాయిలో తీసుకున్న నిర్ణయం మేరకు వచ్చిందేనని పరిశీలకులు చెబుతున్నారు. ఏదేమైనా ఇలాంటి ప్రకటనలు మోడీని ముున్ముందు మరిన్ని ఇబ్బందుల్లో పడేసే అవకాశం ఉంది. ఆర్‌ఎస్‌ఎస్‌కు చెందిన పలువురు ప్రచారక్‌లను (పూర్తి స్థాయి కార్యకర్తలు) పార్టీ కోసం పనిచేసేందుకు పంపారు. ఈ నేపథ్యంలో బీజేపీ వ్యవహారాల్లో ఆర్‌ఎస్‌ఎస్ ప్రమేయాన్ని తక్కువగా అంచనా వేయలేము. ఎన్నికల ఫలితాలను చూస్తుంటే ఆర్‌ఎస్‌ఎస్ ప్రభావం నుండి బీజేపీ బయటపడడం అంత సులభంగా కన్పించదు.

### ఆర్‌ఎస్‌ఎస్ సహకారం లేకుంటే...

అమిత్ షా బీజేపీ అధ్యక్షుడు అయిన తర్వాత ఆ పార్టీలో ఎవరైనా చేరేందుకు వీలుగా 'మిస్డ్ కాల్' విధానాన్ని ప్రవేశపెట్టారు. బీజేపీ సభ్యత్వం పొందాలంటే పెద్దగా కష్టపడాల్సిన పని లేకుండా చేశారు. ప్రపంచంలో బీజేపీయే అతి పెద్ద పార్టీ అని, చైనా కమ్యూనిస్టు పార్టీ సభ్యత్వం కంటే బీజేపీ సభ్యులే అధిక సంఖ్యలో ఉన్నారని నాయకత్వం భావించింది. కానీ ఓ సిద్ధాంతానికి, కార్యక్రమానికి పార్టీ నాయకత్వం కట్టుబడలేదు. ఎన్నికల సమయంలో ఇంటింటికీ తిరిగి ప్రచారం చేసే కార్యకర్తలు ఆ పార్టీకి లేరు. ఆర్‌ఎస్‌ఎస్ స్వయంసేవకుల వ్యవస్థ తోడ్పాటు లేకుండా ఎన్నికల ప్రచారం నిర్వహించడం బీజేపీకి సాధ్యమయ్యే పనికాదు. నడ్డా ప్రకటన నేపథ్యంలో ఆర్‌ఎస్‌ఎస్ మద్దతు పొందడం ఇకపై బీజేపీకి అంత సులభం కాదు. నడ్డా ప్రకటనతో ఆర్‌ఎస్‌ఎస్ మాత్రమే కాదు...దాని అనుబంధ కార్మిక, రైతు, విద్యార్థి, ఉపాధ్యాయ సంఘాలు ఆగ్రహంతో ఉన్నాయి. బాహాటంగా నిరసన వ్యక్తం చేయకపోయినప్పటికీ లోలోన రగిలిపోతున్నాయి.

### బీజేపీ సెల్ఫ్ గోల్

అయితే బీజేపీ ఎదుర్కోబోయే అతి పెద్ద సవాలు ఆర్‌ఎస్‌ఎస్‌తో సంబంధాలు. ఎన్నికల ప్రచారం సందర్భంగా నడ్డా ఓ సమావేశంలో మాట్లాడుతూ పార్టీ కార్యకలాపాలలో...అవి ఎన్నికలు కావచ్చు లేదా ప్రచారం కావచ్చు... ఆర్‌ఎస్‌ఎస్ అవసరం లేదని స్పష్టం చేశారు. నడ్డా వ్యాఖ్యలతో బీజేపీ సెల్ఫ్ గోల్ చేసుకుంది. ఆయన వ్యాఖ్య కారణంగానే బీజేపీ మ్యాజిక్ ఫిగర్ 272ని చేరుకోలేకపోయిందన్న వాదన కూడా విన్పిస్తోంది.

### ఈ జాగ్రత్తలు తప్పవు

2001లో మోడీ తొలిసారిగా రాజ్యాంగ పదవిని చేపట్టారు. అప్పటి నుండి నిన్నటి వరకూ ఆయన గుజరాత్ ముఖ్యమంత్రి పదవిని చేపట్టినా, ప్రధాని పదవిని నిర్వహించినా పూర్తి మెజారిటీతోనే ఏకచ్ఛత్రాధిపత్యంగా పాలన సాగించారు. ఇప్పుడు తొలిసారిగా మెజారిటీకి దూరమయ్యారు. ఈ నేపథ్యంలో ప్రధాని తన పనితీరును మార్చుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఎన్డీఏ భాగస్వామ్య పక్షాలతో వ్యవహరించేటప్పుడు ఆచితూచి అడుగులు వేయాల్సి ఉంటుంది. ప్రభుత్వ నిర్ణయాల విషయంలో కూడా మిత్రులు, పార్టీ నేతలను ఎప్పటికప్పుడు సంప్రదించాల్సి ఉంటుంది. సొంత పార్టీ నేతలతోనూ, సంఘ్ పరివార్‌తోనూ జాగ్రత్తగా మసలు కోవాల్సి ఉంటుంది. నూతన భారతావనిని ఆవిష్కరించడం మాట అటుంచి, ముందుగా నూతన బీజేపీకి రూపకల్పన చేసే విషయంపై దృష్టి సారిస్తే మంచిది. లేకుంటే ముందున్నది ముసళ్ల పండగే అవుతుంది.

### పెల్లుబుకుతున్న అసమ్మతి

బీజేపీ నాయకత్వానికి పార్టీలోని పలువురు సీనియర్ నేతలు మద్దతు ఇస్తూ ఉండవచ్చు. కానీ అనేక రాష్ట్రాల్లో అసమ్మతి నివురుగప్పిన నిప్పులా ఉంది. అది ఏ క్షణంలో అయినా అగ్నిపర్వతం మాదిరిగా పేలి పోవచ్చు. ముఖ్యంగా సంవత్సరాల తరబడి బీజేపీ కోసం కష్ట పడుతూ విధేయులుగా ఉన్న వారికి కాకుండా ఇటీవలే పార్టీ తీర్థం పుచ్చుకున్న వలస వాదులకు టిక్కెట్లు ఇవ్వడంతో ఆగ్రహం పెల్లుబుకు తోంది. ఒకవేళ మోడీ ముున్ముందు కూడా ఫిరాయింపులను ప్రోత్సహిస్తే ఈ ఆగ్రహజ్వాలలు మరింతగా ప్రజ్వరిల్లే ప్రమాదం ఉంది. ఇదిలావుండగా ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్‌లో మోడీకి ఉన్న సంబంధాలు అంత సజావుగా లేవు. యోగి ప్రధాన్యత ఎక్కడ పెరుగుతుందోనన్న ఆందోళన మోడీలో కన్పిస్తోంది. అందుకే యోగిని ఎప్పటికప్పుడు నియంత్రించేందుకు ప్రయత్నించారు. నితిన్ గడ్కరీ వంటి పలువురు సీనియర్ నేతల విషయంలోనూ మోడీ ప్రవర్తన ఇలాగే ఉంది. తాజా ఎన్నికల్లో మోడీ ప్రాభవం మసకబారడంతో అసమ్మతి కార్యకలాపాలు ఊపందుకునే అవకాశం ఉంది. వీటిని పరిష్కరించ లేకపోతే మోడీ నాయకత్వానికే ఎసరు రావచ్చు.

---

# యూరోపియన్ పార్లమెంట్ ఎన్నికలు

- వామపక్ష శక్తుల హవా : ఎగ్జిట్ పోల్స్

**అమెస్టర్‌డామ్ :** యూరోపియన్ దేశాల నిర్ణయాలను ప్రభావితం చేసే యూరోపియన్ పార్లమెంట్ ఎన్నికలు ప్రపంచ వ్యాప్తంగా ఆసక్తి కలిగిస్తున్నాయి. ఈ నెల 6న ప్రారంభమైన ఎన్నికలు ఈ నెల 9 వరకూ జరగనున్నాయి. ఈసారి ఎన్నికల్లో వామపక్ష శక్తులు గణనీయమైన వృద్ధితో సీట్లు సాధించనున్నాయని వివిధ ఎగ్జిట్ పోల్స్ స్పష్టం చేశాయి. నెదర్లాండ్స్, ఐర్లాండ్, చెక్ రిపబ్లిక్ వంటి ఎనిమిది యూఈ దేశాల్లో నిర్వహించిన ఎగ్జిట్ పోల్స్ వామపక్ష శక్తుల హవాను ఖాయం చేస్తున్నాయి. పార్లమెంట్ ఎన్నికల్లో యూరోపియన్ పీపుల్స్ పార్టీ (ఈపీపీ) గ్రూపు స్పష్టమైన మెజారిటీని సాధిస్తుందని యురోన్యూస్ ఎగ్జిట్ పోల్ అంచనా వేసింది. సోషలిస్టులు రెండో శక్తిగా ఉంటారని, రెన్యూ యూరోప్ ఉదారవాదులు ఈసారి ఎక్కువ సంఖ్యలో స్థానాలు కోల్పోయినా మూడోస్థానంలో ఉంటారని అంచనా. వామపక్ష శక్తులు ఎక్కువ సంఖ్యలో స్థానాలు గెలుచుకున్నా కొత్తగా ఎన్నికైన పార్లమెంట్‌లో వీరి ఆధిపత్యం ఉండదని నిపుణులు చెబుతున్నారు.

యూరోపియన్ యూనియన్ పార్లమెంట్‌లో మొత్తం 720 మంది సభ్యులు (ఎంఈపీ) ఉంటారు. 27 దేశాల నుంచి వీరిని ఎన్నుకుంటారు. ప్రతీ ఐదేండ్లకు ఎన్నికలు నిర్వహిస్తుంటారు.

---

# మోడీని కులగణన చేపట్టాలని కోరుతా

- మాజీ ఎంపీ వి హనుమంతరావు

**నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్**

ఢిల్లీకి వెళ్లి మరోసారి ప్రధాని మోడీని కలిసి కులగణన చేపట్టాలంటూ డిమాండ్ చేస్తానని మాజీ ఎంపీ వి.హనుమంతరావు అన్నారు. మరోసారి మోడీకి ప్రజలు అవకాశం ఇచ్చారనీ, ఈ రకమైన ఓటర్ల తీర్పును గౌరవిస్తామన్నారు. శుక్రవారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో ఆయన విలేకర్లతో మాట్లాడారు. కేంద్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వస్తే కులగణన చేస్తామని ఏఐసీసీ అగ్రనేత రాహుల్ గాంధీ చెప్పారని గుర్తుచేశారు. రిజర్వేషన్‌లో 50 శాతం సీలింగ్ ఎత్తివేస్తామని హామీ ఇచ్చిన విషయాన్ని గుర్తుచేశారు. మోడీ బడుగు బలహీనర్గాల సమస్యలను ఇప్పటికైనా పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఎన్డీఏ కూటమిలో జేడీయూ అధినేత నితీష్ కుమార్, టీడీపీ అధ్యక్షులు చంద్రబాబు కీలక పాత్ర పోషించబోతున్నదని తెలిపారు. బీహార్‌లో నితీష్ కులగణన చేస్తే 67 శాతం రిజర్వేషన్లు బీసీలకు వచ్చిందన్నారు. ఈ అంశంపై రాహుల్ గాంధీ చేసిన ఆలోచనను మోడీ కొనసాగించాలని కోరారు. తెలంగాణలో కులగణన తర్వాత లోకల్ బాడీ ఎన్నికలు నిర్వహిస్తే...బీసీలకు మేలు జరుగుతుందనీ, ఈ విషయాన్ని సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్తానని తెలిపారు. కొంత ఆలస్యమైనా కులగణన తర్వాతే రాష్ట్రంలో ఎన్నికలు పెట్టాలని కోరారు.

---

# రాముడి పేరుతో వ్యాపారం

- దేశాన్ని మోసం చేశారు
- ప్రజలు దీన్ని అర్థం చేసుకున్నారు
- అయోధ్యలో గెలిచిన ఫైజాబాద్ ఎంపీ, ఎస్పీ నేత అవధేశ్ ఆరోపణలు



**లక్నో :** రాముడి పేరుతో బీజేపీ వ్యాపారం చేసిందనీ, అసత్యాలు ప్రచారం చేసి దేశాన్ని మోసం చేసిందని ఫైజాబాద్ నుంచి బీజేపీ అభ్యర్థిపై సంచలన విజయం సాధించిన దళిత నేత, సమాజ్‌వాద్ పార్టీ(ఎస్పీ) నాయకుడు అవధేశ్ ప్రసాద్ ఆరోపించారు. వాస్తవానికి రామ మందిర నిర్మాణం జరిగిన అయోధ్య ప్రాంతం.. ఫైజాబాద్ లోక్‌సభ నియోజకవర్గం కిందకు వస్తుంది. రామ మందిర నిర్మాణం పేరుతో ఫైజాబాద్‌తోనే కాకుండా దేశం మొత్తం హిందువుల ఓట్లను కొల్లగొట్టాలని బీజేపీ భావించింది. అయితే, బీజేపీకి ఫైజాబాద్‌లోనే ఎదురుదెబ్బ తగిలింది. ఇక్కడ నుంచి రెండు సార్లు ఎంపీగా విజయం సాధించిన బీజేపీ నాయకుడు లల్లూ సింగ్‌ను.. ఎస్పీ దళిత నాయకుడు అవధేశ్ ప్రసాద్ మట్టికరిపించారు. రామ మందిర ప్రాంతంలోనే ఈ ఓటమి బీజేపీకి మింగుపడటంలేదని రాజకీయ విశ్లేషకులు ఆరోపిస్తున్నారు.

కాగా, రిజర్వ్‌కాని సీటు నుంచి పోటీ చేసి, బీజేపీ ఇలాఖాలో ఆ పార్టీ అభ్యర్థిని ఓడించిన అవధేశ్ విజయం రాజకీయ వర్గాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. ఆయన విజయాన్ని స్థానిక ప్రజలతో పాటు దేశవ్యాప్తంగా ఉన్న దళిత నాయకులు, సామాజికవేత్తలు అభినందిస్తున్నారు. ఎస్పీ వ్యవస్థాపక సభ్యుడైన అవధేశ్.. తొమ్మిది సార్లు ఎమ్మెల్యేగా కూడా ఎన్నికయ్యారు. అయితే, బీజేపీపై అవధేశ్ మాత్రం సంచలన ఆరోపణలు చేస్తున్నారు. బీజేపీ రాముడి పేరుతో వ్యాపారం చేసిందని అన్నారు. 'హమ్ రామ్ కో లాయే హై (మేము రాముడిని తిరిగి తీసుకువచ్చాము)' అంటూ బీజేపీ దేశంలో అసత్యాలను ప్రచారం చేస్తున్నదని ఆగ్రహం వ్యక్తం చేశారు. "రాముడి పేరుతో దేశాన్ని మోసం చేశారు. రాముడి పేరుతో వ్యాపారం చేశారు. రాముడి పేరుతో ద్రవ్యోల్బణం పెరిగేలా చేశారు. రాముడి పేరుతో నిరుద్యోగాన్ని సృష్టించారు. రాముడి పేరుతో పేదలను, రైతులను ఏరివేసారు. రాముడి గౌరవాన్ని ధ్వంసం చేసేలా బీజేపీ పని చేసింది. ప్రజలు దీన్ని అర్థం చేసుకున్నారు" అని ఎస్పీ ఎంపీ అవధేశ్ ప్రసాద్ అన్నారు. " నాపై అందరికీ నమ్మకం ఉంది. కులం ప్రస్తావనకు రాలేదు. రాజ్యాంగాన్ని మార్చాలంటే బీజేపీకి 400 సీట్లు అవసరమని లల్లూ సింగ్ అన్నారు. అతను ఇలా అనకూడదు. ఆయన వ్యాఖ్యలకు ప్రజలు ఇష్టపడలేదు" అని తన గెలుపునకు గల కారణాన్ని అవధేశ్ చెప్పారు.

### రాజకీయ రంగంలోకి ఇలా..

న్యాయశాస్త్రంలో పట్టభద్రుడైన అవధేశ్ ప్రసాద్.. తన 21వ ఏట క్రియాశీల రాజకీయాల్లోకి వచ్చారు. అతను చరణ్ సింగ్‌కు చెందిన భారతీయ క్రాంతి దళ్‌లో చేరాడు. 1974లో అయోధ్య జిల్లాలోని సోహవాల్ నుంచి తన మొదటి అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసి ఓడిపోయాడు. ఎమర్జెన్సీ సమయంలో,ఆయన ఎమర్జెన్సీ వ్యతిరేక సంఘర్ష్ సమితికి ఫైజాబాద్ జిల్లా కో-కన్వీనర్‌గా పనిచేశాడు. ఆ సమయంలో ఆయన అరెస్టయ్యాడు. జైలులో ఉన్నప్పుడు ఆయన తల్లి మరణించింది. ఆమె అంత్యక్రియలకు హాజరు కావటానికి కూడా అతను పెరోల్ పొందలేకపోయాడు. " నేను మా అమ్మను (ఆమె చివరి క్షణాల్లో) చూడలేకపోయాను. ఎమర్జెన్సీ కాలంలో నేను జైలులో ఉన్నాను. ఆమె మృతదేహాన్ని ఐదు రోజులు ఉంచారు. కానీ అమ్మ చివరి దర్శనం చేసుకోలేకపోయాను. నేను జైల్లో ఉన్నప్పుడు మా అమ్మ నన్ను కలవటానికి వచ్చింది. ఆ సమయంలో ఆమె చాలా సంతోషంగా ఉంది" అని ఆయన భావోద్వేగానికి గురయ్యారు.

ఎమర్జెన్సీ తర్వాత, అవధేశ్ ప్రసాద్ పూర్తి స్థాయి రాజకీయ నాయకుడిగా మారటానికి న్యాయవృత్తిని విడిచిపెట్టాడు. 1981లో అప్పటి లోక్‌సభ ఉపఎన్నికల సమయంలో కాంగ్రెస్ అభ్యర్థి రాజీవ్ గాంధీపై పోటీ చేసిన లోక్‌దళ్ అభ్యర్థి శరద్ యాదవ్‌కు కౌంటింగ్ ఏజెంట్‌గా అమేథీలో ఉండటంతో అవధేశ్ ప్రసాద్ తన తండ్రి అంత్యక్రియలకు హాజరు కాలేదు. "చౌదరి చరణ్ సింగ్ నన్ను తన కారులో కూర్చోబెట్టి, 'అవధేష్ జీ, ఎన్నికలు ముగిసిన తర్వాతే మనం తిరిగి వెళ్లగలం' అని చెప్పాడు. నేను కౌంటింగ్ ఏజెంట్‌ని. మా నాన్న మరణవార్త తెలియగానే చివరిసారిగా ఆయనను చూడాలా లేక నా రాజకీయ గురువు చౌదరి చరణ్ సింగ్ మాట వినాలా అనే సందిగ్ధంలో పడ్డాను. నేను చరణ్ సింగ్ ఆదేశాలను అనుసరించి 14 రోజుల తర్వాత ఇంటికి వెళ్లాను"అని ఆయన గుర్తు చేసుకున్నాడు.

అవధేశ్ ప్రసాద్.. 1992లో ఎస్పీని ప్రారంభించినప్పుడు ములాయంసింగ్ యాదవ్ పక్షాన నిలిచారు. ఆ తర్వాత ఆయన పార్టీ జాతీయ కార్యదర్శిగా, కేంద్ర పార్లమెంటరీ బోర్డు సభ్యునిగా నియమితులయ్యారు. ఇప్పుడు ఎస్పీలో అతిపెద్ద దళిత నాయకుడిగా ఉన్నాడు. "ఇది(ఫైజాబాద్ ఎంపీగా) నా విజయం కాదు. ఇది అయోధ్యలోని గొప్ప వ్యక్తుల విజయం" అని అవధేష్ ప్రసాద్ చెప్పాడు.

---



# కాంగ్రెస్ సెంచరీ

- ఇండిపెండెంట్ 'మహా' ఎంపీ బేషరతు మద్దతు
- వందకు చేరిన హస్తం పార్టీ బలం
- సాంగ్లీ నుంచి స్వతంత్ర అభ్యర్థిగా ఎన్నికైన విశాల్ పాటిల్

**న్యూఢిల్లీ :** లోక్‌సభ ఎన్నికల్లో 99 స్థానాల వద్ద ఆగిపోయిన కాంగ్రెస్ ఇప్పుడు సెంచరీ మార్కును చేరింది. మహారాష్ట్రలోని సాంగ్లీ లోక్‌సభ నియోజకవర్గం నుంచి స్వతంత్ర అభ్యర్థిగా ఎంపీగా ఎన్నికైన విశాల్ పాటిల్ కాంగ్రెస్ పార్టీకి తన బేషరతు మద్దతును ప్రకటించారు. దీంతో 18వ లోక్‌సభలో కాంగ్రెస్ పార్టీ బలం పెరిగింది. కాంగ్రెస్‌కు ఇప్పుడు 100 మంది ఎంపీలు ఉన్నారు. లోక్‌సభ ఎన్నికల ప్రకటన తర్వాత, కాంగ్రెస్ సంప్రదాయక కంచుకోట అయిన సాంగ్లీ సీటు శివసేన (ఉద్ధవ్ బాలాసాహెబ్ థాక్రే)కి దక్కటంతో కాంగ్రెస్ కార్యకర్తలు కలత చెందారు. అయితే విశాల్ పాటిల్ స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసి విజయం సాధించారు. విశాల్ పాటిల్ మహావికాస్ అఘాడి(ఎంవీఏ), మహాయుతి(ఎన్డీఏ) రెండింటి అభ్యర్థులను ఓడించారు. రెండుసార్లు బీజేపీ ఎంపీగా ఎన్నికైన సంజయ్ పాటిల్ కంటే విశాల్ పాటిల్‌కు 1,00,053 ఓట్లు ఎక్కువ వచ్చాయి.

కాంగ్రెస్ పార్టీకి మద్దతు తెలుపుతూ పాటిల్ లేఖ అందిన తర్వాత కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే కృతజ్ఞతలు తెలిపారు. సామాజిక న్యాయం, సమానత్వం, స్వేచ్ఛ కోసం తమ జీవితాలను అంకితం చేసిన ఛత్రపతి శివాజీ మహారాజ్, మహాత్మా జ్యోతిబా పూలే, బాబాసాహెబ్ డాక్టర్ అంబేద్కర్ వంటి స్ఫూర్తిదాయక మహనీయులకు విశాల్ పాటిల్ నిర్ణయం సముచితమైన నివాళి అని ఖర్గే ప్రశంసలు గుప్పించారు.

### విశాల్ పాటిల్ ఎవరు?

విశాల్ పాటిల్ కుటుంబానికి కాంగ్రెస్, గాంధీ కుటుంబంతో సన్నిహిత సంబంధాలు ఉన్నాయి. మహారాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి దివంగత వసంతదాదా పాటిల్ మనవడు విశాల్ పాటిల్. విశాల్ దివంగత తండ్రి ప్రకాష్ బాపు పాటిల్ కూడా ఎంపీగా ఉండగా, ఆయన సోదరుడు ప్రతీక్ పాటిల్ యూపీఏ ప్రభుత్వ హయాంలో కాంగ్రెస్ రాష్ట్ర మంత్రిగా పనిచేశారు.

సాంగ్లీ లోక్‌సభ నియోజకవర్గం ఎప్పుడూ కాంగ్రెస్‌కు కంచుకోటే. అయితే 2014లో లోక్‌సభ ఎన్నికల్లో విశాల్ సోదరుడు ప్రతీక్ పాటిల్ కాంగ్రెస్ అభ్యర్థిగా ఓటమిని చవిచూడాల్సి వచ్చింది. 2019 లో, విశాల్.. రైతు నాయకుడు రాజు శెట్టి స్వాభిమాని షెట్కారీ పార్టీ నుంచి ఎన్నికలలో పోటీ చేశాడు. అయితే ఓట్ల చీలిక కారణంగా.. బీజేపీ అభ్యర్థి సంజయ్ పాటిల్ రెండోసారి ఇక్కడ నుంచి గెలిచారు.

### దళిత, ముస్లిం ఓట్లు నిర్ణయాత్మక అంశం

2019 లోక్‌సభ ఎన్నికలలో సాంగ్లీ లోక్‌సభ నియోజకవర్గంలో చీలిక ఏర్పడింది. వంచిత్ బహుజన్ అఘాడి(వీబీఏ) అభ్యర్థి 2.5 లక్షలకు పైగా ఓట్లు సాధించటంతో అది కాస్తా విశాల్ ఓటమికి దారితీసింది. అయితే, ఈ ఏడాది ఎన్నికల్లో వీబీఏ తన సొంత అభ్యర్థిని నిలబెట్టకుండా విశాల్‌కు మద్దతిచ్చింది. దీంతో దళిత, ముస్లిం ఓట్లు విశాల్‌కు కలిసొచ్చాయని రాజకీయ విశ్లేషకులు చెప్తున్నారు. మరోవైపు, మహాయుతి అభ్యర్థి సంజయ్ పాటిల్ కోసం యూపీ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్, కేంద్ర హెూంమంత్రి అమిత్ షా ర్యాలీలు నిర్వహించారు. ఈ సమావేశాల్లో అభివృద్ధి పనుల కంటే హిందుత్వ, హిందూ-ముస్లిం అంశాలకు ఎక్కువ ప్రాధాన్యత నిచ్చారు. ప్రజల మధ్య విభేదాలు రెచ్చగొట్టి మతం ఆధారంగానే ఓట్లు సాధించాలనేది వారి ప్రచార ప్రసంగాల్లో కనిపించింది. అయితే, సాంగ్లీలోని ఓటర్లు మాత్రం హిందుత్వ కార్డును తిరస్కరించి విశాల్ పాటిల్‌ను తమ ఎంపీగా ఎన్నుకున్నారు. కాగా, రాష్ట్రవ్యాప్తంగానూ ఎన్డీఏకు చేదు ఫలితాలు రావటంతో ఆ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రిగా ఉన్న దేవేంద్ర ఫడ్నవీస్.. తన పదవికి సిద్ధమైన విషయం విదితమే.

---


# ఇండియాలో అన్ని కులాలకూ ప్రాతినిధ్యం

- ఓబీసీ, ఎస్సీ, ఎస్టీలకూ సముచిత స్థానం
- ఎన్డీఏ ఎంపీల్లో కానరాని ముస్లింలు, క్రైస్తవులు, సిక్కులు
- అగ్ర కులాలకే అధిక ప్రాధాన్యత

**న్యూఢిల్లీ :** సార్వత్రిక ఎన్నికల సమరంలో కులాలు ప్రధాన పాత్ర పోషించాయి. అటు అధికార ఎన్డీఏ, ఇటు ప్రతిపక్ష ఇండియా ఫోరం సామాజిక న్యాయాన్ని పరస్పర విరుద్ధమైన దృష్టితో చూశాయి. ఒకే మతం నీడన హిందూ కులాలను ఏకం చేసేందుకు బీజేపీ ప్రయత్నించింది. మరో వైపు సామాజిక న్యాయ సాధనకు కులం కీలకమైన సాధనమని ప్రతిపక్ష కూటమి భావించింది. మొత్తంమీద ఎన్డీఏతో పోలిస్తే ఇండియా బ్లాక్ లోనే వివిధ కులాలు, వర్గాలకు సముచిత ప్రాధాన్యత లభించినట్టు కన్పిస్తోంది. ఈ నేపథ్యంలో 2019, 2024 ఎన్నికల్లో దిగువసభలో వివిధ కులాలు, వర్గాలకు లభించిన ప్రాతినిధ్యాన్ని పరిశీలిస్తే...

### ఏ కులం వారు ఎందరు?

17వ లోక్‌సభ సభ్యుల్లో 28.5 శాతం మంది అగ్రకులాల వారు ఉండగా 18వ సభకు 25.8 శాతం మంది మాత్రమే ఎన్నికయ్యారు. కర్నాటకకు చెందిన ఒక్కళిగులు, తమిళనాడులోని వెల్లలాలు, హర్యానా, ఉత్తరప్రదేశ్ రాష్ట్రాల్లోని జాట్లు, బీహార్‌లోని కుర్మీలు, కొయిరీలు, మధ్యప్రదేశ్‌లోని లోధాలు, ఆంధ్రప్రదేశ్‌లోని కమ్మ రెడ్లు...ఇలా కొన్ని రాష్ట్రాలకు మాత్రమే పరిమితమైన కులాల వారు గత సభలో 14.4 శాతం మంది ఉంటే రాబోయే సభలో 13.6 శాతం మంది ఉంటారు. ఓబీసీల సంఖ్య 22.8 శాతం నుంచి 25.4 శాతానికి పెరిగింది. ఎస్సీల సంఖ్య 15.5 శాతం నుంచి 15.8 శాతానికి స్వల్పంగా పెరగ్గా ఎస్టీల సంఖ్య 10.1 శాతం వద్ద స్థిరంగా ఉంది. ముస్లింల సంఖ్య 5.0 శాతం నుంచి 4.4 శాతానికి తగ్గింది. క్రైస్తవుల సంఖ్య అప్పుడు, ఇప్పుడూ 1.3 శాతంగానే ఉంది. సిక్కుల సంఖ్య 2.0 శాతం నుంచి 2.4 శాతానికి పెరిగింది. గత లోక్‌సభలో బౌద్ధులు 0.2 శాతం మంది ఉంటే ఇప్పుడు ఒక్కరు కూడా లేరు. గుర్తించని కులాల వారు గత సభలో 0.2 శాతం మంది ఉంటే 18వ లోక్‌సభలో వారి సంఖ్య 1.1 శాతానికి పెరుగుతుంది.




### హిందీ రాష్ట్రాల్లో...

హిందీ రాష్ట్రాల్లో కులాలు, వర్గాల ప్రాతినిధ్యాన్ని పరిశీలిస్తే... అగ్ర కులాల వారి సంఖ్య 38.9 శాతం నుంచి 32.7 శాతానికి తగ్గిపోయింది. కొన్ని ప్రాంతాలకే పరిమితమైన కులాలకు చెందిన వారి సంఖ్య 6.2 శాతం నుంచి 6.6 శాతానికి పెరిగింది. ఓబీసీ సభ్యుల సంఖ్య కూడా 25.7 శాతం నుంచి 31.0 శాతానికి పెరిగింది. ఎస్సీల సంఖ్య 17.3 శాతం నుంచి 17.7 శాతానికి, ఎస్టీల సంఖ్య 8.0 శాతం నుంచి 8.4 శాతానికి పెరిగింది. హిందీ రాష్ట్రాల నుంచి ముస్లింల ప్రాతినిధ్యం మాత్రం 3.5 శాతం నుంచి 3.1 శాతానికి తగ్గిపోయింది.



### కూటముల వారీగా...

కులాలు, వర్గాల వారీగా ఎన్డీఏ, ఇండియా ఫోరం తరఫున లోక్‌సభకు ఎన్నికైన సభ్యుల వివరాలను పరిశీలిస్తే...ఎన్డీఏ ఎంపీల్లో అగ్రకులాల వారు 33.2 శాతం, ఇండియా బ్లాక్‌కి చెందిన వారు 12.4 శాతం మంది ఉన్నారు. కొన్ని రాష్ట్రాల్లో మాత్రమే కన్పించే కులాలకు సంబంధించిన సభ్యులు ఎన్డీఏ పక్షాన 15.7 శాతం మంది ఎన్నికైతే ఇండియా బ్లాక్ నుంచి 11.9 శాతం మంది గెలుపొందారు. ఎన్డీఏ ఎంపీల్లో ఓబీసీలు 26.2 శాతం మంది ఉంటే ఇండియా బ్లాక్ ఎంపీలు 30.7 శాతం మంది ఉన్నారు. ఎన్డీఏ ఎంపీల్లో ఎస్సీలు 13.3 శాతం, ఎస్టీలు 10.8 శాతం మంది ఉండగా ముస్లింలు, క్రైస్తవులు, సిక్కులకు ప్రాతినిధ్యం లేదు. అదే ఇండియా బ్లాక్‌లో ఎస్సీలు 17.8 శాతం, ఎస్టీలు 9.9 శాతం, ముస్లింలు 7.9 శాతం, క్రైస్తవులు 3.5 శాతం, సిక్కులు 5 శాతం ఉన్నారు.

పెండ్లి ఓ భద్రతగా సమాజంలో భావిస్తున్నాం. ఎందుకంటే అది అందరి ఆమోదం, భాగస్వాముల మధ్య స్థిరత్వం, హక్కు బాధ్యతలను ఏర్పరిచే ఓ చట్ట బద్ధమైన ఒప్పందం కాబట్టి. అయితే ఈ మధ్య కాలంలో కొందరు పెండ్లికన్నా లివ్-ఇన్-రిలేషన్‌షిప్‌కు ఆసక్తి చూపుతున్నారు. కానీ కొంత మంది యువత ఈ సహజీవనాన్ని కేవలం వారి క్షణికమైన కోర్కెలు తీర్చుకునేందుకు కూడా ఉపయోగించుకుంటారు. దాన్ని వల్ల అనేక ఇబ్బందులు ఎదురవుతున్నాయి. అలాంటి సమస్యతోనే గీత ఐద్వా అదాలత్‌కు వచ్చింది. ఇంతకీ ఆమె సమస్యకు పరిష్కారం దొరికిందో లేదో మీరే చదవండీ...



# ఇదీ బంధానికి బలమే..!

ఐద్వా అదాలత్
సెల్: 9490098024

గీతకు సుమారు 32 ఏండ్లు ఉంటాయి. మంచి ఉద్యోగం, ఉన్నతమైన కుటుంబం. ఇంట్లో వాళ్ల ఆమెకు పెండ్లి సంబంధాలు చూస్తుంటే ఆమె మాత్రం 'నాకు పెండ్లి చేసుకోవడం ఇష్టం లేదు కొన్ని రోజులు లివ్‌ఇన్ రిలేషన్‌షిప్‌లో ఉండి తర్వాత పెండ్లి చేసుకోవాలా? లేదా? అనేది నిర్ణయించుకుంటాను. ఈ విషయంలో నన్ను బలవంతం పెట్టొద్దు' అంటూ కుటుంబ సభ్యులతో గొడవ పెట్టుకుంది.

పెద్దలు పెండ్లి చేస్తాం అంటున్నా వినకుండా పదేండ్ల నుండి తను ప్రేమిస్తున్న అశ్విన్‌తో కలిసి జీవితం ప్రారంభించింది. వారు అలా ఉండటం ఇరు కుటుంబ సభ్యులకు ఏ మాత్రం ఇష్టం లేదు. చెప్తే వినేవాళ్ల కాదు. అందుకే చూస్తూ ఊరుకున్నారు. అయితే ఇద్దరూ సహజీవనం ప్రారంభించడానికి ముందు ఓ అగ్రిమెంట్ చేసుకున్నారు. ఏమిటంటే ఎవరు ఎప్పుడైనా రావొచ్చు, పోవచ్చు. ఎవరికి నచ్చినట్టుగా వారు ఉండొచ్చు, మాట్లాడొచ్చు. ఎవరు ఎవరినైనా ఇంటికి తెచ్చుకోవచ్చు. ఇంకొకరు నీవు ఎందుకు ఇలా చేస్తున్నావు? అని అడగటానికి వీల్లేదు. ఇద్దరిలో ఎవరికైనా వేరే వ్యక్తి నచ్చితే వారితో వెళ్ళిపోవచ్చు. ఇంకొకరి చెప్పాల్సిన అవసరం లేదు. ఇలా చాలా కండీషన్స్ రాసుకున్నారు.

పెద్దలు పెండ్లి చేస్తాం అంటున్నా వినకుండా పదేండ్ల నుండి తను ప్రేమిస్తున్న అశ్విన్‌తో కలిసి జీవితం ప్రారంభించింది. వారు అలా ఉండటం ఇరు కుటుంబ సభ్యులకు ఏ మాత్రం ఇష్టం లేదు. చెప్తే వినేవాళ్లు కాదు. అందుకే చూస్తూ ఊరుకున్నారు. అయితే ఇద్దరూ సహజీవనం ప్రారంభించడానికి ముందు ఓ అగ్రిమెంట్ చేసుకున్నారు.

ఇలా ఆరు నెలలు గడిచిపోయింది. అశ్విన్‌లో చాలా మార్పు వచ్చింది. తన స్నేహితులను తీసుకొచ్చి ఇంట్లోనే తాగేవాడు. అంతే కాదు వేరే అమ్మాయిలను కూడా ఇంటికి తీసుకురావడం మొదలుపెట్టాడు. గీత ఇదేంటని అడిగితే 'ఎవరికి నచ్చినట్టు వారు ఉండాలి అనుకున్నాం కదా! ఇప్పుడు ఎందుకు ప్రశ్నిస్తున్నావు, మన అగ్రిమెంట్ ప్రకారం నన్ను ప్రశ్నించే హక్కు నీకు లేదు. ఇదంతా నచ్చకపోతే నువ్వే ఇక్కడి నుండి వెళ్ళిపో' అనేవాడు. 'నువ్వు స్నేహితులను ఇంటికి తీసుకొస్తే నేను తీసుకురాలేనా' అంటూ గీత కూడా తన స్నేహితులను ఇంటికి పిలవడం మొదలుపెట్టింది. ఇలాగైనా అశ్విన్ తన మాట వింటాడనుకుంది. కానీ దీనికి పూర్తి విరుద్ధంగా జరిగింది. గీత స్నేహితురాలు రూప ఇప్పుడు అశ్విన్‌కు దగ్గరయింది. వాళ్ళిద్దరూ కలిసి వేరే ఇల్లు తీసుకొని ఉంటున్నారు. అయితే గీతకు ఇప్పుడు మూడో నెల. అశ్విన్ తనను వదిలి వెళ్ళిపోయాడు. ఇలాంటి పరిస్థితుల్లో తల్లిదండ్రుల వద్దకు ఎలా వెళ్ళాలో ఆమెకు అర్థం కావడం లేదు. ఏమీ తోచని స్థితిలో ఐద్వా లీగల్‌సెల్‌కు వచ్చింది.

మేము ఇరు కుటుంబ సభ్యులను పిలిపించి మాట్లాడాము. గీత తల్లిదండ్రులు 'మేము ఎంత చెప్పినా వినకుండా వెళ్ళింది. ఇప్పుడు మళ్ళీ మీ దగ్గరకు వచ్చింది. ఈ రోజుల్లోనూ చాలామంది ప్రేమ వివాహం అంటేనే ఒప్పుకోవడంలేదు. కానీ గీత ప్రేమను అంగీకరించి అశ్విన్‌తో పెండ్లి చేద్దాం అనుకున్నాం. కానీ వాళ్ల మాత్రం 'కొంతకాలం కలిసి ఉంటాం. ఆ తర్వాత ఇష్టముంటే పెండ్లి చేసుకుంటాం' అన్నారు. కలిసిన ఆరు నెలల్లోనే ఇలా జరిగింది. ఇప్పుడు కూడా వాళ్ళ ఇష్టం వచ్చినట్టే చేసుకోమనండి. మేము ఏం చెప్పినా దానికి వ్యతిరేకంగానే ఆలోచిస్తుంది గీత. సహాయం కోసం మీ దగ్గరకు వచ్చింది. మాకు మీ సంస్థపై నమ్మకం ఉంది. కాబట్టి మీరే తనకు దారి చూపించండి' అన్నారు.

అశ్విన్ తల్లిదండ్రులు 'మా వాడికి స్థిరత్వం లేదు. పదేండ్లుగా గీతను ప్రేమిస్తున్నాడు. కాబట్టి ఇద్దరూ ఒకరినొకరు అర్థం చేసుకొని హాయిగా ఉంటారు అనుకున్నాం. కొన్ని రోజులు కలిసున్న తర్వాత పెండ్లి చేసుకుంటారనే అనుకున్నాం. కానీ ఈ అగ్రిమెంట్లు ఏంటో? అసలు స్వేచ్ఛ అంటే ఏంటో వీళ్ళకు అర్థం కావడం లేదు. అందుకే ఆరు నెలల్లోనే ఈ పరిస్థితి వచ్చింది. అశ్విన్ గురించి గీతకు పూర్తిగా తెలుసు. ఈ ఆరు నెలల్లో ఇంకా బాగా తెలుసుకొని ఉంటుంది. కాబట్టి ఆమె ఏ నిర్ణయం తీసుకున్నా మాకు ఓకే. కలిసి ఉండాలా, విడిపోవాలా అనేది వారి ఇష్టం. ఆమె అశ్విన్‌ను పెండ్లి చేసుకొని ఇంటికి వస్తే మాత్రం బాగా చూసుకుంటాం' అన్నారు.

ఇక అశ్విన్‌తో మాట్లాడితే 'మేము ముందే అగ్రిమెంట్ రాసుకున్నాం. దాని ప్రకారమే నేను నాకు నచ్చినట్టు ఉంటున్నాను. మేము రిలేషన్‌లో ఉన్నప్పటి నుండి గీత ప్రతి దానికి నన్ను అడ్డుకుంటుంది. ఎక్కడికి వెళుతున్నావు, ఏం చేస్తున్నావు అంటూ ప్రతిదీ ఆరాలు తీస్తుంది. అయినా నేను ఇప్పుడు గీతతో ఉండడం లేదు. అమె స్నేహితురాలితో కలిసి ఉంటున్నాను. నేను ఇప్పుడు చాలా సంతోషంగా ఉన్నాను. నన్ను ఇలా వదిలేయండి, ఇబ్బంది పెట్టకండి' అన్నాడు.

మేము ముందే అగ్రిమెంట్ రాసుకున్నాం. దాని ప్రకారమే నేను నాకు నచ్చినట్టు ఉంటున్నాను. మేము రిలేషన్‌లో ఉన్నప్పటి నుండి గీత ప్రతి దానికి నన్ను అడ్డుకుంటుంది. ఎక్కడికి వెళుతున్నావు, ఏం చేస్తున్నావు అంటూ ప్రతిదీ ఆరాలు తీస్తుంది. అయినా నేను ఇప్పుడు గీతతో ఉండడం లేదు. అమె స్నేహితురాలితో కలిసి ఉంటున్నాను. నేను ఇప్పుడు చాలా సంతోషంగా ఉన్నాను. నన్ను ఇలా వదిలేయండి, ఇబ్బంది పెట్టకండి.

మరి అగ్రిమెంట్‌లో పిల్లల గురించి ఏమీ రాసుకోలేదేంటి. తిరగడం, తాగడం, శారీరక సంబంధాలు పెట్టుకోవడం ఇలాంటి విషయాలైతే చక్కగా రాసుకున్నారు. కానీ గీత నిన్ను నిజంగా ప్రేమిస్తుంది. అందుకే నీతో తల్లి కావడానికి సిద్ధపడింది. నీతో జీవితాంతం ఉండాలను కుంటుంది. కాబట్టే నువ్వు ఇంకొకరితో మాట్లాడు తుంటే భరించలేకపోతుంది. ఇప్పుడు నీకు నీ బేబీ కోసం ఆలోచించాల్సిన అవసరం ఉందా లేదా?' అని అడిగాము.

'పెండ్లి, బాధ్యత అంటే నేను భరించలేను. అందుకే లివింగ్ రిలేషన్‌షిప్‌కు ఓకే అన్నాను. ఆ బాధ్యతలను తట్టుకోలేకే ఇప్పుడు రూపతో ఉంటున్నా. ఆమెను ఎలా వదిలి పెట్టి రావాలి. నాకు ఆలోచించుకోడానికి కాస్త సమయం కావాలి' అన్నాడు. ఇద్దరూ కలిసి మా దగ్గరకు ఐదారు వారాలు వచ్చారు. కొన్ని రోజులు కౌన్సెలింగ్ తర్వాత అశ్విన్, గీతను పెండ్లి చేసుకోడానికి ఒప్పుకున్నాడు. రూపకు వేరే అబ్బాయితో పెండ్లి కుదిరింది.

సహజీవనం అనేది ఇద్దరూ అర్థం చేసుకోడానికి ఉపయోగపడుతుంది. ఇలాంటి సంబంధాలు కూడా బంధాలకు బలాన్నిస్తాయి. ఎలాంటి పరిస్థితుల్లోనైనా కలిసి జీవించాలి అనే ధైర్యాన్నిస్తాయి. అంతే కాని నీ కోర్కెలు తీర్చుకోడం కోసం సహజీవనాన్ని వాడుకుంటే నడవదు. ఏ రిలేషన్‌లోనైనా బాధ్యలు కచ్చితంగా ఉంటాయి. ఇప్పుడు మీరు తల్లిదండ్రులు కాబోతున్నారు. బాధ్యతలు మరింత పెరుగుతాయి. ఇవే మీ జీవితాన్ని తీర్చిదిద్దుతాయి. బాధ్యతలను ఎప్పుడూ భారంగా అనుకోకూడదు. తాత్కాలిక సంతోషానికి అలవాటు పడితే రేపు నీకంటూ ఎవ్వరూ మిగలరు. కుటుంబం, బంధాలు, ఆప్యాయతలు, అనురాగాలు ఉన్నప్పుడే జీవితం సంతోషంగా ఉంటుంది అని అశ్విన్‌కు నచ్చజెప్పి ఇద్దరికీ పెండ్లి చేశాము.

- వై వరలక్ష్మి, 9948794051

## షుగర్ అదుపులో ఉండాలంటే..

మధుమేహం నయం చేయలేని వ్యాధి, ఆహారం సహాయంతో మాత్రమే దీనిని నియంత్రించవచ్చు. రోజంతా తినడం, తాగడం వల్ల మీ బ్లడ్ షుగర్ కూడా హెచ్చుతగ్గులకు గురవుతుంది. అందువల్ల, డయాబెటిక్ పేషెంట్ తన ఆహారం విషయంలో జాగ్రత్తగా ఉండాలి. ఆరోగ్యకరమైన అల్పాహారంతో రోజును ప్రారంభించడం



చాలా ముఖ్యం. అది మీ రక్తంలో చక్కెరను కూడా నియంత్రణలో ఉంచుతుంది. బ్రేక్‌ఫాస్ట్‌కు సంబంధించి కొన్ని వెరైటీలు...

**మునగ పరాటా:** మునగ ఆకులలో ప్రొటీన్లు, కార్బోహైడ్రేట్లు, పొటాషియం, కాల్షియం, ఐరన్, మెగ్నీషియం, విటమిన్ ఎ, సి, బి కాంప్లెక్స్ పుష్కలంగా ఉంటాయి. అదే సమయంలో, మునగ ఆకుల సారం హాని కలిగించే పలు ఎంజైమ్‌లను నిరోధించడంలో సహాయ పడుతుంది. ఐసోథియోసైనేట్స్ అనే రసాయన సమ్మేళనం మునగ ఆకులలో ఉంటుంది, ఇది మధుమేహాన్ని నియంత్రించడంలో సహాయపడుతుంది. దీనితో పాటు, దాని ఆకులలో కనిపించే క్లోరోజెనిక్ ఆమ్లం కూడా శరీరంలో చక్కెరను మెరుగైన రీతిలో ప్రాసెస్ చేయడంలో సహాయపడుతుంది , ఇన్సులిన్‌ను కూడా ప్రభావితం చేస్తుంది. అటువంటి పరిస్థితిలో ఉదయాన్నే మునగ ఆకులతో తయారుచేసిన పరాటా మధుమేహ వ్యాధిగ్రస్తులకు ప్రాణదాత.

**పోహా:** పోహాలో ప్రొటీన్లు, కార్బోహైడ్రేట్లు, ఫైబర్, విటమిన్లు, ఐరన్ , యాంటీ ఆక్సిడెంట్లు పుష్కలంగా ఉన్నాయి, ఇది మీకు అనేక ఆరోగ్య ప్రయోజనాలను అందిస్తుంది. ఇందులో చాలా కూరగాయలు కలుపుకుని తినవచ్చు. పోహా గ్లైసెమిక్ ఇండెక్స్ కూడా తక్కువగా ఉంటుంది, దీనితో పాటు ఇందులో ఉండే ఫైబర్ , ప్రోటీన్ కూడా మీకు ప్రయోజనకరంగా ఉంటాయి.

**ఓట్స్ :** వోట్స్‌లో ఉండే బీటా గ్లూకాన్ రక్తంలో చక్కెరను పెంచుతుంది. ముఖ్యంగా అధిక బరువు ఉన్నవారిలో, ఇది ఇన్సులిన్ సెన్సిటివిటీని పెంచుతుంది, దీని కారణంగా రక్తంలో అదనపు గ్లూకోజ్ పేరుకుపోదు. అంటే సాధారణంగా కనిపించే ఈ అల్పాహారం మధుమేహం వంటి తీవ్రమైన పరిస్థితులను ప్రభావితం చేస్తుంది.

**నానబెట్టిన గింజలు:** ఇవన్నీ కాకుండా, మీరు అల్పాహారంలో నానబెట్టిన పిస్తా, బాదం, వాల్‌నట్ , వేరుశెనగలను కూడా చేర్చవచ్చు. వీటిని ఆహారంలో చేర్చుకోవడం వల్ల బ్లడ్ షుగర్ అదుపులో ఉంటుంది, అనేక ఇతర మార్గాల్లో ఆరోగ్య ప్రయోజనాలను కూడా అందిస్తుంది. ■

## మోడీ ఏకగ్రీవం

(మొదటిపేజీ తరువాయి)

సుగమమైంది. దీనితో పాటు మోడీని కూటమి అధినేతగా ప్రతిపాదిస్తూ బీజేపీ అధ్యక్షుడు జె.పి నడ్డా చేసే తీర్మానాన్ని ఆమోదించటం కోసం ఎన్డీఏ ఎంపీలతో పాటు కూటమిలోని ముఖ్యమంత్రులు, సీనియర్ నాయకులు హాజరయ్యారు. కాగా, కూటమి నేతగా తనను ఎన్నుకోవటంతో మద్దతిస్తున్న ఎంపీల జాబితాను మోడీ.. భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్మును కలిసి సమర్పించారు. కూటమి నేతలతో కలిసి శుక్రవారం సాయంత్రం రాష్ట్రపతి భవన్‌కు వెళ్లిన ఆయన.. ద్రౌపది ముర్ముతో సమావేశమయ్యారు. తదుపరి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసేందుకు అవకాశం ఇవ్వాలని కోరారు. అనంతరం, మోడీ మీడియాతో మాట్లాడారు.

## పరువు నష్టం కేసులో రాహుల్‌కు ఊరట

(మొదటిపేజీ తరువాయి)

ప్రచురించిందని ఆరోపిస్తూ బీజేపీ కర్నాటక విభాగం కేసు వేసింది. ఈ కేసులో భాగంగా శుక్రవారం రాహుల్ కోర్టుకు హాజరయ్యారు. 2019-2023 కాలంలో బీజేపీ ప్రభుత్వం అభివృద్ధి పనుల్లో 40 శాతం కమీషన్ వసూలు చేసినట్టు "40 శాతం కమీషన్ ప్రభుత్వం"గా అభివర్ణిస్తూ కాంగ్రెస్ పార్టీ ప్రకటనలు చేసిందని పేర్కొంటూ కమలం పార్టీ నేత కేశవప్రసాద్ జూన్ 2023లో పరువు నష్టం దావా వేశారు. వివిధ రకాల ఉద్యోగాలకు బీజేపీ 'రేటు కార్డులు' పెట్టిందంటూ హస్తం పార్టీ పోస్టర్లు అతికించిందని, దీని వల్ల కమలం పార్టీయ పరువుకు భంగం కలిగిందని ఆయన పిటిషన్‌లో పేర్కొన్నారు. ఈ అంశంపై గతంలో విచారణ చేసిన బెంగుళూరు కోర్టు కర్నాటక ముఖ్యమంత్రి, అప్పటి ప్రతిపక్ష నాయకుడు సిద్ధరామయ్య, ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్‌లకు జూన్ 1న బెయిల్ మంజూరు చేసింది. వారితో పాటు నిందితుడిగా ఉన్న రాహుల్‌గాంధీ జూన్ 7న కోర్టులో హాజరు కావాలని ఆదేశించిన సంగతి తెలిసిందే. కోర్టు ఆదేశాల్లో భాగంగా శుక్రవారం కోర్టు ఎదుట హాజరయ్యారు.మరో కేసులో.. కేంద్ర హోం మంత్రి అమిత్ షాపై రాహుల్ గాంధీ చేసిన వ్యాఖ్యలపై 2018లో వేసిన పరువు నష్టం కేసును ప్రయాగ్‌రాజ్‌లోని ఎంపీ/ఎమ్మెల్యే కోర్టు శుక్రవారం వాయిదా వేసింది. దీని విచారణ జూన్ 18న చేయనున్నారు. 2005లో జరిగిన నకిలీ ఎన్‌కౌంటర్ కేసులో సీబీఐ స్పెషల్ కోర్టు షాను 2014లో విడుదల చేసింది.

## ఆదాయం పెంచే మార్గాలు అన్వేషించండి

(మొదటిపేజీ తరువాయి)

బోర్డ్, రాజీవ్ స్వగృహ పథకాల ద్వారా నిర్మించిన ఇండ్లు, వచ్చిన ఆదాయ వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఇప్పటికీ విక్రయించని ఇండ్లు, ఇండ్ల స్థలాల పరిస్థితిని సమీక్షించారు. ఆరోగ్యశ్రీ బకాయిలను నెలవారి చెల్లించే పద్ధతిని ఆచరణలో పెడతామన్నారు. ప్రభుత్వ ఆస్పత్రిలో అమలు చేస్తున్న ప్యాకేజీల ధరలకే ప్రయివేటు ఆస్పత్రుల్లో చికిత్సలు అందించేలా వారిని ఒప్పించాలని, ఈ పథకం సామాజిక బాధ్యతలో భాగమని వివరిస్తూ, వారితో చర్చలు జరపాలని చెప్పారు. సమావేశంలో స్పెషల్ చీఫ్ సెక్రటరీ రామకృష్ణారావు, కమర్షియల్ టాక్స్ కమిషనర్ శ్రీదేవి, రవాణా శాఖ కమిషనర్ బుద్ధ ప్రసాద్, ఆర్థిక శాఖ జాయింట్ సెక్రెటరీ హరిత, డిప్యూటీ సీఎం స్పెషల్ సెక్రటరీ కృష్ణ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

## హస్తినలో సీఎం..

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

శనివారం ఢిల్లీలో నిర్వహించబోయే కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ (సీడబ్ల్యూసీ) సమావేశంలో పాల్గొనేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బయల్దేరి వెళ్లారు. పార్లమెంటు ఎన్నికల ఫలితాలు, ఈఏడాది వివిధ రాష్ట్రాల్లో జరగనున్న అసెంబ్లీ ఎన్నికలు, రాష్ట్రాల కాంగ్రెస్ అధ్యక్షుల మార్పు తదితరాంశాలపై ఈ సమావేశంలో చర్చించనున్నారు. ఈ భేటీకి రేవంత్‌తోపాటు వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ, మహబూబ్‌నగర్ కాంగ్రెస్ అభ్యర్థి చల్లా వంశీచంద్‌రెడ్డి కూడా హాజరుకానున్నారు. మరోవైపు ఏఐసీసీ అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే శనివారం సాయంత్రం ఢిల్లీలో కొత్తగా ఎన్నికైన కాంగ్రెస్ ఎంపీలకు డిన్నర్ ఇవ్వనున్నారు. రాష్ట్రం నుంచి కొత్తగా ఎంపికైన కాంగ్రెస్ ఎంపీలకు ఈమేరకు ఏఐసీసీ నుంచి ఆహ్వానం అందింది. శనివారం మధ్యాహ్నం తర్వాత సీడబ్ల్యూసీ సమావేశం కానుంది. సమావేశంలో సీఎం రేవంత్ రాష్ట్ర రాజకీయ పరిస్థితులపై నివేదిక సమర్పించనున్నారు. పార్టీ గెలుపోటములపై ఈ సందర్భంగా విశ్లేషించనున్నట్టు సమాచారం.

## పాఠాలు నేర్పిన ఫలితాలు

(మొదటిపేజీ తరువాయి)

అధికార కేంద్రాలు ఏర్పడకుండా నరేంద్ర మోడీ అన్ని జాగ్రత్తలు తీసుకున్నారు. విధేయత చూపని అభ్యర్థుల ఓటమికి చేయాల్సిందంతా చేశారు. అయితే వీరిలో చాలా మంది గెలుపొందడంతో రాబోయే ఐదు సంవత్సరాల్లో పార్టీలో అంతర్గతంగా తిరుగుబాటు చోటుచేసుకునే అవకాశం ఉంది.

**ప్రతికూల పరిస్థితులు తప్పవు**

ఇక్కడ గమనించాల్సిన ముఖ్యమైన విషయం ఒకటుంది. గతంలో దూరమైన పార్టీలే ఇప్పుడు బీజేపీకి చేరువయ్యాయి. ఆయా పార్టీలతో సంబంధాలు కొనసాగించడం మోడీకి అసౌకర్యంగానే ఉంటుంది. పైగా గతంలో తమకు ఎదురైన చేదు అనుభవాలను తెలుగుదేశం, జేడీయూ వంటి పార్టీలు ఎన్నటికీ మరచిపోలేవు. ఇప్పుడు తమకు అవకాశం రావడంతో ఆయా పార్టీలు తమ డిమాండ్ల చిట్టాను మోడీ ముందు ఉంచి వాటిని నెరవేర్చాల్సిందిగా ఒత్తిడి తెచ్చే అవకాశం ఉంది. పులి మీద పుట్రలా కొన్ని మత సంస్థలు కూడా ఇప్పుడు ధిక్కార స్వరాన్ని విన్పిస్తున్నాయి. అయోధ్య ట్రస్ట్ తమను పట్టించుకోలేదని, కించపరిచాయని ఆ సంస్థలు గుర్రుగా ఉన్నాయి. ఈ పరిస్థితుల్లో మోడీ మూడోసారి అధికారంలోకి వచ్చినప్పటికీ గత వైభవాన్ని, ప్రాభవాన్ని కనబరచడం అసాధ్యం. ఆయన తీవ్రమైన ప్రతికూల పరిస్థితులను ఎదుర్కోవాల్సి ఉంటుంది.

**దూకుడు తప్పదు**

బీజేపీలోని ఈ పరిణామాలను ప్రతిపక్షాలు తమకు అనుకూలంగా మలచుకోవాల్సి ఉంటుంది. గత ఐదు సంవత్సరాలుగా కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ఏ విధంగా అయితే దూకుడుగా వ్యవహరించి బీజేపీ సైద్ధాంతిక అజెండాను ఎండగట్టారో ప్రతిపక్ష కూటమిలోని ఇతర పార్టీల నేతలు కూడా ఇకపై అదే విధమైన వైఖరిని ప్రదర్శించాలి. తనపై బీజేపీ నాయకత్వం ఎంతగా ద్వేషపూరిత ప్రచారం చేసినప్పటికీ రాహుల్ చెక్కుచెదరక మొక్కవోని ధైర్యంతో ముందుకు నడిచారు. ప్రభుత్వ సామాజిక, ఆర్థిక విధానాలను తూర్పార పట్టారు. ఎన్నికల బాండ్ల పథకంలో చోటుచేసుకున్న కుంభకోణాన్ని ప్రజలకు వివరించడంలో సఫలీకృతులయ్యారు.

**ఇది తొలి అడుగే**

ఇటీవలి కాలంలో పలు ప్రగతిశీల శక్తులు భారత రాజ్యాంగాన్ని పరిరక్షించేందుకు తమ వంతు కృషి చేశాయి. సినీ నిర్మాతలు, రచయితలు, కవులు, వివిధ సంఘాలు, వ్యాపారులు, యూట్యూబర్లు ఈ మహాయజ్ఞంలో భాగస్వాములయ్యారు. ఆనాడు ఏ కారణం చేతనో బయటికి రాలేని శక్తులు ఇప్పుడు ఎన్నికల ఫలితాలు వెలువడిన తర్వాత ఇండియా కూటమికి బాసటగా నిలిచేందుకు ముందుకొచ్చాయి. పార్లమెంట్ లేదా రాష్ట్రాల చట్టసభల వద్ద నిరసనలు, బహిరంగ లేఖలు, పిటిషన్లు, సామాజిక మాధ్యమాల ద్వారా ప్రచారాలు, పత్రికా సమావేశాలు, ఉపన్యాసాలు...ఇలా వివిధ రూపాల్లో గత పది సంవత్సరాలుగా ప్రజలు ప్రభుత్వంపై తమ అసమ్మతిని వ్యక్తం చేస్తూనే ఉన్నారు. ఐదు సంవత్సరాలుగా వ్యూహాత్మకంగా సాగిన ఉద్యమ కార్యాచరణ బీజేపీని ఎన్నికల్లో ఓడించడమే కాకుండా సైద్ధాంతికంగా కూడా ఆ పార్టీని దెబ్బతీసింది. ఇదే అసలైన పోరాటం. ఎన్నికల్లో గెలుపు అనేది తొలి అడుగు మాత్రమే. ముమ్ముందు చేయాల్సిన కృషి చాలా ఉంది. ఇందుకు క్షేత్ర స్థాయిలో పరిస్థితులు ఇప్పుడు అనుకూలంగా ఉన్నాయి.

**పుణ్య క్షేత్రాలలోనూ తప్పని ఓటమి**

హిందూత్వను హైజాక్ చేసేందుకు ప్రయత్నించిన బీజేపీ చివరికి ఫైజాబాద్‌లో కూడా ఓటమి పాలైంది. శ్రవస్తి, సీతాపూర్, చిత్రకూట్, మయాపూర్, షిర్డీ, తిరుపతి, రామనాథపురం వంటి ఆధ్యాత్మిక కేంద్రాల్లో కూడా బీజేపీకి పరాభవం తప్పలేదు. హిందూత్వ వాదాన్ని తలకెత్తుకున్నప్పటికీ అనేక హిందూ దేవాలయ ట్రస్ట్ బోర్డులు బీజేపీకి గుడ్డిగా మద్దతు ఇవ్వకపోవడం గమనార్హం. ముస్లింలు, క్రైస్తవులు, సిక్కులకు వ్యతిరేకంగా హిందువులను పోటీకి నిలబెట్టినప్పటికీ ప్రజలు బీజేపీకి స్పష్టమైన మెజారిటీ ఇవ్వలేదు. మతపరమైన ఆరోపణలు చేస్తూ ప్రచారం చేసిన వారికి ఇది ఓ గుణపాఠం. చివరికి వారణాసిలో మోడీ మెజారిటీ కూడా పడిపోయింది. సబ్‌కా సాత్, సబ్‌కా వికాస్ వంటి నినాదాలు ఇచ్చినప్పటికీ దళితులు, ఆదివాసీలు, ఓబీసీలు బీజేపీని కాదని ఇండియా కూటమికి ఓటేశారు. ప్రజలు ఇచ్చిన తీర్పు ఎలా ఉన్నప్పటికీ మోడీ, షా ద్వయానికి దేశానికి నేతృత్వం వహించే నైతిక హక్కు మాత్రం లేదు.

**శాసనసభ ఎన్నికలకు సంసిద్ధత**

దేశంలో గాలి మార్పు స్పష్టంగా కన్పించింది. ప్రజలందరూ కులాలు, మతాలకు అతీతంగా గంగా-జమునీ తహ్జీబ్ రక్షణ కోసం ప్రాణాలను ఫణంగా పెట్టారు. వసుధైక కుటుంబంపై విశ్వాసం ప్రకటించారు. ఇక వెనకడుగు వేసే ప్రసక్తే లేదని వారంతా ఓ తనిర్ణయానికి వచ్చారు. ఈ సంవత్సరం చివర్లో మహారాష్ట్ర, హర్యానా, జార్ఖండ్ రాష్ట్రాల శాసనసభలకు ఎన్నికలు జరగాల్సి ఉంది. ఈ ఎన్నికల్లో కూడా బీజేపీకి చేదు అనుభవాలు మిగిల్చేందుకు ఇండియా కూటమి సిద్ధమవుతోంది. ఎందుకంటే అదేమంత కష్టం కాదు.

## కార్పొరేట్ విద్యాసంస్థల్లో ఫీజులు నియంత్రించాలి

(మొదటిపేజీ తరువాయి)

బోర్డును ముట్టడించారు. బోర్డు గేటు పైకి ఎక్కి విద్యార్థులు నిరసన వ్యక్తం చేశారు. ఎస్ఎఫ్ఐ జెండాలు చేబూని పెద్దఎత్తున నినాదాలు చేశారు. కొందరు విద్యార్థులు గేటు పై నుంచి ఇంటర్ బోర్డు కార్యాలయంలోకి దూకారు. పోలీసులు అడ్డుకోవడంతో అక్కడే బైఠాయించి నిరసన తెలిపారు. ఈ సమయంలో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. పోలీసులు, నాయకులకు మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. 'వుయ్ వాంట్ జస్టిస్, ఫీజుల దోపిడీని అరికట్టాలి, కార్పొరేట్ కాలేజీలపై చర్యలు తీసుకోవాలి'అంటూ ఎస్ఎఫ్ఐ నేతలు, విద్యార్థులు నినాదాలు చేశారు. ఫ్లకార్డులను ప్రదర్శించారు.

ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి టి నాగరాజు మాట్లాడుతూ రాష్ట్రంలో శ్రీచైతన్య, నారాయణ, రెసోనెన్స్, ఆకాశ్ లాంటి కార్పొరేట్ విద్యాసంస్థలు, అకాడమీల పేరుతో లాంగ్ టర్మ్, నీట్, జేఈఈ కోచింగ్ పేరుతో రూ.లక్షల ఫీజులు వసూలు చేస్తున్నాయని విమర్శించారు. ఒకే క్యాంపస్‌లో అనుమతి లేకుండా హాస్టల్, కాలేజీని నడుపుతున్నాయని చెప్పారు. వాటిపై ఇంటర్ బోర్డు అధికారుల పర్యవేక్షణ లేదన్నారు. హైదరాబాద్ మాదాపూర్, అయప్ప సొసైటీలలో పదుల సంఖ్యలో అపార్ట్‌మెంట్లు తీసుకుని అనుమతి లేకుండా ప్రవేశాలు చేపడుతూ ఫీజుల దందా చేస్తున్నాయని విమర్శించారు. హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల పరిధిలోని ఈ దందా నడుస్తున్నా అధికారులు కనీసం చర్యలు తీసుకోవడం లేదన్నారు. ప్రభుత్వం తక్షణమే కార్పొరేట్ కళాశాలల ఫీజుల దందా బంద్ చేసి నియంత్రణ చట్టం తేవాలని డిమాండ్ చేశారు. ఒకే క్యాంపస్‌లో కళాశాల, హాస్టల్ నడిపిస్తున్న యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షులు రజనీకాంత్, సంతోష్ రాథోడ్ మాట్లాడుతూ ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో 1,684 అధ్యాపక పోస్టులు ఖాళీగా ఉన్నాయనీ, వాటిని తక్షణమే భర్తీ చేయాలని చెప్పారు. కళాశాలలు ప్రారంభమై వారం రోజులు దాటినా పాఠ్యపుస్తకాలు ఇంకా ఇవ్వలేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించినట్టుగా ఉచిత పాఠ్యపుస్తకాలు, యూనిఫారాలు ఇవ్వాలనీ, మౌలిక సదుపాయాలు కల్పించాలని కోరారు. ఇంటర్ విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అందించాలని సూచించారు. రీ వెరిఫికేషన్ కోసం దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు ఉచితంగా ఆ సేవలను అందించి తప్పుల్లేకుండా మార్కులను ప్రకటించాలని డిమాండ్ చేశారు.

**ఇంటర్ బోర్డు కార్యదర్శికి వినతి**

అనంతరం ఇంటర్ బోర్డు కార్యదర్శి శృతి ఓజాను ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి టి నాగరాజు, ఉపాధ్యక్షులు రజనీకాంత్, సంతోష్ రాథోడ్, బి శంకర్, సహాయ కార్యదర్శులు ఎం మమత, డి కిరణ్, రాష్ట్ర కమిటీ సభ్యులు లెనిన్ గువేరా, ప్రణయ్, కార్తీక్‌లతో కూడిన ప్రతినిధి బృందం కలిసి వినతిపత్రం సమర్పించింది. సమస్యలను పరిష్కరించాలని ఈ సందర్భంగా నేతలు డిమాండ్ చేశారు. రాష్ట్రంలో కార్పొరేట్ కళాశాలల అక్రమాలపై అధికారుల బృందాన్ని ఏర్పాటు చేసి చర్యలు తీసుకుంటామంటూ కార్యదర్శి హామీ ఇచ్చారని వారు తెలిపారు. సమస్యలను పరిష్కరించకుంటే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని నాగరాజు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ సభ్యులు రమ్య, పవిత్ర, రాష్ట్ర నాయకులు నాగేందర్, శ్రీమాన్, శరణ్య, మస్కు చరణ్, గుండె శివ, తరంగ్, స్టాలిన్, కార్తీక్, శ్యామ్, విఘ్నేష్, లిఖిత్ తదితరులు పాల్గొన్నారు.

## వర్షాకాలం... ట్రాఫిక్ కష్టాలు నివారించండి

ప్రభుత్వ శాఖల ఉన్నతాధికారులతో సీఎస్ సమీక్ష


నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

భారీ వర్షాల వల్ల ప్రజలు పడుతున్న కష్టాలను నివారించేలా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి అధికారుల్ని ఆదేశించారు. నగర రహదారులపై నీరు నిలిచే ప్రాంతాలను గుర్తించి, వాటిని సరిదిద్దే చర్యలు వెంటనే చేపట్టాలని చెప్పారు. శుక్రవారంనాడిక్కడి బీఆర్ అంబేద్కర్ సచివాలయంలో మున్సిపల్, పోలీస్, ఫైర్, వాతావరణ శాఖల ఉన్నధికారులతో ఆమె సమీక్షా సమావేశం నిర్వహించారు. రాష్ట్రంతో పాటు గ్రేటర్ హైదరాబాద్‌లో ఈ సమస్య తీవ్రంగా ఉన్నదనీ, ట్రాఫిక్ జామ్‌తో వాహనదారులు అనేక అవస్థలు పడుతున్నారని ఆమె తెలిపారు. రహదారులపై నీరు నిల్వకుండా ఎలాంటి చర్యలు తీసుకోవాలనేదానిపై పరిశీలన చేసి, శాశ్వత పరిష్కారాలు సూచిస్తూ నివేదిక ఇవ్వాలని ఈ సందర్భంగా అధికారుల్ని కోరారు. సమావేశంలో డీజీపీ రవీ గుప్తా, విపత్తుల నిర్వహణ, ఫైర్ సర్వీసుల శాఖ డీజీ నాగిరెడ్డి, మున్సిపల్ పరిపాలన శాఖ ముఖ్య కార్యదర్శి దానకిషోర్, జీహెచ్ఎంసీ కమిషనర్ రోనాల్డ్‌రోస్, జలమండలి ఎమ్‌డీ సుదర్శన్‌రెడ్డి, హైదరాబాద్, సైబరాబాద్, రాచకొండ పోలీస్ కమిషనర్లు పాల్గొన్నారు.

## కార్పొరేట్ కబంధ హస్తాల్లో ఇంటర్ బోర్డు

ఫీజుల నియంత్రణ చట్టం తేవాలి : ఏఐఎస్ఎఫ్ నాయకుల డిమాండ్

పుట్ట లక్ష్మణ్, మణికంఠరెడ్డి సహా పలువురిని అరెస్టు చేసిన పోలీసులు



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో కార్పొరేట్ విద్యాసంస్థల కబంధ హస్తాల్లో ఇంటర్ బోర్డు ఉందని ఏఐఎస్ఎఫ్ విమర్శించింది. అవినీతి, అక్రమాలకు అది నిలయంగా మారిందని తెలిపింది. నారాయణ, శ్రీచైతన్య ఇతర కార్పొరేట్ విద్యాసంస్థలు లక్షల రూపాయల ఫీజులు చేస్తున్నా అధికారులు నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరిస్తున్నారని విమర్శించింది. ఫీజుల నియంత్రణ చట్టం తేవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం ఇంటర్ బోర్డు ముట్టడి కార్యక్రమాన్ని నిర్వహించారు. గేటు ముందు బైఠాయించి ఫ్లకార్డులను ప్రదర్శించి నినాదాలు చేశారు. ఇంటర్ బోర్డు కార్యాలయం లోపలికి వెళ్లేందుకు నాయకులు, విద్యార్థులు యత్నించారు. అక్కడే మోహరించిన పోలీసులు వారిని అడ్డుకున్నారు. ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు మణికంఠరెడ్డి, కార్యదర్శి పుట్ట లక్ష్మణ్ ఇతర నాయకులను పోలీసులు అరెస్టు చేసిన బేగంబజార్ పోలీసు స్టేషన్‌కు తరలించారు.

ఈ సందర్భంగా మణికంఠరెడ్డి, పుట్ట లక్ష్మణ్ మాట్లాడుతూ కార్పొరేట్ విద్యాసంస్థలకు సంబంధించిన అనుమతి ఒక దగ్గర, తరగతులు మరో దగ్గర నిర్వహిస్తున్నాయని విమర్శించారు. ఈ రకంగా విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడుతున్నాయని చెప్పారు. మార్కులు, ర్యాంకులే వాటి లక్ష్యమన్నారు. కార్పొరేట్ విద్యాసంస్థల్లో జరుగుతున్న దారుణాలను న్యాయస్థానాలు సుమోటోగా స్వీకరించాలని కోరారు. వాటిలో ఫీజులుంపై ప్రభుత్వం కొరఢా ఝుళిపించాలని సూచించారు. ఫీజుల నియంత్రణ చట్టం తేవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర ఆఫీసు బేరర్లు గ్యార నరేష్, గ్యార క్రాంతి, రఘురామ్, నాగజ్యోతి, రెహమాన్, నెల్లి సత్య, బరిగెల వెంకటేష్, లెనిన్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజ్ఞానంద దూకుడు

- వరల్డ్ నం.2 ఫాబియానోపై గెలుపు
- నార్వే చెస్ 2024



**స్టావింగర్ (నార్వే):** నార్వే చెస్ 2024లో భారత యువ కెరటం ఆర్. ప్రజ్ఞానంద దూకుడు కొనసాగించాడు. తొమ్మిదో రౌండ్‌లో వరల్డ్ నం.2 ఫాబియానో కరువాన (అమెరికా)పై విజయం సాధించాడు. ఫాబియానోపై గెలుపుతో 13 పాయింట్లకు ఎగబాకిన ప్రజ్ఞనంద మూడో స్థానంలో నిలిచాడు. వరల్డ్ నం.1, లోకల్ హీరో మాగ్నస్ కార్ల్‌సన్.. అలిరెజాపై విజయం సాధించి 16 పాయింట్లతో అగ్రస్థానంలో కొనసాగుతున్నాడు. మరో మ్యాచ్‌లో వరల్డ్ చాంపియన్ డింగ్ లైరెన్ చేతిలో ఓడిన హికారు నకమురు (14.5 పాయింట్లు) (అమెరికా) రెండో స్థానానికి పరిమితం అయ్యాడు. మహిళల విభాగంలో ఆర్ వైశాలి, కోనేరు హంపి చైనా గ్రాండ్‌మాస్టర్ల చేతిలో ఓటమి చెందారు.

## ట్రెండింగ్‌లో క్రికెట్

- అమెరికన్ల గూగుల్ సెర్చ్

**న్యూయార్క్:** ప్రచారానికి, మౌళిక వసతులకు వందల కోట్ల వ్యయం. క్రిస్ గేల్, యువరాజ్, ఉసేన్ బోల్ట్ వంటి మెగా అంబాసిడర్లు. న్యూయార్క్‌లో భారత్, పాకిస్థాన్ మెగా మ్యాచ్. అయినా, అమెరికాలో క్రికెట్ పట్ల పెద్దగా ఆసక్తి కనిపించలేదు. టీ20 ప్రపంచకప్ మొదలైనా.. ఆతిథ్య దేశంలో ఆ హంగామా కనిపించలేదు. కానీ ఒక్క మ్యాచ్ పరిస్థితి మొత్తం మార్చివేసింది. ఒక్కసారిగా అమెరికన్ల దృష్టిని క్రికెట్ వైపు మరల్చింది. పత్రికల్లో ఇతర క్రీడలతో సమానంగా క్రికెట్ గురించి వార్తలు సహా ఇంటర్‌నెట్‌లో క్రికెట్ గురించి అన్వేషణ ఒక్కసారిగా మొదలైంది. ప్రపంచకప్ గ్రూప్-ఏ మ్యాచ్‌లో పాకిస్థాన్‌పై అమెరికా సూపర్ విక్టరీతో ఇప్పుడు అమెరికాలో క్రికెట్ గూగుల్ సెర్చ్‌లో ట్రెండ్ అవుతోంది.

'క్రికెట్ ఎక్కడ పుట్టింది?, క్రికెట్ ఎలా ఆడాలి?, క్రికెట్ రూల్స్ ఏమిటీ?, క్రికెట్ పదాలు? క్రికెట్‌లో సూపర్ ఓవర్ అంటే ఏమిటి?, అమెరికా క్రికెట్ కెప్టెన్ ఎవరు? అమెరికా క్రికెట్ రోస్టర్? అమెరికా క్రికెట్ టీమ్?... ఇలా అమెరికన్లు గూగుల్‌లో తెగ వెతుకుతున్నారు. భారత్, పాకిస్థాన్ మ్యాచ్ ముంగిట అమెరికాలో క్రికెట్ గూగుల్ సెర్చ్‌లో ట్రెండ్ అవటంతో ఐసీసీ సైతం ఖుషీగా ఉన్నట్టు తెలుస్తోంది. ఇక గురువారం అర్థరాత్రి అనంతరం ముగిసిన ఉత్కంఠ మ్యాచ్‌లో పాకిస్థాన్‌పై అమెరికా సూపర్ ఓవర్‌లో 5 పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది. నిర్ణీత ఓవర్ల మ్యాచ్‌లో తొలుత పాకిస్థాన్ 159/7 పరుగులు చేయగా.. అమెరికా 159/3 పరుగులు చేసింది. సూపర్ ఓవర్లో 18 పరుగులు చేయగా.. పాకిస్థాన్ 13 పరుగులే చేసింది.

# లో స్కోర్లు లోడింగ్?



- భారత్, పాక్ మ్యాచ్‌పై మార్కెట్ ఆందోళన
- ఐసీసీ తీరుపై ప్రసారదారు అసంతృప్తి
- ఆదివారం దాయాదుల మెగా మ్యాచ్

**భారత్, పాకిస్థాన్ టీ20 ప్రపంచకప్ మ్యాచ్. ఇరు దేశాల్లోనూ టెలివిజన్‌కు ప్రైమ్ టైమ్. వినోదం కోసం అభిమానులు, ఆదాయం కోసం ప్రసారదారు, అమెరికాలో క్రికెట్ బ్రాండ్ నిలబడేందుకు ఐసీసీ... ఇలా అందరూ ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న అత్యంత కీలక మ్యాచ్. టీ20 క్రికెట్ అంటేనే పరుగుల పండుగ. కానీ న్యూయార్క్ పిచ్‌పై వికెట్ల జాతర సాగుతున్న తరుణంలో భారత్, పాక్‌లోనూ స్వల్ప స్కోర్లు నమోదు కానున్నాయి!. ప్రపంచ కమర్షియల్ మార్కెట్ రాజధాని అమెరికాలో క్రికెట్‌ను బ్రాండ్‌ను పెంచగల మ్యాచ్‌లో లో స్కోర్లు ఐసీసీ లక్ష్యానికి గండి కొట్టే ప్రమాదం నెలకొంది.**

నవతెలంగాణ క్రీడావిభాగం

**దాయాదుల పోరుకు కొత్త పిచ్!:**
నాసా కౌంటీ ఇంటర్నేషనల్ క్రికెట్ స్టేడియంలో ఆరు డ్రాప్ ఇన్ పిచ్‌లు సిద్ధం చేశారు. ఇందులో 2, 4 పిచ్‌లను ఇప్పటివరకు వినియోగించారు. నేడు నెదర్లాండ్స్, దక్షిణాఫ్రికా మ్యాచ్‌కు 1, 3 పిచ్‌లలో ఒకటి వాడతారు. ఆదివారం జరిగే భారత్, పాకిస్థాన్ మ్యాచ్‌కు మిగిలిన పిచ్‌లను వినియోగించనున్నారు. ఇప్పటికే కొత్త పిచ్‌లపై పేసర్లకు అనూహ్య బౌన్స్, పేస్ లభిస్తున్నాయి. తొలి మ్యాచ్‌లో ఆ ప్రభావం రెట్టింపు అవుతుంది. శ్రీలంక 77, ఐర్లాండ్ 96 పరుగులకు ఆలౌటయ్యాయి. నేడు సఫారీ, డచ్ మ్యాచ్‌లోనూ వంద పరుగుల మార్క్ గగనమే కానుంది.

**పేసర్లకు పండుగ:**
భారత్, పాకిస్థాన్ జట్లలో నాణ్యమైన పేసర్లకు కొదవ లేదు. అర్షదీప్ సింగ్, జశ్‌ప్రీత్ బుమ్రా, మహ్మద్ సిరాజ్‌లు పదునైన స్వింగ్, బౌన్స్‌తో రాణించారు. పాక్ శిబిరంలో షహీన్ అఫ్రిది, మహ్మద్ ఆమీర్, నసీం షా, హరీశ్ రవూఫ్‌లు స్వింగ్‌కు పెట్టింది పేరు. టాస్‌తో సంబంధం లేకుండా ఎవరు బ్యాటింగ్‌కు వచ్చినా పరుగుల వేటలో చుక్కలు కనిపించనున్నాయి. ఐర్లాండ్‌తో మ్యాచ్‌లో రోహిత్ శర్మ, రిషబ్ పంత్‌లు అనూహ్య బౌన్స్‌కు గాయపడే పరిస్థితి!. అర్షదీప్ సింగ్ వరుస వైడ్ల అనంతరం క్రాస్ సీమ్‌తో బంతి సంధించినా.. బంతి గింగిరాలు తిరుగుతూ దూసుకెళ్లింది. ఇరు జట్ల పేసర్లు వికెట్ల పండుగ చేసుకోనుండగా.. భారత్, పాక్ బ్యాటర్లకు డ్రాప్ ఇన్ పిచ్‌పై పరుగుల వేట కఠిన సవాల్‌గా మారనుంది.

**ప్రసారదారు ఆందోళన:**
టీ20 క్రికెట్‌లో పరుగుల వేట ఆదాయాన్ని రెట్టింపు చేస్తుంది. పేసర్లు ఎంత గొప్పగా బంతులేసినా, కండ్లుచెదిరే రీతిలో వికెట్లను గిరాటేసినా ఇటు అభిమానుల్లో, అటు ప్రసారదారుకు సంతృప్తి ఉండదు!. పరుగుల వేట తటస్థ అభిమానులను క్రికెట్‌కు ఆకర్షితులను చేయగలదు. ప్రసారదారుకు రికార్డు వీక్షణలతో పాటు వాణిజ్య ప్రకటనల టారీఫ్ అమాంతం పెంచుకునేందుకు సులువైన మార్గం వేయగలదు. భారత్, పాక్ మ్యాచ్‌తో ఇటు ఐసీసీ, అటు ప్రసారదారు అత్యధిక ఆదాయం ఆర్జించేందుకు లక్ష్యం పెట్టుకున్నాయి. టికెట్ల కొనుగోలు రూపంలో ఐసీసీకి ఇప్పటికే గట్టి దెబ్బ పడింది. భారత్, పాక్ మ్యాచ్ డైమండ్ క్లబ్ టికెట్ ధర రూ.8.4 లక్షలతో ఐసీసీ గణనీయంగా ఆర్జించనుంది. సాధారణ స్టాండ్ టికెట్‌కు సైతం రూ.25 వేలు వసూలు చేస్తోంది. స్వల్ప స్కోర్ల థ్రిల్లర్‌తో అభిమానుల్లో క్రేజ్, మార్కెట్ హైప్ తగ్గే ప్రమాదం ఉంది.

**ఐసీసీ కింకర్తవ్యం:**
భారత్, పాక్ మ్యాచ్‌ను న్యూయార్క్‌లో నిర్వహించి.. ప్రపంచ కార్పోరేట్ మార్కెట్ రాజధాని



అమెరికాకు క్రికెట్‌ను పరిచయం చేయాలని లక్ష్యం పెట్టుకున్న ఐసీసీ ఆ దిశగా సరైన ఆచరణ చేపట్టలేదు. డ్రాప్ ఇన్ పిచ్‌లు సాధారణంగా స్పందించేందుకు మైదానంలో కుదురుకునేందుకు కాస్త సమయం పడుతుంది. కనీసం 10-12 ఫస్ట్ క్లాస్ మ్యాచులు ఆడాలి. అప్పుడే పిచ్ సహజంగా స్పందిస్తుంది. ఆస్ట్రేలియా నుంచి డ్రాప్ ఇన్ పిచ్‌లను తీసుకొచ్చి కొన్నాండ్లు ఫ్లోరిడాలో ఉంచిన ఐసీసీ.. టీ20 ప్రపంచకప్ ఆరంభానికి ముందు మాత్రమే న్యూయార్క్‌కు తీసుకొచ్చింది. బంగ్లాదేశ్, భారత్ వార్మప్ మ్యాచ్ కొత్త డ్రాప్ ఇన్ పిచ్‌పై తొలి మ్యాచ్. డ్రాప్ ఇన్ పిచ్‌లపై ఐసీసీ కొన్ని ఫస్ట్ క్లాస్ మ్యాచులు ఆడేందుకు ఏర్పాటు చేయగలిగితే.. ఇప్పుడు ప్రపంచకప్‌లో స్వల్ప స్కోర్లు చూసేవాళ్లం కాదు. ఇవే పిచ్‌లు రెగ్యులర్ స్టేడియాల్లో ఎదురైతే ఇప్పటికే ఐసీసీ భారీ జరిమానాలతో కొరఢా ఝులిపించి ఉండేది!.

# స్కాట్లాండ్ మురిసె!

**స్కాట్లాండ్ మురిసింది. ఐసీసీ టీ20 ప్రపంచకప్‌లో తొలి విజయం సాధించింది. గ్రూప్-బిలో తొలి మ్యాచ్ వర్షార్పణం కాగా.. రెండో మ్యాచ్‌లో స్కాట్లాండ్ రెండు పాయింట్లు ఖాతాలో వేసుకుంది. ఆసీస్, ఇంగ్లాండ్‌లను వెనక్కి నెట్టి గ్రూప్‌లో అగ్రస్థానంలో నిలిచింది. నమీబియా తొలుత 20 ఓవర్లలో 9 వికెట్లకు 155 పరుగులు చేయగా.. 18.3 ఓవర్లలోనే స్కాట్లాండ్ లక్ష్యాన్ని ఛేదించింది. 5 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది.**

- నమీబియాపై 5 వికెట్లతో గెలుపు
- మైకల్ లీస్క్ ఆల్‌రౌండ్ ప్రదర్శన

**నమీబియా 155/9, స్కాట్లాండ్ 157/5**

నవతెలంగాణ-బ్రిడ్జ్‌టౌన్

మైకల్ లీస్క్ (35, 17 బంతుల్లో 4 సిక్స్‌లు), (1/16) ఆల్‌రౌండ్ ప్రదర్శనతో చెలరేగాడు. తొలుత బంతితో ఆకట్టుకున్న మైకల్ లీస్క్.. ఛేదనలో బ్యాట్‌తో గెలుపు ఇన్నింగ్స్‌తో కదం తొక్కాడు. మైకల్ మెరుపు ప్రదర్శనతో గ్రూప్-బిలో నమీబియాపై స్కాట్లాండ్ 5 వికెట్ల తేడాతో విజయం సాధించింది. 156 పరుగుల ఛేదనలో స్కాట్లాండ్ బ్యాటర్లు ఆకట్టుకున్నారు. ఓపెనర్ మైకల్ జోన్స్ (26, 20 బంతుల్లో 3 ఫోర్లు, 1 సిక్స్), రిచీ బెరింగ్టన్ (47 నాటౌట్, 35 బంతుల్లో 2 ఫోర్లు, 2 సిక్స్‌లు) రాణించారు. మరో 9 బంతులు మిగిలి ఉండగానే లక్ష్యాన్ని ఛేదించిన స్కాట్లాండ్ మెరుపు విజయంతో గ్రూప్‌లో అగ్రస్థానం కైవసం చేసుకుంది. అంతకుముందు, నమీబియా తొలుత 20 ఓవర్లలో 9 వికెట్లకు 155 పరుగులు చేసింది. గెరార్డ్ ఎరాస్మస్ (52, 31 బంతుల్లో 5 ఫోర్లు, 2 సిక్స్‌లు) అర్థ సెంచరీతో రాణించాడు.



స్కాట్లాండ్ స్టార్ మైకల్ లీస్క్ 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్' అవార్డు అందుకున్నాడు.

**మైకల్ మెరువగా..:** స్కాట్లాండ్ లక్ష్యం 156 పరుగులు. బ్రిడ్జ్‌టౌన్‌లో స్లో పిచ్‌పై ఈ లక్ష్య ఛేదన కష్టమే. తొలి పది ఓవర్లలో మూడు వికెట్లు చేజార్చుకున్న స్కాట్లాండ్... మ్యాచ్‌పై పట్టు బిగించలేదు. జార్జ్ మున్సె (7), మైకల్ జోన్స్ (26), బ్రాండన్ మెక్‌ములన్ (19)లు ఆరంభంలో మెప్పించారు. రిచీ బెరింగ్టన్ (47 నాటౌట్) కెప్టెన్సీ ఇన్నింగ్స్‌తో కదం తొక్కాడు. మాథ్యూ క్రాస్ (3) నిరాశపరిచినా మైకల్ లీస్క్ (35) తోడుగా స్కాట్లాండ్‌ను గెలుపు తీరాలకు చేర్చాడు. బెరింగ్టన్, మైకల్ జోడీ 42 బంతుల్లోనే 74 పరుగుల భాగస్వామ్యం నెలకొల్పి నమీబియా ఆశలను ఆవిరి చేసింది. ఆఖర్లో మైకల్ నిష్క్రమించినా.. క్రిస్ (4 నాటౌట్) తోడుగా బెరింగ్టన్ లాంఛనం పూర్తి చేశాడు. నమీబియా బౌలర్లలో ఎరాస్మస్ (2/29), రూబెన్ (1/36), బెర్నార్డ్ (1/20) రాణించారు.

**ఎరాస్మస్ షో:** టాస్ నెగ్గి తొలుత బ్యాటింగ్ ఎంచుకున్న నమీబియా మంచి స్కోరు సాధించింది. ఓపెనర్ కోట్జే (0) నిరాశపరిచినా.. నికోలస్ డావిన్ (20), జాన్ ఫ్రైలింక్ (12) రాణించారు. మిడిల్ ఆర్డర్‌లో గెరార్డ్ ఎరాస్మస్ (52) అర్థ శతక ఇన్నింగ్స్‌తో నమీబియాను ఆదుకున్నాడు. జేన్ గ్రీన్ (28, 27 బంతుల్లో 1 ఫోర్, 1 సిక్స్), డెవిడ్ వైసీ (14), స్మిత్ (11) విలువైన పరుగులు జోడించారు. స్కాట్లాండ్ బౌలర్లలో బ్రాడ్ వీల్ (3/33), బ్రాడ్ (2/16)లు వికెట్ల వేటలో మెప్పించారు.

# పోరాడినా.. ఫ్చ్!

- క్వార్టర్స్‌లో లక్ష్యసేన్ ఓటమి
- ఇండోనేషియా ఓపెన్ సూపర్ 1000




**జకర్తా (ఇండోనేషియా):** పారిస్ 2024 ఒలింపిక్స్ ముంగిట భారత అగ్రశ్రేణి షట్లర్లకు ఏదీ కలిసి రావటం లేదు. షటిల్ కోర్టులో ఆఖరు వరకు చెమటోడ్చుతున్నా... వెంట్రుక వాసిలో విజయానికి దూరమవుతున్నారు. పురుషుల సింగిల్స్‌లో స్టార్ షట్లర్ లక్ష్యసేన్ ఇండోనేషియా ఓపెన్ నుంచి నిష్క్రమించాడు. లక్ష్యసేన్ ఓటమితో సూపర్ 1000 టోర్నీలో భారత ఆశలకు తెరపడింది. శుక్రవారం జరిగిన క్వార్టర్‌ఫైనల్ మ్యాచ్‌లో వరల్డ్ నం.4 డెన్మార్క్ షట్లర్ ఆండర్స్ ఆంటోన్సెన్ చేతిలో లక్ష్యసేన్ 22-24చ, 18-21తో పరాజయం పాలయ్యాడు. 61 నిమిషాల హోరాహోరీ మ్యాచ్‌లో లక్ష్యసేన్ అద్భుతంగా రాణించాడు. కానీ రెండు గేముల్లోనూ ఆఖర్లో అనవసర తప్పిదాలు విజయాన్ని దూరం చేశాయి. తొలి గేమ్‌లో ఆంటోన్సెన్ తొలుత 4-0తో ముందంజ వేశాడు. పుంజుకున్న లక్ష్యసేన్ 5-5తో స్కోరు సమం చేశాడు. 15-11తో ఆధిక్యంలోకి దూసుకెళ్లాడు. ఆంటోన్సెన్ పుంజుకుని ఈసారి 16-16తో స్కోరు సమం చేశాడు. ఇక్కడ్నుంచి 22-22 వరకు నువ్వా నేనా అన్నట్టు ఒక్కో పాయింట్ కోసం సేన్, ఆంటోన్సెన్ పోటీపడ్డారు. 32 నిమిషాల తొలి గేమ్‌లో చివర్లో వరుస పాయింట్లు సాధించిన ఆంటోన్సెన్ 1-0 ఆధిక్యంలో నిలిచాడు. ఇక రెండో గేమ్‌లోనూ ఇదే కథ పునరావృతం. లక్ష్యసేన్, ఆంటోన్సెన్ ఆఖరు వరకు ఒక్కో పాయింట్ కోసం చెమటోడ్చారు. 18-18 వరకు పోటీ ఇలాగే సాగింది. మరోసారి ఆఖర్లో ఒత్తిడికి లోనైన లక్ష్యసేన్ వరుసగా మూడు పాయింట్లు కోల్పోయాడు. రెండో గేమ్‌తో పాటు సెమీఫైనల్ బెర్త్‌ను సైతం చేజార్చుకున్నాడు. ఈ విజయంతో లక్ష్యసేన్‌పై ఆంటోన్సెన్ 3-2తో ముఖాముఖి రికార్డును మెరుగుపర్చుకున్నాడు.

# నేటినుంచి ఉపాధ్యాయ బదిలీలు, పదోన్నతులు

- హైకోర్టు ఆదేశాలతో రంగారెడ్డి జిల్లాకు మినహాయింపు
- టెట్ లేకుండానే టీచర్లకు ప్రమోషన్స్
- గతంలో ఆగిపోయినప్పటి నుంచి ఇప్పుడు ప్రారంభం
- మల్టీజోన్-1లో 22 వరకు నిర్వహణ
- మల్టీజోన్-2లో 30 వరకు పూర్తి
- మూడేండ్లలోపు ఉద్యోగ విరమణ చేసే వారికి మినహాయింపు
- షెడ్యూల్ విడుదల

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో శనివారం నుంచి ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతుల ప్రక్రియ తిరిగి ప్రారంభం కానుంది. ఈ మేరకు విద్యాశాఖ ముఖ్యకార్యదర్శి బుర్రా వెంకటేశం షెడ్యూల్‌ను శుక్రవారం విడుదల చేశారు. వెబ్ కౌన్సెలింగ్ ద్వారా బదిలీలను చేపడతామని స్పష్టం చేశారు. మూడేండ్లలోపు ఉద్యోగ విరమణ చేసే ఉపాధ్యాయులకు తప్పనిసరి బదిలీ నుంచి మినహాయింపు ఉంటుందని వివరించారు. మల్టీజోన్-1 పరిధిలో శనివారం నుంచి ఈనెల 22 వరకు, మల్టీజోన్-2 పరిధిలో శనివారం నుంచి ఈనెల 30 వరకు బదిలీలు, పదోన్నతుల ప్రక్రియను పూర్తి చేస్తామని తెలిపారు. కోర్టు కేసులతో గతంలో ప్రక్రియ ఎక్కడ ఆగిపోయిందో అక్కడి నుంచే ఇప్పుడు ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. టెట్‌తో సంబంధం లేకుండానే ఉపాధ్యాయులకు పదోన్నతులు కల్పిస్తామని వివరించారు. హైకోర్టులో స్టే ఉన్నందున రంగారెడ్డి జిల్లాకు మినహాయింపు ఉంటుందని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా ఈ ప్రక్రియను చేపడతామని పేర్కొన్నారు. రాష్ట్రంలో 19 వేల మంది ఉపాధ్యాయులకు పదోన్నతులు లభించే అవకాశమున్నట్టు తెలిసింది. బదిలీల కోసం రాష్ట్రవ్యాప్తంగా 81,069 మంది ఉపాధ్యాయులు దరఖాస్తు చేశారు. వారిలో సుమారు 60 వేల మంది వరకు బదిలీ అయ్యే అవకాశముందని సమాచారం.



గతేడాది ఆగస్టు, సెప్టెంబర్‌లో పదోన్నతులు, బదిలీల ప్రక్రియను విద్యాశాఖ చేపట్టింది. పదోన్నతులకు టెట్ ఉత్తీర్ణత తప్పనిసరి అంటూ సెప్టెంబర్‌లో హైకోర్టు తీర్పు ఇచ్చింది. దీంతో ఆ ప్రక్రియ నిలిచిపోయింది. దానికితోడు 317 జీవో వల్ల ఇతర జిల్లాల నుంచి ఉపాధ్యాయులు రావడం వల్ల తమ సీనియార్టీ దెబ్బతిని నష్టపోతున్నామంటూ ఉన్నత న్యాయస్థానంలో రంగారెడ్డి జిల్లా ఉపాధ్యాయులు పిటిషన్ దాఖలు చేశారు. అప్పటికే మల్టీజోన్-1లో గెజిటెడ్ హెచ్‌ఎంలుగా పదోన్నతులు, బదిలీల ప్రక్రియను పూర్తి చేశారు. 782 మంది పదోన్నతులు పొందారు. స్కూల్ అసిస్టెంట్ బదిలీలు కూడా పూర్తయ్యాయి. అయితే స్కూల్ అసిస్టెంట్ పదోన్నతులను చేపట్టలేదు. బదిలీ అయిన వారిని పాత స్థానాల నుంచి రిలీవ్ చేయలేదు. ఎస్జీటీల బదిలీలు కూడా ఆగిపోయాయి.

మల్టీజోన్-1 పరిధిలో బదిలీ అయిన స్కూల్ అసిస్టెంట్లను వెంటనే రిలీవ్ చేయాలని బుర్రా వెంకటేశం ఆదేశించారు. శని, ఆదివారాల్లో స్కూల్ అసిస్టెంట్ ఖాళీల వివరాలతోపాటు సీనియార్టీ జాబితాను అందుబాటులో ఉంచాలని కోరారు. ఈనెల 10,11 తేదీల్లో సీనియార్టీ జాబితాపై అభ్యంతరాలను స్వీకరిస్తామని తెలిపారు. 12న తుది సీనియార్టీ జాబితా అందుబాటులో ఉంటుందని వివరించారు. ఈనెల 13 నుంచి 16 వరకు స్కూల్ అసిస్టెంట్ పదోన్నతులకు ఎస్జీటీలు, తత్సమాన క్యాడర్ వారు వెబ్‌ఆప్షన్లను నమోదు చేస్తారని పేర్కొన్నారు. ఎస్జీటీలకు జిల్లా పరిషత్, ప్రభుత్వ యాజమాన్యాల్లో అన్ని సబ్జెక్టులకూ పదోన్నతులను కల్పించి ఉత్తర్వులను జారీ చేస్తారని తెలిపారు. 17న ఎస్జీటీల ఖాళీల వివరాలను ప్రకటిస్తామని పేర్కొన్నారు. వాటిపై అభ్యంతరాలను స్వీకరిస్తామని తెలిపారు. ఈనెల 18 నుంచి 20 వరకు ఎస్జీటీల బదిలీల కోసం వెబ్‌ఆప్షన్లను నమోదు చేయాలని సూచించారు. బదిలీల కోసం కౌన్సెలింగ్‌ను నిర్వహిస్తామని వివరించారు. ఈనెల 21,22 తేదీల్లో ఎస్జీటీల బదిలీలకు సంబంధించిన ఉత్తర్వులు జారీ చేస్తామని తెలిపారు.

మల్టీజోన్-2 పరిధిలో శనివారం జిల్లా పరిషత్ పాఠశాలల్లో హెడ్మాస్టర్ పదోన్నతుల కోసం సీనియార్టీ జాబితాను ప్రకటిస్తామని వెంకటేశం పేర్కొన్నారు. వాటిపై అభ్యంతరాలను స్వీకరిస్తామని తెలిపారు. ఈనెల తొమ్మిదిన అభ్యంతరాలకు సమాధానమిస్తామని పేర్కొన్నారు. ఈనెల 10,11 తేదీల్లో తుది సీనియార్టీ జాబితాను విడుదల చేస్తామనీ, స్కూల్ అసిస్టెంట్ల నుంచి వెబ్‌ఆప్షన్లను స్వీకరిస్తామని తెలిపారు. వారికి పదోన్నతుల ఆర్డర్లను జారీ చేస్తామని వివరించారు. ఈనెల 12,13 తేదీల్లో స్కూల్ అసిస్టెంట్ల ఖాళీల వివరాలను ప్రకటిస్తామని పేర్కొన్నారు. 14న అభ్యంతరాలను స్వీకరిస్తామని తెలిపారు. ఈనెల 16 నుంచి 18 వరకు స్కూల్ అసిస్టెంట్ బదిలీల కోసం వెబ్‌ఆప్షన్లను నమోదు చేయాలని సూచించారు. ఈనెల 19న వారికి కౌన్సెలింగ్ నిర్వహించి బదిలీల ఉత్తర్వులను జారీ చేయాలని కోరారు. ఈనెల 20న స్కూల్ అసిస్టెంట్ ఖాళీల వివరాలను ప్రకటించాలని తెలిపారు. 21 నుంచి 24 వరకు ఎస్జీటీలకు స్కూల్ అసిస్టెంట్ పదోన్నతుల కోసం వెబ్‌ఆప్షన్లను స్వీకరిస్తామని వివరించారు. ఆయా తేదీల్లో పదోన్నతుల ఆర్డర్లను ఇవ్వాలని సూచించారు. 25న ఎస్జీటీల ఖాళీలను ప్రకటించాలని తెలిపారు. 26 నుంచి 28 వరకు తుది సీనియార్టీ జాబితాను ప్రకటిస్తామనీ, వెబ్‌ఆప్షన్లను స్వీకరిస్తామనీ, కౌన్సెలింగ్ నిర్వహించి ఎస్జీటీలకు బదిలీలు చేపడతామని పేర్కొన్నారు. ఈనెల 29 నుంచి 30 వరకు ఎస్జీటీలకు బదిలీల ఉత్తర్వులను జారీ చేస్తామని తెలిపారు.

**ఉపాధ్యాయ సంఘాల హర్షం**
రాష్ట్రంలో ఉపాధ్యాయ బదిలీలు, పదోన్నతులను చేపట్టేందుకు షెడ్యూల్‌ను విడుదల చేయడం పట్ల ఉపాధ్యాయ సంఘాలు హర్షం ప్రకటించాయి. ఈ మేరకు టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు కె జంగయ్య, ప్రధాన కార్యదర్శి చావ రవి, ఎస్టీయూటీఎస్ అధ్యక్షులు ఎం పర్వత్‌రెడ్డి, జి సదానందంగౌడ్, పీఆర్టీయూటీఎస్ అధ్యక్షులు పింగిలి శ్రీపాల్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి బీరెల్లి కమలాకర్‌రావు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ బదిలీలు, పదోన్నతుల ప్రక్రియను సజావుగా నిర్వహించి పూర్తి చేయాలని కోరారు. ఈ ప్రక్రియను పూర్తి చేయడానికి ఉపాధ్యాయులు సహకరించాలని సూచించారు.

# తీన్మార్.. విజయం

- వరంగల్- ఖమ్మం- నల్లగొండ జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీగా ఎన్నిక
- సెకండ్ ప్రియార్టీ కౌంటింగ్‌తో తేలిన ఫలితం
- నిర్దేశిత ఓట్లు 1,55,095 సాధించి రాకేశ్‌రెడ్డిపై మల్లన్న గెలుపు
- మూడ్రోజుల పాటు కొనసాగిన కౌంటింగ్

నవతెలంగాణ- ఖమ్మం ప్రాంతీయ ప్రతినిధి/ మిర్యాలగూడ

ఉమ్మడి వరంగల్-ఖమ్మం- నల్లగొండ జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీగా తీన్మార్ మల్లన్న గెలుపొందారు. ఉప ఎన్నిక ఫలితం శుక్రవారం రాత్రి వెలువడింది. మొదటి ప్రాధాన్యత ఓట్లతో విజేత వెల్లడి కాకపోవడంతో రెండో ప్రాధాన్యత ఓట్లను లెక్కించారు. ద్వితీయ ప్రాధాన్యత ఓట్లలోనూ తీన్మార్ మల్లన్న అలియాస్ చింతపండు నవీన్‌కుమార్ పైచేయి సాధించారు. తన సమీప ప్రత్యర్థి, బీఆర్‌ఎస్ అభ్యర్థి ఏనుగుల రాకేశ్‌రెడ్డి కన్నా ముందుగా కోటా ఓట్లు 1,55,095 ఓట్లు సాధించి విజయం సాధించారు. కాంగ్రెస్, బీఆర్‌ఎస్, బీజేపీ అభ్యర్థుల మధ్య నువ్వానేనా అన్నట్టు పోటీ సాగింది. రెండో ప్రాధాన్యత ఓట్ల లెక్కింపులో భాగంగా శుక్రవారం ఎలిమినేషన్ ప్రక్రియ చేపట్టారు. ఈ ఎన్నికల బరిలో ఉన్న 52 మందిలో చివరి అభ్యర్థి నుంచి ఎలిమినేషన్ ప్రక్రియ మొదలుపెట్టారు. వెయ్యి ఓట్లలోపు ఉన్న అభ్యర్థులకు పోలైన ఓట్లలో ద్వితీయ ప్రాధాన్యతను పరిగణలోకి తీసుకుని ఒక్కొక్కరిని తొలగిస్తూ వచ్చారు. ముగ్గురు అభ్యర్థుల్లో ఎవరు నెగ్గాలన్నా పోలైన 3,36,013 ఓట్లలో 23వేలకు పైగా చెల్లలేదు. చెల్లిన ఓట్లలో 50శాతం +1 వచ్చిన అభ్యర్థిని విజేతగా నిర్ణయించారు. ఈ మేజిక్ ఫిగర్ 1,55,095ను తీన్మార్ మల్లన్న ముందుగా అందుకోవడంతో ఆయన్ను విజేతగా ప్రకటించారు.



**రెండో ప్రాధాన్యతలోనూ మల్లన్నే..**
మొదటి ప్రాధాన్యత ఓట్లలో అత్యధికంగా తీన్మార్ మల్లన్న 1,23,813 ఓట్లు సాధించారు. మేజిక్ ఫిగర్‌కు ఆయన 31,282 ఓట్ల దూరంలో ఆగిపోయారు. ఈ నేపథ్యంలో ద్వితీయ ప్రాధాన్యత ఓట్ల లెక్కింపు చేపట్టారు. ఆయన తర్వాతి స్థానంలో ఉన్న బీఆర్‌ఎస్ అభ్యర్థి ఏనుగుల రాకేశ్‌రెడ్డికి 1,04,248 తొలి ప్రాధాన్యత ఓట్లు వచ్చాయి. విజయం సాధించాలంటే నిర్దేశిత లక్ష్యానికి 50,847 ఓట్ల దూరంలో ఉన్నారు. ఇక బీజేపీ అభ్యర్థి ప్రేమేందర్‌రెడ్డి 43,313 తొలి ప్రాధాన్యం ఓట్లు సాధించారు. 1,11,782 ఓట్ల దూరంలో ఆయన ఆగారు. స్వతంత్ర అభ్యర్థి అశోక్‌కు 29,697 తొలి ప్రాధాన్యం ఓట్లు రావడంతో ఈయన కూడా లక్ష్యానికి దూరంగా ఉన్నారు.

**ఎలిమినేషన్ షురూ..**
ఏ అభ్యర్థీ నిర్దేశిత లక్ష్యాన్ని చేరుకోకపోవడంతో ఎలిమినేషన్ ప్రక్రియ చేపట్టారు. 52 మంది అభ్యర్థుల్లో ముందంజలో ఉన్న నలుగురిని ఉంచి మిగిలిన 48 మందిని ఎలిమినేట్ చేశారు. అయినా ఏ ఒక్క అభ్యర్థీ లక్ష్యాన్ని అందుకోకపోవడంతో స్వతంత్ర అభ్యర్థి అశోక్‌ను తొలగించి, ఆయన ఓట్లను షేర్ చేశారు. అశోక్ నుంచి ద్వితీయ ప్రాధాన్యత ఓట్లను మల్లన్న, రాకేశ్‌రెడ్డి దాదాపు సమానంగా పంచుకున్నారు. దాంతో మల్లన్న 1,23,709, రాకేశ్‌రెడ్డి 1,04,846 ఓట్లకు చేరుకున్నారు. గెలుపునకు ఇంకా మల్లన్నకు 31,386, రాకేశ్‌రెడ్డికి 50,249 ఓట్లు అవసరం పడ్డాయి. ఈ క్రమంలో మల్లన్న 18,863 ఓట్ల లీడ్‌లో ఉన్నారు. అశోక్ ఎలిమినేషన్ తర్వాత రెండో ప్రాధాన్యత ఓట్లు కాంగ్రెస్‌కు 1489, బీఆర్‌ఎస్‌కు 848, బీజేపీకి 385 చొప్పున లభించాయి.

ఈ క్రమంలో మల్లన్న 19,375 ద్వితీయ ప్రాధాన్యత ఓట్ల లీడ్‌లోకి వెళ్లారు. ఆ తర్వాత బీజేపీ అభ్యర్థి ప్రేమేందర్‌రెడ్డిని సైతం తొలగించి ఓట్లు షేర్ చేశారు. బీజేపీ అభ్యర్థికి పోలైన మొదటి ప్రాధాన్యత ఓట్లలో రెండో ప్రాధాన్యతకు వచ్చేసరికి బీఆర్‌ఎస్ అభ్యర్థికి ఎక్కువ మంది వేశారు. ఇలా సుమారు ఆరు వేల ఓట్లు రాకేశ్‌రెడ్డికి మల్లన్నతో పోలిస్తే అధికంగా పోలైనట్టు తెలుస్తోంది.

**మల్లన్న గెలుపు లాంఛనమే..**
రాత్రి 9.30 గంటల వరకు పూర్తిస్థాయి ఫలితం అధికారికంగా వెలువడలేదు. అయితే మలన్న గెలుపు దాదాపు ఖాయమేనని వార్తలు వినిపిస్తున్నాయి. ప్రస్తుతం బీఆర్‌ఎస్ అభ్యర్థి రాకేశ్‌రెడ్డిపై 18వేల మెజార్టీతో మల్లన్న కొనసాగుతున్నారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానాన్ని కాంగ్రెస్ పార్టీ గెలుచుకుందని మల్లన్న కౌంటింగ్ కేంద్రం వెలుపుల మీడియాకు వెల్లడించారు. మూడ్రోజుల పాటు 9 గంటలకు ఓ షిఫ్ట్ చొప్పున రోజుకు మూడు షిఫ్టులుగా సిబ్బంది శ్రమించి ఫలితాన్ని తేల్చారు.

# ఆందోళన వద్దు.. అవగాహన పెంచుకోండి

(మొదటిపేజీ తరువాయి)

వస్తుంటాయి. ఇవి రాకుండా ఇంటిని పరిశుభ్రంగా ఉంచుకోవడం, వేడి ఆహారాన్ని మాత్రమే భుజించడం, నీరు నిల్వలేకుండా చూసుకోవడం, డెంగ్యూ ప్రబలకుండా దోమల ఉత్పత్తి జరగకుండా పాత సామానుల ను తీసేయడం ఉంచుకోవడం వంటివి చేయాలి.

**ఈ వ్యాధులపరంగా రిస్క్ ఎక్కువ ఉన్న వారెవరు?**
చిన్నారులు, వృద్ధులు, గర్భిణులు, పాలిచ్చే తల్లులతో పాటు, దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తుల్లో రోగ నిరోధక శక్తి తక్కువగా ఉంటుంది. అందువల్ల ఆయా వ్యాధుల బారిన వీరు ఎక్కువగా పడే అవకాశముంది. ఇలాంటి వారు మరింత జాగ్రత్తలు తీసుకోవాలి. వర్షంలో తడవకూడదు. తప్పనిసరిగా బయటికి వెళ్లాల్సి వస్తే గొడుగు ఉపయోగించాలి. ఇతరత్రా జాగ్రత్తలు తీసుకోవడం కూడా అవసరం.

**సీజనల్ వ్యాధుల లక్షణాలు కనిపిస్తే ఏమి చేయాలి?**
సీజనల్ వ్యాధులకు ఆందోళన చెందాల్సిన పని లేదు. ప్రతి సారి ఈ వానాకాలంలో వచ్చే వ్యాధులే అవి. జ్వరం, దగ్గు, జలుబు, గొంతు నొప్పి వంటివి వస్తే మూడు రోజుల్లో తగ్గిపోతాయి. అప్పటికీ తగ్గకపోతే వెంటనే డాక్టర్‌ను సంప్రదించడం మంచిది. సాధారణ డెంగ్యూ వస్తే ఆందోళన చెందాల్సిన పని లేదు. డెంగ్యూ షాక్ సిండ్రోమ్ (తీవ్రమైన దశ)కు చేరితే అది ప్రాణాంతంగా మారే ప్రమాదముంది. ఆ పరిస్థితిలో ప్లేట్ లెట్స్ తగ్గుతుంటాయి. ఆరోగ్యవంతునిలో 1.5 లక్షల నుంచి 4 లక్షల వరకు అవి ఉంటాయి. వాటి సంఖ్య లక్షలోపునకు తగ్గితే వెంటనే జాగ్రత్త పడాలి. అయితే వాటి సంఖ్య మరీ తగ్గి 20 వేల లోపుకు పడిపోతే ప్లేట్ లెట్స్ ఎక్కించుకోవాల్సి ఉంటుంది.

**కుక్కకాటు, ఇతర జంతువులు గాయపరిచిన సందర్భాల్లో ఏం చేయాలి?**
సాధారణంగా వేసవిలో ఎక్కువగా ఉండే కుక్కకాటు కేసులు వర్షాకాలంలో తక్కువగా ఉంటాయి. అయితే కుక్కకాటు, కోతులు కరవడం, పిల్లలు గీరడం, ఇతర జంతువులచేత గాయాలపాలైతే తప్పనిసరిగా దానికి తగిన చికిత్స చేసుకోవాలి. ఈ ఏడాదిలో జనవరి నుంచి ఇప్పటి వరకు రేబీస్ వ్యాక్సిన్ వేసుకోవడంలో నిర్లక్ష్యం కారణంగా పలువురు చనిపోయారు. ముందు జాగ్రత్త చర్యల్లో భాగంగా కుక్కకాటుకు ఫీవర్ ఆస్పత్రిలో ఉచితంగా వ్యాక్సిన్లను అందిస్తున్నాం. ఇతర జంతువుల చేత గాయాలైనా ముందుగా వేసుకునే ఈ వ్యాక్సిన్ ఉపయోగపడుతుంది. వ్యాక్సిన్ ను 5 దశల్లో వేస్తున్నాం. సాధారణంగా రేబీస్ వచ్చిన వారిలో ధ్వని, వాయు, నీటి ఫోబియా లక్షణాలుంటాయి.

**ఆస్పత్రిలో రోగులకు అందుతున్న సేవలతో పాటు, కొత్తగా అందుబాటులోకి ఏమైనా సౌకర్యాలు రానున్నాయా?**
ప్రస్తుతం ప్రతి రోజు 300 నుంచి 400 మంది వరకు అవుట్ పేషెంట్లు వస్తున్నారు. వారిలో దాదాపు 50 శాతం మందికి టెస్టులు అవసరం పడుతున్నాయి. వారికి పరీక్షలు చేసేందుకు అవసరమైన ల్యాబ్ సౌకర్యంతో పాటు అవసరమైనంత మంది సిబ్బంది అందుబాటులో ఉన్నారు. అందులో వైరాలజీ, ప్యాథాలజీ, బయోకెమిస్ట్రీకి సంబంధించిన పరీక్షలు చేస్తున్నారు.

రేబీస్‌కు బీబీనగర్ ఎయిమ్స్‌తో పాటు ఫీవర్ ఆస్పత్రిలో రోగ నిర్ధారణ పరీక్షలను చేస్తున్నాం. ఇటీవల నేషనల్ రేబీస్ ఎరాడికేషన్ ప్రోగ్రాం కింద కేంద్ర ప్రభుత్వం ఫీవర్ ఆస్పత్రిలో డయాగ్నస్టిక్ సేవలను గుర్తించింది. దీన్ని మరింత అభివృద్ధి చేసేందుకు ప్రతిపాదనలను పంపించాం. కొత్త అవుట్ పేషెంట్ బ్లాక్ అందుబాటులోకి రానుంది.

Printed and Published by Nandayla Narsimha Reddy on behalf of Navatelangana Printers Private Limited, Printed at Navatelangana Printers Private Limited Nallapaneni Kasaiah Nagar, Tallampadu, Khammam-507170, Telangana State, Published at Navatelangana Printers Private Limited, Nallapaneni Kasaiah Nagar, Tallampadu, Khammam-507170, Editor : R.Sudha Bhaskar. TEL TEL/2015/60886